C

ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ

ఆశుకవితలు అవధానములు - చాటువులు

రచయిత

డాక్టరు కేతవరపు రామకోటి శాస్త్రి



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

సైఫాబాదు

హైదరాబాదు - 500 004

1975

PMC01B117

ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ

ఆశుకవితలు
అవధానములు - చాటువులు

రచయిత

డాక్టరు కేతవరపు రామకోటి శాస్త్రి



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

నైఫాబాదు

హైదరాబాదు - 500 004

1975

ప్రతులు : 2000
17th March, 1975

© ANDHRA PRADESH SAHITYA AKADAMI, HYD-4.

వెల : రు. 2-50 లు.

రమేష్ ప్రింటర్స్,
హైదరాబాద్-500 020.

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధులందరినీ ఒక చోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వ యుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనాయుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్ళడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ, సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికీ, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికీ ఈ మహాసభలు దోహద కారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు అర్థవైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవనీ, ఆవిధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవనీ విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారం రోజులపాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థలనుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల

సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగు వారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజ భూతమవుతుంది. తెలుగు వారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదం చేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయములలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రంచేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు తోడ్పడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు

అధ్యక్షులు,

ప్రపంచ తెలుగు మహాసభలు.

పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్థమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగు దేశపు నలుచెరగుల పరిచితముచేయు సంకల్పముతో 1975వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయేగాక, ప్రపంచ ములోని వివిధ దేశాలలో వసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధు లందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాదున జరుగు నటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వాన సంఘము ఏర్పాటయి నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళ రావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు, విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు దాని కార్యనిర్వాహకాధ్యక్షులు, ఆర్థికమంత్రి మాన్యశ్రీ పీడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగా ఆంధ్రభాషా సాహిత్య, కళా చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వాహణకై 44 మంది సభ్యులుగల ఒక విద్వత్ సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్ సంఘము ఆ లఘుగ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆ యా రంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగా యెన్నుకొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింప పలసినదిగా ప్రపంచ తెలుగు మహా సభా కార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు అకాడమీని కోరిరి. మహాసభ సఫలతకొరకై కృషిచేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించినది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ **"ఆశుకవితలు-అవధానములు-చాటువులు"** అను గ్రంథమును రచించిన **డాక్టరు కేతవరపు రామకోటి శాస్త్రిగారు** ఆంధ్ర పాఠక లోకమునకు **సుపరిచితులు**. వారికి మేము కృతజ్ఞతాబద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన 'రమేష్ ప్రింటర్స్', చిక్కడపల్లి, హైదరాబాదు వారికి మా కృతజ్ఞత.

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

హైదరాబాదు,
తేది: 19-3-75.

విషయ సూచిక

పుట

1. చతుర్విధ కవితలు 1-10

1. స్వరూప నిరూపణము - 1; 2. మధుర కవిత - 3; 3. చిత్ర కవిత-4; 4. విస్తర కవిత-5; 5. ఆశుకవిత-6; 6. విద్వత్కవుల విమర్శన దృష్టి-7.

2. ఆశుకవితలు 11-31

1. స్వరూప నిరూపణము-11; 2. ప్రాచీనాశుకవులు-14; 2.1 శ్రీనాథుడు-14; 2.2 పెద్దన-15; 2.3 భట్టుమూర్తి-17; 3. సమస్యాపూరణము-18; 4. ఆధునికాశుకవులు - 22; 4.1 ఆశుకవితా సరస్వతులు-22; 4.2 కొప్పరపు సోదర కవులు-25; 4.3 పింగళి చిదంబర శాస్త్రి 27; 4.4 గాదే పల్లి వీరరాఘవ శాస్త్రి-29; 4.5 విశ్వనాథ సత్యనారాయణ-31.

3. అవధాన కవితలు 32-60

1. స్వరూపనిరూపణము-32; 2. ప్రారంభదశాకాలము-33; 3. అవధాన విద్యా ప్రభువులు-37; 4. అష్టావధానము-41; శతావధానము-48; 5.1 శతావధానప్రశ్నలు-50; 5.2 శతావధానము-54; 6. సహస్రావధానము-57; 7. అర్వాచీనులు-అవధానములు-59.

4. చాటు కవితలు 61-86

1. స్వరూప నిరూపణము-61; 2. చాటువులన్నియు ఆశుకవులుకావు-66; 3. చాటువుల కర్తృత్వ మొకసమస్య-68;

పుట

4. చాటు కవులు-70; 4.1 వేములవాడ భీమకవి - 70; 4.2 శ్రీనాథుడు-73; 4.3 అల్లసాని పెద్దన-77; 4.4 తెనాలి రామకృష్ణుడు - 78; 4.5 కూచిమంచి తిమ్మ కవి - 79; 4.6 ఆడిదము సూరకవి-80; 4.7 వేమూరి సీతారామ శాస్త్రి-82; 4.8 వేంకట రమణ గుప్త - 83; 5. చాటు భేదములు-83; 5.1 పేరడీ చాటువులు-83; 5.2 గాథా చాటువులు-85.

5. అనుబంధము 87-94

ఆశుకవితలు -
అవధానములు - చాటువులు

1. చతుర్విధ కవితలు

1. స్వరూప నిరూపణము

తెనుగు కవిత్వము నాలుగు విధములుగా నున్నదన్న ఒక చూపు పదునారవ శతాబ్దమునకు ముందే తెలుగు మహాకవుల కున్నది. అట్లు నాలుగు విధములుగను వ్రాయగలుగుటయే పరిపూర్ణతా లక్షణమన్న నిశ్చయమును కుదురు కొన్నది. అల్లసాని పెద్దన్నగారు తాదృశమైన పూర్ణ కవితాశక్తి తనయందున్న దన్న ఆత్మవిశ్వాసముతో గద్యవ్రాసి కొనెను.[1]

చతుర్విధ కవిత యనగా ప్రాచీనాంధ్ర లక్షణ కర్తలు ఆశు - మధుర-చిత్ర - విస్తర కవితా మయమని అర్థము చెప్పిరి.[2] మనుచరిత్రమునకు టీక వ్రాసిన శ్రీ జూలూరి ఆప్పయ్య పండితుడు "ఆశు-బంధ--గర్భ-చిత్ర" కవితా మయమైనదియే చతుర్విధ కవితయని వ్రాసిపోయెను. కాని కవులందరును ఆశు-మధుర-చిత్ర-విస్తరములనే పేర్కొనుచు వచ్చుచున్నారు.[3]

చతుర్విధ కవితా నిర్వాహకుడనని రామరాజ భూషణుడు వ్రాసినాడు.[4] నంద్యాల కృష్ణవిభుని యాస్థానమునందు "ఆశు-మధుర-చిత్ర-విస్తార కవితా విజృంభణ స్తంభిత బాణ భవభూతి భాస కాళిదాస ముఖ్య విఖ్యాతి గౌరవులగు

---

1. "శతకోపతాపస ప్రసాదాసాదిత చతుర్విధ కవితామతల్లికాల్లసానిచొక్కయామాత్య పుత్ర పెద్దనార్య ప్రణీతంబైన స్వారోచిష మనుసంభవంబను మహా ప్రబంధంబునందు..."
2. మీగడ తఱకలు - పుట 93.
3. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము - సాహిత్య సమీక్ష - పుట 2.
4. వసుచరిత్రము. 1-167

కవులు" కలరని పింగళి సూరన్న చెప్పెను.[5] బృహస్పతి వద్ద విద్యలనభ్యసించిన చంద్రుడు "చిత్ర విస్తర మధురాశులీలఁ గవితల్ రచియింపఁగ నేర్చె"నని శేషము వేంకటపతి చెప్పినాడు.[6] మరియు గణపవరపు వేంకటకవి "అమితాశువు - మధురము - చిత్రము - విస్తరము నా చతుర్విధ కవితల" కవిత రచింపఁ గలనని ప్రతిజ్ఞ చేసినాడు.[7] శహాజీ మహారాజు "చతుర్విధ మహా సాహిత్య నిర్వాహకుం"డని ఆయన కృతులయందు స్పష్టముగా నున్నది.[8]

గద్యలో వ్రాసికొనఁబోయినను తన కృతిపతియైన సింగనామాత్యుని కొలువున మృదు మధుర చిత్ర విస్తర కవితా విలాస వాగీశ్వరులగు కవీశ్వరులున్నారని శ్రీనాథుడు చెప్పెను.[9] ఇందు గమనించవలసినది చతుర్విధ కవితలలో ఆశు కవిత శుక్ల అభావము. మరియు దాని స్థానమున మృదు కవిత్వమనునొక క్రొత్త కవిత్వము వచ్చి కూర్చుండుట. మృదు కవిత్వమునకు ప్రత్యేకముగా లక్షణము లేదు. అందువలన నదియు మధుర కవితలో అంతర్భవించునని చెప్పబడుచున్నది. మధుర కవిత్వమును నిర్వచించుచు లాక్షణికుడే 'మృదు మధుర వచన రచనల ప్రసిద్ధంబైన యవి మధుర కవిత్వంబులు' అని ముగించెను. అందువలన మృదు కవిత్వమని ప్రత్యేకముగా లేదు.[10] లేనిదాని నున్నట్లనుకొని ఆది ఆశువునకు మరొక పేరనియు నన్నయాదులట్లే వాడియున్నారనియు సర్దుకోసక్కరలేదు. మరొక విషయము నన్నయగారు భారతావతారికలో రాజరాజు విద్వద్గోష్ఠి యందు మృదు మధుర చిత్ర విస్తర నవరస భావ భాసుర కవితా రచనా విశారదులయిన మహాకవులున్నట్లు వ్రాసిపెట్టి పోయినట్లు ప్రచారము ప్రసిద్ధముగా నున్నది.[11] కాని భారతమునందు సంశోధిత

---

5. కళాపూర్ణోదయము. 1-11
6. శశాంక విజయము. 2-54

7-8 దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము. సాహిత్య సమీక్ష పుట-2

9. శృంగార నైషధము. 1-11
10. "సొగసు గల మృదు కవిత నీ మొగసు చూచినంతనే కల్గు". నానారాజ సందర్శనము. పూర్వార్ధము 70.
11. సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశము. రెండవ సంపుటము. 570.
విజ్ఞాన సర్వస్వము. ఆరవ సంపుటము. 617.
ఉదాహరణ వాఙ్మయ చరిత్ర. 13.

ప్రతియందు కూడ 'మృదు మధుర రస భావ భాసుర నవార్థ వచన రచనా విశారదులయిన మహాకవులును' అనియే యున్నది[12]. మృదుమధురముల ప్రక్కన చిత్ర విస్తారాదికము లనివార్యముగా నుండనక్కరలేదు. అందువలన అధోక్షాపికా పాఠమును ప్రమాణము చేసి చేయనక్కరలేదు.

ఈ విధముగా ఏవి చతుర్విధ కవితలన్న విషయమున నిశ్చితాభిప్రాయములు మొదటి నుండియు లేనట్లే కనుపించుచున్నది. అయినను ఆ లెక్క వచ్చినపుడు వార్తాకవి రాఘవయ్యగారి మాటయే సాగుచున్నది.[13]

2. మధుర కవిత

"మధుర కవిత్వంబన్నది నాటకాలంకారంబులు – కళికోత్కళికలు – విభక్త్యధిదేవతోదాహరణములు – సప్తతాళ నటనలు – సట్టొల్లు – గీతప్రబంధములు – చతుర్భద్రికాష్ట భద్రికలు – బిరుదావళి – నామావళి – భోగావళి – రంగమోష – త్యాగమోష – చతురుత్తర సంఘటనలు – యక్షగానంబున వెలయు పదంబులు – దరువులు – ఏలలు – దవళంబులు – మంగళహారతులు – శోభనంబులు – ఉయ్యాల జోలలు – జక్కుల రేకుపదంబులు – చందమామ సుద్దులు – అష్టకంబులు – ఏక పద – ద్విపద – త్రిపద – అష్టపదులు – ఇవియాదిగా గల్గుననన్నియు" నని మధుర కవితా విశేషములు చెప్పబడినవి. ఈ లక్షణము స్త్రీల పాటలను జానపద గేయములను స్తోత్రములను ఛందో విశేషములను కావ్య ప్రక్రియా విశేషములను కలగా పులగముచేసి చెప్పుచున్నది. నాటకమది యొక ప్రక్రియా విశేషము కదా! అలంకారము శాస్త్రగ్రంథము కావలయును. కళికోత్కళికలు ఉదాహరణ కావ్య విశేషములోని ఛందో విశేషములు. ఆ కావ్యమును అందలి ఛందస్సులను విడివిడిగా చెప్పనక్కరలేదు. అట్లే యక్షగానము విషయముకూడ.

"మధుర కవితలు ప్రాయికముగా. భాష – భావము – ఛందము – దేసిగా నుండుటచే సంగీత సంస్కారము గలిగిన సామాన్య జనుల నాలుకల మీద నాట్యమాడునవిగా నుండును గాన తొలుతనవి యంతగా లిపి కెక్కకపోయెను.

---

12. ఆదిపర్వము. 1 – 8.

13. లక్షణ దీపిక. అముద్రితము. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర. 14–16.

సంస్కృత ప్రాయరచనలుగల చిత్ర విస్తర కవితల ప్రాబల్యమునకూడ వానికి సత్కవితలలో పరిగణన మంతగా లేకపోయెను. (ఇటీవల) కవులుగా పురాణ ప్రబంధ రచయితలే పరిగణింపబడుచుండిరిగాన మధుర కవితా రచయితలు లెక్కకెక్కకున్నారు.[14]

3. చిత్రకవిత

చిత్రకవిత్వంబన్నది పాదగోపనంబును పద్య భ్రమకంబును, నామ గోపనంబును, అనులోమ, విలోమ గతి పద్యంబులు, కందగీత గర్భిత వృత్తంబులు, కందద్వయ గర్భిత మణిగణనికరంబును, క్రౌంచపద గర్భిత కందద్వయంబును, ద్విపద చౌపదలు, సువ్వాల మంగళహారతి దవళంబులు, శోభనా చంద్రికాది పద దవ్వులాది లయగర్భిత సీసంబును కంకపటహ మండూక తురంగ నట భేరీ నినాద నాలుకరంప వృత్తంబులును, ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకరజిహ్వా అచలజిహ్వా వృత్తంబులును, రగడ భేదంబులును, రాళగతులును, దండక వృత్తంబులును, అష్టదళ షోడశదళ ద్వాత్రింశద్దళ పద్మబంధంబులును, నానావరణ ద్వాదశావరణ చక్ర బంధంబులును, రథనాగ, ద్వినాగ, కులాలచక్ర, ఆందోళికాచ్ఛత్ర బంధంబులును గోమూత్రికా పుష్పమాలికా పుష్పగుచ్ఛ మృదంగ డమరు ఖడ్గ త్రిశూల కంకణ సర్వతో భద్ర కవికల్పిత కల్పవల్లరి నివియాదిగాగల్గు బహువిధ చమత్కారంబుల చిత్రంబులు రచియించుటం జేసిన చిత్రకవిత్వము".[15]

మధుర కవితలుగా ముందు చెప్పబడిన మంగళహారతులు దవళములు ద్విపదలు మొదలయినవి విచిత్ర కవితలుగా కూడ చెప్పబడినవి. ఇది పద్ధతిగా లేదు. కంక పటహ మండూక తరంగనట భేరీ నినాద నాలుకరంప వృత్తంబులు మొదలయినవాని సంగతి సరిగా తెలియుటలేదు.

చిత్రమనగా ఆశ్చర్యముగనుక పరమాశ్చర్యకరములుగా ఈ పద్యములు రచింపబడుటచేత చిత్రకవితలైనవి కావచ్చును. కాక బంధకవిత్వ మంతయును బొమ్మలువేసి వ్రాయవలసినదే గనుకను చిత్రకవిత్వమన్న పేరు వచ్చి యుండవచ్చును.

---

14. మీగడ తఱకలు. 93.

15. లక్షణ దీపిక.

ఈ చిత్రకవిత్వమును మిక్కిలిగా సాధన చేసి చేసి చిత్రకవి ఇంటి పేరుగా ప్రసిద్ధులైన కవులు కలరు. బిల్హణీయమును నిజముగా వ్రాసిన సింగ రార్యుడు "చిత్రకవి వంశ దుగ్ధాబ్ధి శీతభానుడు".[16] మరొకడు లాక్షణికుడు చిత్రకవి పెద్దన.

4. విస్తరకవిత

"విస్తర కవిత్వంబన్నది ఇష్టదేవతా ప్రార్థనయు, కృతికర్త వంశా వళియు, - పుర, గిరి, మృగయా, యాత్ర, వన, జలనిధివర్ణన, ద్యూత వినోద, రాయబార, వివాహోత్సవ, సురతక్రీడ, పుత్రోత్సవ, సూర్యోదయ, సూర్యాస్త మయ, చంద్రోదయ, చంద్రోపాలంభన, విరహ వర్ణనలు - షడృతువుల వర్ణ నలు, జలక్రీడలు, మధుపాన, దండయాత్ర, రణక్రీడ, దిగ్విజయము ఇవి యాదిగాగలుగు అష్టాదశ వర్ణనలు, అలంకారములు, రీతులు, శయ్యలు, వృత్తులు, పాకంబులు, ఉత్ప్రేక్షలు, శ్లేషోల్లేఖలు-ధ్వనులు, వ్యంగ్యాదులు నివియాదిగా గలుగు కావ్యలక్షణంబులు గలిగి పంచలక్షణ దశలక్షణంబుల నొప్పి కథాసరణి వర్తిల్లుటం జేసి యది విస్తరకవిత్వంబన్నది మహాప్రబంధంబు–"[17]

విస్తరకవితయే ప్రబంధమని లాక్షణికుడు చెప్పుచున్నాడు. ప్రథమాంధ్ర ప్రబంధకవి నన్నెచోడుడు తన కావ్యమును వస్తుకవిత యని పేర్కొనినాడు. విస్తర వస్తుకవిత్వములు రెండును కేవలమొకటి కాకపోయినను వస్తుకవిత విస్తర కవితలో అంతర్భాగముగా చెప్పబడుచున్నది. పురాణేతిహాస రూప మున నున్న దంతయును విస్తరకవితలు. అవియెట్లును బహువస్తు విస్తరములు. ఏకవస్త్వాత్మకముగా నుండి నిబిడమైన కావ్యరచన కలిగినది వస్తుకవిత. అందు వలన నిదియొక పద్ధతిగా విస్తరకవితయందంతర్భూతమగు చున్నది.[18]

చతుర్విధ కవితలలో ప్రధాన విభాగముగానున్న ఈ విస్తరకవితను గురించి లాక్షణికు లింకను వివరించి యుండవలసినది. కాని వారీ పారిభాషిక

---

16. బిల్హణీయము. 1-6
17. లక్షణ దీపిక.
18. కవిరాజ శిఖామణి. 56.

మును పట్టించుకొనలేదు. ఇతర ద్రావిడ భాషలయందును విస్తరకవితయని వినుపించుటలేదు. నన్నెచోడుని వస్తుకవితయే కన్నడము నందును వినుపించు చున్నది.[19] "పస్తు రసాలంకార ప్రాధాన్యవృత్తి కబ్బంబులు పెంపొందు"[20]నని యా మాత్రము చెప్పుటలోకూడ విన్నకోట పెద్దన వస్తువనియే చెప్పినాడు. విస్తర మనుమాటనే విస్మరించినాడు. అనగా విస్తరకవిత యంచు వస్తుకవిత అంతర్భ వించుట కాక వస్తుకవితయందే విస్తరకవిత అంతర్భూతము చేయబడినదని చెప్పవలయును.

5. ఆశుకవిత

కవిత్వము యొక్క ఆవిర్భావమే ఆశువుగా నున్నది. ఆదికవి వాల్మీకి విషయమున అదియట్లే కదా! శోకార్తుడైన వానిచేత వ్యాహృతమైన వాక్యమే కదా శ్లోకమైనది? ఆ శ్లోకమేకదా కవిత్వమనబడిన మొదటి పదసముదాయము! మరియునది పాదబద్ధమును అక్షర సమమును తంత్రీలయ సమన్వితమును అయి యున్నది. ఆర్తుడైన వానినుండి కవిత్వ మట్లు ఆశువుగా నవతరించును. ఆర్తియనగా జీవుని వేదన; పొందెడు ఉత్కంపనము. సమాహిత చిత్తమందు తత్కంపన వృత్తిని ప్రవర్తింప గలిగినవాని వాగ్వ్యాపారము ఛందో బద్ధమై కవిత్వముగా నవతరించు చున్నదనుటకు నిదర్శనముగా వాల్మీకి మహర్షి యున్నాడు. అందువలన కవిత్వముయొక్క ప్రథమ లక్షణము అది ఆశువు గానుండుటయే. ఋషులయందది యట్లున్నను మానవుల యందు ప్రయత్నసాధ్య ముగాతోచి కవిత్వము తన ఆశులక్షణమును తగ్గించుకొన్నది. తగ్గించుకొన్న తరువాత అది మధురకవిత యని, చిత్రకవిత యని, విస్తరకవిత యని బహు విధములయినది. మహాకవులయిన వారు కవిత్వముయొక్క ప్రథమావతార రూపమును ఆశువును కలుపుకొని కావ్యసరస్వతి యొక్క చతుర్ముఖాకృతి నుపా సించిరి. కాలముగడచినకొలదియు మిగిలిన అన్ని విషయములందును మార్పులు వచ్చినట్లే కవిత్వమునందును మార్పులు వచ్చినవి. ఆశువుగా కవిత్వము ఆవిర్భ వించుటగాక ఆశువుగా ఆవిర్భవింపజేసిన పాదబద్ధమును, అక్షరసమమును-

---

19. కుమార సంభవము (మద్రాసు యూనివర్సిటీ); పీఠిక. xxxi.

20. కావ్యాలంకార చూడామణి. 4-45.

తంత్రీలయ సమన్వితమును అయిన వాగ్వ్యాపారమునకు కవిత్వమని పేరు వచ్చినది. ఇక్కడ కవి సమాహిత చిత్తమునందుత్కంపనమును పొందుట మరుగున బడిన విషయమైనది. వాగ్వ్యాపారమును ఛందోబద్ధముగా ప్రదర్శించు టయే ఆశుకవితాలక్షణముగా నైనది. ఇంతకుమించిన చమత్కార కారియైన ఏ చిత్రశిల్ప విశేషమును జోడించినను అది విశేషమై కూర్చున్నది. ఈ విశేష లక్షణ లక్షితముగా నాశువులను చెప్పినవారే కొందరు పోగా కొందరు మనదాకా మిగిలినారు. ఆశువులుగా చెప్పబడినవి కాలముమీద నిలబడినప్పుడు చాటు వులుగా ప్రసిద్ధములగును. ఆశువులయొక్క సద్యఃకాలరూపములు బహు భంగులుగా నున్నవి.

6. విద్వత్కవుల విమర్శన దృష్టి

చతుర్విధ విభాగము మీద కవిత్వమును భావించుటను కాదనక పోయినను ఈనాలుగింటి మీదను మనవిద్వత్కవులకు సమమైన దృష్టిలేదు. ప్రౌఢసాహిత్య విద్యాతత్త్వ వేత్తలు చిత్రకవిత్వమును శబ్దాలంకార ప్రాయముసుండి పైకెదిగి రానీయలేదు. చిత్రకవితా ప్రధానములయిన కృతులను అధమ కావ్యములుగానే ఆలంకారికులు జమకట్టిరి. చిత్రకవిత్వమునకు పెద్దప్రయోజనము నెవరును చూచినట్లు లేదు. "చిత్రకవిత్వము చమత్కారాపాదకమగు కావ్యరచనా శిల్పము. ఇది బుద్ధి సంబంధి. సామాన్యులకును అంతగా సరసులకును సంబం ధించినది కాదు. పాండితీ శౌండీర్యమును ప్రకటించు పండిత ప్రకాండుల గమ్మ త్తయిన గారడీ కసరత్తుల సాముగరిడీలు ఈ చిత్రకవితారీతులు."[21]

ఆశుకవిత్వము కూడ కవితా తత్త్వముకలిగినది కాదు గనుక సమాదరణీ యము కాదనియే ప్రాచీనుల యభిప్రాయము. కవిత్వమును విజ్ఞానద్వారముగా భావించినవారు-ఇందువలన ఎటుక సమగ్రము కావలయునని ప్రయోజనము నాశించినవారు ఆశువు నంగీకరింపలేదు. అప్పకవి వ్రాసిపెట్టినాడు:

---

21. ఆంధ్ర సంస్థానములు-సాహిత్య పోషణము; ముఖబంధము. 23.

ఆశుధారా కవిత్వంబులందు శయన
లుపమ లుత్ప్రేక్షలుసు లేకయుండు గాన
ఎంతయోజించినను పద్యమంత సార
వంతమగు గాన-నిలుకడ వలయు కృతికి.[22]

కొప్పరపు సోదర కవులయొక్కగాని మరొకరి యొక్కయుగాని ఆశు కవితాప్రదర్శనము అప్పకవి మాటలను ఆపవాదము[23] చేయుచున్నదనుట ప్రశంసావాక్యము మాత్రమే.

ఆశుకవిత్వమునకు వలెనే అవధాన కవితలను గురించియు నట్టి యభి ప్రాయమే కలదు.[24] అవి చేయువారికిని వినువారికిని తాత్కాలిక ప్రయోజ నామోద సంపాదకములేగాని[25], భాషావాఙ్మయములకు పుష్టిని చేకూర్చి కవికి నిశ్చలమైన కీర్తిని పాఠకులకింత విజ్ఞానమును కలిగించి జాత్యున్నతికి దోహ దము చేయునవి కావు.

వనపర్తి సంస్థానమున ప్రభువుల యెదుట 'ఆత్యాశుధారలో' ప్రాసిన పద్యములలో వేంకటశాస్త్రి గారొక పద్యము నిట్లుప్రాసిరి:

కవిత యాశుగ జెప్పిన కారణమున
తప్పులుండెడి నయ్యవి తమదు పండి
తులును, తమకెదురాడిన దుడుకుతనము
తామును క్షమింపుటకు వేడెదము నరేంద్ర[26].

మరియు శతావధాన సారమును ప్రకటించుటకు ముఖ్యకారణము అవధానమన నెట్టిదో అందలి కవిత్వమెంత రసము తక్కువ కలిగియుండునో, అందు గోరెడి

---

22. అప్పకవీయము. 1.59.
23. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 99.
24. తెనుఁగు కవిత. వ్యాసము. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక. 1929. (18-3) పుట. 175.
25. చతుర్విధ కవితాచాతుర్య శతావధాని శ్రీమాన్ రత్నాకరం, అనంతా చార్యులు. ఉత్తర హరిశ్చంద్ర కావ్యము. మరియు "కవిగారి మనుగడ" 64
26. నానారాజ సందర్శనము. ఉత్తరార్ధము 126.

కోర్కెలెంత విషమములుగా నుండునో అను విషయములు తేటతెల్లము కావలయు ననుటయే యనియు ఆశుధారాకవయితలకు సుప్రయోగవిచారణమే కాక రసారస విచారణమును నంతగా నుండదని కవితామర్మజ్ఞులకు స్పష్టమేకదా అనియును కూడ వ్రాసి అప్పకవి మాటకే ఆదరమును చూపినారు[27].

గుంటూరు కాలేజీ శతావధానమునకు అధ్యక్షత వహించిన శ్రీమాన్ వంగీపురం కృష్ణమాచార్యులు గారు అవధానానంతరము శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారిని ప్రశంసించుచు చేసిన హితోపదేశమును కూడ గమనింపవలెను.

నాదు హితోపదేశము మనంబున నొక్కెడ నిల్పియుంచుమా
మేదిని కూర్చినప్పటి నిమేషములోన శతావధాన సం
పాదిత పద్యజాలము లపారముగా ముదమిచ్చినన్ విచా
రోదిత దివ్యకావ్యముల యొప్పెటు కల్గి మనోహరములై
పాదుకొనంగజాలెడిని ; పండితపామర హృద్యమై మన
స్సాదన మెంతయో గొలిపి సత్వరబుద్ధి జెలంగ నిశ్చలం
బై దనరారు పెట్టుమది ; యట్లగుగాన ప్రబంధ మార్గమం
దే దగు యత్నముల్ సలుపనెంచుము, పావన నీతి మార్గమున్
చేదని వీడు వారలను చెన్నలరారు మధూక్తి పాకులన్
నీదగు నేర్పుజూపి మహనీయ విశుద్ధ వివేకమార్గమం
దే దిటవొప్పచుండగ సుధీగతి దెల్పుచు గీర్తినొందుమా[28].

ఈ 1911 వ సంవత్సరము అవధానాశు కవితలల్లుట మీది వ్యామోహమును కన పరచి దాని వలని ప్రమాదమును హెచ్చరిక చేసిన సంవత్సరము. అంతకు పూర్వము అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి గారితో కలిసి 'జంటకవుల పోట్లాటలలో' ఆశుకవిత్వావధానము చేసిన[29] రాయప్రోలు సుబ్బారావుగారు - ఆది మోహపడ తగనది కాదని ఆత్మ సంబోధనము చేసికొన్న సంవత్సరమది.

---

27. శతావధాన సారము. ఉపోద్ఘాతము.
28. గుంటూరు కాలేజీ శతావధానము. 37.
29. నవ్యాంధ్ర సాహిత్యవీధులు. ద్వితీయ భాగము. 206.

"..... .....
కపురంపుంబలుకుల్ దెనుంగులివి వేగప్రక్రియా ధోరణీ
విపరీతానిలధాటిలో చెరిగినన్ విధ్వంసమైపోవె త
ద్విపులామోదము మెత్తురే రసికులీ విన్యాస వైకల్యమున్"
"... వాగర్థ కలాకలాప జయలక్ష్మిన్ గాలికిం బుత్తునే:
జననీ: యేమిటికింక ఆశుకవితాసన్యాస మిప్పింపవే:"

"... సకలార్థ శూన్యమగు నీ వేగాతి వేగోక్తిదు
ర్వ్యసనం బేటికి త్రిప్పుమింక జననీ: రమ్యాక్షరశ్రోణికిన్"30

ఈ యాత్మ సంబోధన వాక్యములలో అప్పుడు దేశమున వ్యాపించియున్న ఆశుకవితావ్యామోహ మెంత వెట్టిగా నుండెడిదో కూడ తెలియుచున్నది.

ఆశుకవిత్వమును గురించిన యభిప్రాయము లిట్లున్నవి.

మధుర కవితల విషయమున ప్రభాకరశాస్త్రి గారు ప్రాసిన వాక్యముల వలన అవి పండిత కవులచేత 'సత్కవితలలో' పరిగణింపబడలే31 దని తెలియు చునే యున్నది కదా:

ఈ విధముగా చతుర్విధ కవితలందు మూడు విధములు కవులచేతను లాక్షణికుల చేతను కూడ ఉపేక్షింపబడినవి. ఇక మిగిలిన విస్తర కవితనొక్కదానినే వస్తుకవితగా నందరును ఆమోదించి దానినే ఇహపర సాధనముగా పెంచి పెద్దచేసికొనిరి.

అసగా ఆశు మధుర చిత్రకవితలు సజీవ ప్రౌఢ భాషా సాహిత్య చైతన్య ధారాప్రవాహ వాహములగుటకు సర్వసమర్థములు కావన్న మాట:

అయినను ఆశుకవితా సరస్వతులవతరించి అవధానములు చేసి ఆంధ్ర భాషా కవితకు – అందును ముఖ్యముగా తెలుగు పద్యమునకు కృతకలక్షణమును పోగొట్టి స్వభావ సౌందర్యమును కల్పించి – ఆధునిక జీవమును పోసినారు.

---

30. ఆధునికాంధ్ర కవిత్వము. 262, 63.
31. విజ్ఞాన సర్వస్వము. ఆరవ సంపుటము. 617.

2. ఆశుకవితలు

1. స్వరూప నిరూపణము

ఆశుకవిత్వమనగా నేమి ? "ఏకపాద - త్రిపాద - కఠినప్రాస - విషమ సమస్యాపూర్తులు - వ్యస్తాక్షరీ సంఘటిత పద్యంబులును - ఇష్టార్థ దేవతా వర ప్రతిపాది నిషేధాక్షర రచనా చమత్కృతియు, అష్టావధానంబులు - ఘటికా శతగ్రంథ కల్పనయు - ఆకాశ పురాణంబులని తత్కాలోచితాతి త్వరితగతిని రచియింపబడునది". ఆశుకవిత్వమని లాక్షణిక గ్రంథనిర్వచనము.[1] ఆశుకవిత్వ మనగా అతిత్వరితగతిని కవిత్వము చెప్పుట మాత్రమే కాదు. అది తత్కాలోచి తముగా నుండవలయును. అనగా కవి తాను వ్రాయ సంకల్పించిన కావ్యమును త్వరత్వరగా ఇంటివద్ద కూర్చుండి ఒకటి రెండు గంటలలో నాలుగైదు వందల పద్యములు నల్లి పూర్తి చేసికొనుట కాదు. ఇంటివద్ద కూర్చొని వ్రాసినది ఆశు కవిత్వము కాదు. ఒకానొక సమయమునందు ఒకానొకడు ఒకానొక విషయ మును చెప్పి దీనిని గూర్చి కవిత్వము చెప్పుమనగా వెంటనే అతి త్వరితగతిని చెప్పబడినది ఆశుకవిత్వము. తత్కాలోచిత మన్నదానియందు వక్త-విషయము-విధానము మొదలైన బహ్వాంశము లిమిడి యున్నవి. మరియు నాశుకవిత్వము చెప్పుమని కవిని ఎన్ని విధములుగా కోరవచ్చునో గూడ ఆ నిర్వచనమున యందున్నది. ఆశుకవిత్వము చెప్పెదనని ముందుకు వచ్చిన కవి ఆ తొమ్మిది విధానముల చెప్పుటయందును ఆరితేరినవాడు కావలయును. కవిత్వమునకు ఛందోబద్ధమైన పద్యరచన లక్షణము కనుక ఆశుకవిత్వమనగా ముందు పద్య రచనా ప్రావీణ్యమును కవి సంపాదించుకొన వలెను. ఇక్కడ ప్రావీణ్య మంతయు ముఖ్యముగా అతి త్వరితగతిని సాధించుట యందుండును. నెమ్మదిగా గణములను కూర్చుకొనుచు యతి ప్రాసల వద్ద ఆగి యాగి కష్టముమీద ముందుకు సాగుచు ఆరగంట కొక పద్యమైన దనిపించుట ఆశుకవిత్వమునకు లక్షణము కాదు. ఒక రమణీయమైన భావకల్పన చేయుచున్నాను గనుక పద్య మును నిదానముగా చెప్పుచున్నాననుటయు ఆశుకవికి లక్షణము కాదు. ఆశుగతి

---

1. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. సాహిత్య సమీక్ష. వుట 3.

కల్పనమువల్ల ఆశుకవిత్వ మగుచున్నది గాని రమణీయ భావకల్పనము వల్ల ఆశుకవిత్వ మగుటలేదు. అతిత్వరిత గతియంచును రమణీయ భావము వచ్చిన దనగా అది లాభము. లాభమునకని ఆసలునకు ముప్పుతెచ్చు వ్యాపారము చేయరాదు.

ఆశువునందు కరము మేటి[2] నని మొదట ప్రకటించుకొన్న గౌరవము పూర్వాంధ్ర కవులలో భట్టుమూర్తి నట్లుంచిన తెనాలి రామకృష్ణకవిదిగా కనుపించుచున్నది. ఆంధ్రభాషయం దాశుకవితా ప్రదర్శనము నిజానికి శ్రీనాథుని తోనే మొదలయిన దనవలయును. వేములవాడ భీమకవి చాటుపుల సంగతి వేరు విషయము. అది క్రమముగా శ్రీ కృష్ణదేవరాయలవారి కాలమునకు వృద్ధియగుచు తంజావూరు రఘునాథరాయలవారి యుగమునకు చక్కగా పరిణమించినది.

ఆశుకవితా విశేషములుగా నింతకు ముందు పేర్కొనబడిన వాటిలో ఏకపాద త్రిపాదములు చిత్రకవితా విషయములు. ఇక మిగిలినవాటిలో ఘటికా శతగ్రంథ కల్పనము - ఆకాశపురాణము - సమస్యాపూర్తులు - ఇవి నిజముగా ఆశువులు. కఠిన ప్రాస కూడ అందులోనిదే. వ్యస్తాక్షరి, నిషేధాక్షరి అష్టావధాన ములో కలిసిపోయినవి.

అందువలన ఆశుకవితా ప్రదర్శనములు ఘటికా శతగ్రంథ కల్పనము గాను, సమస్యాపూరణముగాను, అవధానముగాను, ఆకాశ పురాణములుగాను ఉండెడివని చెప్పవలయును.

ఘటికా శతగ్రంథ కల్పనమనగా గడియకు నూరు పద్యములు చెప్పుట. అత్యాశు రచన చేయుటయన్న మాట. "ఘటికా సద్యశ్శత గ్రంథ కల్పనుడ" నని రామరాజభూషణుడు ప్రాసికొన్నాడు.[3] ఇది చేతనైన వానికి ఏకైక దిన ప్రబంధ కల్పనమొక లెక్కలోనిది కాదు. రామరాజభూషణుని తరువాత చాల మంది కవులు తాము ఘటికా శత గ్రంథ ఘటనా సామర్థ్యము కిలవారమని

---

2. పాండురంగ మాహాత్మ్యము. 1-23. మరియు ముద్దుపళని; "ఆశుకవి త్వంబు లల్లితేనా సరా ?" రాధికా స్వాంత్వనము. 3-14. మరియు రత్నా కరం అప్పప్పకవి పెదతాత: "అతి చమత్కృతు లొప్ప నాశుకవిత్వంబు జెలగి వాక్పటిమతో జెప్పునతడు". శశిరేఖాపరిణయము. 1-19.
3. వసుచరిత్రము. 1-16.

బాహాటముగా చెప్పుకొనసాగిరి. తంజావూరు రఘునాథనాయకుడు పారిజాతాప హరణమను కృతిని ఆరుగంటల కాలములో ఆత్యాశువున చెప్పగా లేఖకు లతి కష్టముమీద వ్రాయగలిగినట్లు చెప్పబడినది.[4]

ఈదృశమైన ఆశురచనకు "సమయ లేఖిని విద్యాప్రదర్శన" మనియు పేరు కలదు. ఒక నిర్దిష్ట సమయములో ఒకానొకవిషయమును గురించి ఒక సంఖ్యా నియమమును పెట్టుకొని పద్యములు చెప్పుటయే దీనికి లక్షణము. గడియకు నూరు పద్యములన్న ప్రసిద్ధమైన నియమమీ సమయలేఖినికి సంబంధించినదే.[5] ఇరువది నాలుగు నిముషముల గడియ లేక ఘటిక తరువాత తరువాత గంటకు మారినది.

గడియకు నూరుపద్యములేమని ఘటికార్ధముననే నూరుపద్యములు చెప్పు టకు సాధనచేసి సిద్ధిపొందిన ప్రాచీనులలో తంజావూరు రఘునాథరాయల వారి ఆస్థానము నలంకరించిన, మరియు ఆయనచేత స్వర్ణాభిషేక గౌరవము నందిన, మధురవాణిని ముందుగా పేర్కొనవలయును. ఆమె "మాధుర్యైక ధురంధ రాంధ్రకవితా నిర్మాణ సమ్మాన్య".[6]

సమయ లేఖినితో పాటు శతలేఖినీ విద్యయును కలదు. శతలేఖినీ విద్యయే శతావధానము. "శతలేఖిన్యవధాన పద్య రచనా సంధా సురత్రాణ చిహ్నితనాముద" నని చరిగొండ ధర్మన్న తనను గురించి వ్రాసికొనెను.[7] అవధాన శబ్దమునుకూడ కలిపినాడుగనుక తప్పక అది శతావధానమే కావలయును. దీనితో అవధానములు రెండు విధములయినవి. అవధానముల విషయము తరువాత.

సమస్యాపూర్తులు పద్యపూరణములు పాదపూరణములు అను పేర ఆశుకవితా వినోదములుగా చాలకాలము చెల్లుబడియైనవి. సమస్యలతో కలిసియు కలియకయు కఠినప్రాసలు ఆశుకవితా ప్రదర్శనములలో కొనసాగినవి.

---

4. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. సాహిత్య సమీక్ష. 5.
5. దక్షిణదేశీ యాంధ్రవాఙ్మయము. సాహిత్య సమీక్ష. 14.
6. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. 30.
7. చిత్ర భారతము. 1 - 18.

2. ప్రాచీన ఆశుకవులు

1. శ్రీనాథుడు :

"వెల్గోటిరాజును పండితకవియు సగు సర్వజ్ఞసింగ భూపాలు నాస్థానము
నకుఁ బోయి యాన్నపాలుని కొల్వుకూటమునకు ముందు పూజింపబడు చుండెడు.
శారదా విగ్రహమును గాంచి శ్రీనాథుడు చెప్పిన పద్యమును."[8] :

దీనార టంకాల దీర్ఘమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్ర భాషా మహాకావ్య
నైషధగ్రంథ సందర్భమునను
పగులగొట్టించి తుద్భట వివాదప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచు ఢక్క
చంద్రభూష క్రియాశక్తి రాయలయొద్ద
పెదుకొల్పితి సార్వభౌమ బిరుదు
ఎటులమెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగ మహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సరస సద్గుణనికురంబ శారదాంబ.

శ్రీనాథుని చాటువులుగా ప్రసిద్ధము లయిన పద్యము లన్నియు కాకపోయినను : కొన్నియైనను ఆయన ఆయా సందర్భములలో ఆశువుగా చెప్పినవే కావలయును.

ప్రౌఢదేవరాయల యాస్థాన విద్వాంసుడైన ముమ్మకవి శ్రీనాథునినడిగెను. "అయ్యా ! మీరు రెడ్డిరాజుల యాస్థానమున విద్యాధికారిగా నుంటిరిగదా ? మీ బిరుదులేమి ? తెలుపరైతిరే" యని. శ్రీనాథుడిట్లనెను :[9]

---

8. చాటుపద్య మణిమంజరి. ప్రథమ భాగము. పుట 116.
9. శృంగార శ్రీనాథము. 183.

తరువున గాండివం బిడడె ధర్మజునానఁగెరీటి, యేను వా
క్సరసిజనేత్ర యానతి విచారము చొప్పున గర్వహీనతన్
మరలి తెనుంగుభూమి కసమానగతిన్ గొనిపోవువాడనై
బిరుదులు నారివాగుకడ బెట్టితి సత్కవి సార్వభౌముడన్.

ఇది యిట్టి సందర్భమున ఆశువుగా చెప్పబడినదివలెనే యున్నది కదా!

2. పెద్దన :

శ్రీకృష్ణ దేవరాయలు తనయాస్థాన మహాకవుల ముందొకనాడు గండ పెండేరము నుంచి సంస్కృతాంధ్రముల యందు సముగా కవిత చెప్పనేర్చిన వారు దీనిని పరిగ్రహింపుడనగా నెవరును మాటాడలేదు. అప్పుడు రాయలవారు

"ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపగా
నొద్దిక నాకొసంగుమని యొక్కరుఁ గోరగలేరు – లేరొకో"–

అని యనుచుండగా పెద్దనగారు లేచి

"పెద్దనటోలు పండితులు పృథ్విని లేరని నీవెఱుంగవే?
పెద్దన కీఁ దలంచినను పేరిమినాకిడు కృష్ణరాణ్ణపా!

అని పద్యమును పూర్తిచేసెను. రాయల వారాశువుగా చెప్పినదాని నందుకొని పెద్దన్నగారును ఆశువుగానే పూరించినారు గదా! మరియు నా సందర్భముననే సంస్కృతాంధ్రభాషల యందు తనకున్న కవితాశక్తిని ప్రకటించుచు చెప్పిన ఉత్పలమాలికా పంక్తులు ఇరువది తొమ్మిదియును ఆశుకవితయే.

పూఁతమెఱుంగులుం బసరు పూఁపబెడంగులు జూపునట్టివా
కైతలుఁ జగ్గునిగ్గు నెనగావలెఁగమ్మన గమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలియారజంపు ని
ద్రాతరి తీపులో యనగ దారసిలన్వలె లోఁదలంచినన్
బాఁతిగ పైకొనన్వలెను బైదలికుత్తుకలోని పల్లటీ
కూత లనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
చేతికొలంది కౌగిటను జేర్చిన కన్నియ చిన్నిపొన్ని మేల్
మూతల చన్నుదోయివలె ముచ్చటగావలె పట్టిచూచినన్
డాతొడనున్న మిన్నుల మిటారపు ముద్దులగుమ్మ కమ్మనౌ

వాతెఱ దొండపండువలె వాచవి గావలె పంటనూదినన్
గాతల తమ్మిచూలిదొర కైవసపుంజవరాలి సిబ్బెపున్
మేతెలి యబ్బురంపు జిగినిబ్బర పుబ్బగు గబ్బిగుబ్బ పొం
బూతల నూనెకాయ సరిపొడిమి కిన్నెరమెట్టు బంతి సం
గాతపు సన్నతంతి బయకారపు కన్నడ గౌళపంతకా
సాతత తానతానల పసన్ దివుటాడెడు గోటమీటు బల్
మ్రోతలనుంబలెన్ హరువు మొల్లముగావలె నచ్చతెల్గు లీ
రీతిగ ... ...
.....సంస్కృతంబు పచరించెడు పట్టున భారతీ వధూ
టీ తపనీయగర్భ నికటీభవ దానన్నపర్వ సాహితీ
భౌతిక నాటకప్రకర భారత భారతసమ్మత ప్రభా
పాత సుధాప్రపూర బహుభంగ ఘుమం ఘుమ ఘుం ఘుమార్భటీ
జాతక తాళయుగ్మ లయసంగతి చుంచు విపంచికామృదం
గాతత తేహిత తహి తహోధిత ధంధణుధాణు ధింధిమి
వ్రాత నయానుకూల పదవార కుహూచ్వహహారి కింకిణీ
నూతన ఘల్ఘలా చరణ నూపుర ఝూళ ఝుళీ మరంద సం
ఘాత వియద్ధునీ చకచక ద్వికచోత్పల సారసంగ్రహా
యాత కుమార గంధవహహారి సుగంధవిలాస యుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లన జల్లవలెన్ మనోహర
ద్యోతక గోస్తనీఫల మధు ద్రవ గోఘృత పాయస ప్రసా
రాతిరసప్రసార రుచిరప్రసరంబుగ సారె సారెకున్.

ఇక్కడ ఒక్క విషయమును గమనింపవలెను. ఆశుకవిత్వమును ఒకే ఛందస్సున మాలికారూపమున చెప్పవచ్చును. వివిధములయిన ఛందస్సులలోను చెప్పవచ్చును. అంతేగాని మాలికారచనయే ఆశుకవిత్వముకాదు. మాలికా కవిత్వమన్నదొక ప్రత్యేకమైన కవితాశాఖ కాదు.[10] అయినచో ద్విపదవాఙ్మయమంతయును మాలికా కవిత్వమేకదా! ఛందస్సు పేరుమీద వాఙ్మయ ప్రతిష్ఠాయోగమొక్క ద్విపదకే పట్టినది. మరొక ఛందస్సునకది లేదుకదా.

---

10. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. సాహిత్య సమీక్ష. 14

3. భట్టుమూర్తి :

లొట్ట యిదేటిమాట పెనులోభులతో మొగమాటమేల తా
గుట్టకయున్న వృశ్చికము గుమ్మరిపుర్వని యందురేకదా :
పట్టపురాజు పట్టి సరిపల్లె సరాసరి యీయకున్న నే
దిట్టకమాన నామతము తీవ్రమహోగ్ర భయంకరంబుగా
దిట్టితినా మహోగ్రహమతిన్ మకరగ్రహ జర్జరీభటా
పట్టన దట్ట ఫాలఫణి భర్తృ బహూకృత పర్జటస్ఫుటా
ఘట్టపు దట్టణాల కవిఘట్ట నిరర్గళ రాజభృత్య కీ
చట్టచటార్భటీనయన జర్జరకీలలు రాలగావలెన్
చుట్టటీకంబునంబొగడ జూచితినా రజతాద్యాధిత్యకా
పట్టణ మధ్యరంగ గత భవ్యవధూ వదనానుషంగ సం
హట్ట శిరస్సగాంగ ఝరహల్లకజాల సుధా తరంగముల్
చుట్టుకొనన్వలెన్ భువనచోద్యముగా సదయంబుగా మఱిన్
దిట్టితినా సభాభవనధీంకృత భీమనృసింహ రాద్ధ్వజా
తాట్ట మహాట్టహాస చతురాస్య సముధ్భ్రకుటీ తటీనటీ
కోట్టణ రోషజాల హృత కుంఠితకంఠ గభీరనాద సం
ఘట్ట విజృంభమాణగతి గావలె దీవన పద్మమిచ్చి చే
పట్టితినా మణీ కనకభాజన భూషణ భాసురాంబరా
రట్ట తురంగ గంధగజరాజదమూల్య ఘనాతపత్ర భూ
పట్టణ భర్మహర్మ్య భటపంక్తి చిరాయురనామ యంబునై
గట్టిగ తోడుతో వెలయగావలె నెక్కువఠీవి జూడుడీ
యట్టిటు మందెమేలముల నందణసుం బలెఁజుల్కఁజూచి యే
పట్టననైన గేరడము పల్కకుడీ పయిపెచ్చునందులన్
గొట్టుదు దుష్కవిద్విరద కోటుల పంచముభోద్భటాకృతిన్
బెట్టుదు దండముత్ సుకవిబృందము కే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేబదియు గాగల నూటపదాఱు లెయ్యెడన్
రట్టడి భట్టుమూర్తి కవిరాయని మార్గమెఱుంగ జెప్పితిన్.

ముందు నిప్పుడు నికమీద మోద మలర
పద్యదండంబు చేబూని పార్థివులను
చంపుచున్నాడు చంపును చంపగలడు
పరుషవాక్యత సమవర్తి భట్టుమూర్తి.

3. సమస్యా పూరణములు

సమస్య :

కుక్కవొ ? నక్కవో ? ఫణివొ ? కోతివొ ? పిల్లివొ ? బూతపిల్లివో ?

పద్యపూరణము :

తక్కక రావుసింగ వసుధావరు డర్థుల కర్థమిచ్చుచో
దిక్కనులేని కర్ణుని దధీచిని ఖేచరు వేల్పుబ్రమాను పెం
పెక్కిన కామధేనువు శిబింద్రుని నెన్నుదు భట్ట ! దిట్టవై
కుక్కవో ? నక్కవో ? ఫణివో ? క్రోతివో ? పిల్లివొ ? భూత పిల్లివో ?

సర్వజ్ఞ సింగభూపాలుని యాస్థానమున నొక భట్టుకవి శ్రీనాథున కా సమస్య నిచ్చినట్లును, ఆయన దానినిట్లు పూరించినట్లును ప్రసిద్ధియున్నది.[11] అంతకు మించి ఆ కాలమునందలి సమస్యా పూరణముల విషయము మనదాక రాలేదు. శ్రీనాథయుగము నందున్న అనంతామాత్యుడు భోజరాజుయొక్క ధారా నగర మహిమను వర్ణించుచు నిట్లొక పద్యము వ్రాసినాడు. "కైపదమిచ్చు వార లును గ్రక్కున పద్యము చెప్పువారలుఁ"[12] కైపదమన్నను కయిపదమన్నను కవితా శక్తిని పరీక్షించుటకై పూరింపనిచ్చెడి పద్యాంశము, సమస్య.[13] ఈ యర్థమా ప్రకరణమున భోజమహారాజు కాలము విషయముగా నున్నది. అది అనంతామాత్యుని కాలమునందున్న విషయముగానే మనము గ్రహించుట ఆ తరువాత. ఈ పరిస్థితులలో ఆశుకవిత్వమును - సమస్యా పూరణమును శ్రీనాథునితో మొదలుపెట్టి చెప్పవచ్చును.

---

11. చాటు పద్య మణిమంజరి. ప్రథమ భాగము. 117
12. భోజరాజీయము. 2. 50.
13. సూర్యరాయాంధ్ర నిఘంటువు. 2. 456.

ఇక రాయలవారి కాలమున తెనాలి రామకృష్ణుడు చేసిన సమస్యా పూరణములే ఒకటి రెండు ఇప్పటిదాకా నిలిచి వచ్చినవి.

సమస్య :

కుంజర యూథంబు దోపుకుత్తుక జొచ్చెన్

పద్యపూరణము :

గంజాయి త్రాగి తురకల
సంజాతుల గూడి కల్లు చవిగొన్నావా ?
లంజల కొడుకా యెక్కడ
కుంజర యూథంబు దోపు కుత్తుక జొచ్చెన్ ? 14

ఆ సమస్య నిచ్చినది భట్టుమూర్తి యనియు రామకృష్ణుడు నిర్లక్ష్యము గాను నిందాత్మకముగాను దానినట్లు పూరించెననియు, అది మర్యాదపద్ధతిగా లేనందున రాయలు కోపించి ఆ సమస్య తానిచ్చినదియనియు చక్కగా పూరింప మనియు ఆజ్ఞాపింపగా అప్పుడు రామకృష్ణ కవి

రంజన చెడి పాండవులరి
భంజనులై విరటుగొల్వ బాల్పడి రకటా!
సంజయ ! యేమని చెప్పుదు
కుంజర యూథంబు దోపు కుత్తుక జొచ్చెన్

అని పూరించి రాయలవారి నానందపరచెనట!

అన్నాతి గూడ హరుడగు
నన్నాతిం గూడకున్న ననురగురుండౌ
అన్నా ! తిరుమలరాయడు
కన్నొక్కటి లేదుగాని కంతుడు గాడే.

చివరి పాదము సమస్యగా నీయబడినదనియు దానిని రామకృష్ణు డట్లు పూరించెననియు చెప్పుదురు. కాదు, స్వభావ మధురమైన వర్ణన యనియు చెప్పుదురు.

---

14. చాటుపద్య మణిమంజరి. ప్రథమభాగము. 146.

సమస్య :

రవి గాననిచో గవి గాంచునే కదా !

పద్యపూరణము :

ఆరవి వీరభద్రు చరణాహతి డుల్లిన బోసినోటికిన్
నేరడు రామకృష్ణకవి నేరిచెఁబో మన ముక్కు-తిమ్మరాట్
క్రూర పదాహతిం దెగిన కొక్కిరి పంచికి దుప్పికొమ్ము ప
ల్గా రచియింపనేర; రవి గాననిచో కవి గాంచునే కదా! [15]

ఈ సమస్య వెనుక ఒక చిన్న కథ యున్నది. ముక్కు తిమ్మన రామకృష్ణకవి నెందుకో రెండు తన్నులు తన్నెను. ఆ దెబ్బకు రామకృష్ణుని పన్నొకటి విరిగినది. దానితడింటికి పోయి దుప్పికొమ్ము నరుగదీసి పల్లుగా నదుకుకొనెను. ఈ కథ ఆ పద్యమున చమత్కరింపబడినది. దక్షయజ్ఞ ధ్వంసమున వీరభద్రుడు తన్నగా సూర్యుని పండ్లును రాలినవి. దుప్పికొమ్ములు పెట్టుకొనుట రవికి తెలియలేదు. రామకృష్ణ కవికి తెలిసినది. రవి గాసనిచో కవి గాంచునే గదా ! అనగా నది - ఆ పద్యము నెవరు పూరించినదియు తెలియదు.

రాయల యుగమున నిట్లున్న సమస్యాపూరణము తంజావూరు నాయక రాజుల కాలమునను ఆ పిమ్మటను మిక్కిలి వ్యాప్తినందినది.

ఒక పాదము నిచ్చి మిగిలిన పాదములను పూరింపుమనగా అర్థ సమన్వయము చేసికొని తదనుగుణముగా సద్యఃకాల బుద్ధి వైభవమును ప్రదర్శించుచు మూడు పాదములు చెప్పుట నిజముగా కవి కదియొక సమస్యయే. కవికి సమస్యను కల్పించెడు పద్యపాదము తానును సమస్యయే కావలసివచ్చినది.

రఘునాథాభ్యుదయము – విజయరాఘవ కల్యాణము - కవిజనోజ్జీవిని-మొదలైన కృతుల యందు రఘునాథ రాయల వారి కాలమునయందును, విజయరాఘవ నాయకులవారి కాలమునను, పుదుక్కోట కోటి రఘునాథ నాయకుల వారి కాలమునను, విద్వద్గోష్ఠులలో జరిగిన సమస్యాపూరణము లుదాహృతములై యున్నవి. మచ్చునకు కొన్ని చూపబడుచున్నవి.[16]

---

15. చాటుపద్య మణిమంజరి. ప్రథమభాగము. 144.
16. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. సాహిత్య సమీక్ష. 8-12.

1. సమస్య : రారాజని యచ్యుతేంద్ర రఘునాథ నృపా.

పద్యము : ఏరీ నీసరి రాజులు
భూరమణులు నిన్నఁ జాలఁ బొగడుదురు భళీ
"స్వారా" జని "రేరా" జని
"రారా" జని యచ్యుతేంద్ర రఘునాథ నృపా!

ఈ పద్యము నిట్లు పూరించినది రామభద్రాంబ.

2. సమస్య : మీసానకుఁ గాళ్ళమూడు మేదిని గల్గెన్.

పద్యము : మీసానకుఁ గాళ్ళెక్కడ
వాసిగ విన్నడియు లేదు వసుధాస్థలిలో
వాసన గంధము రాచెడు
మీ సానకుఁ గాళ్ళమూడు మేదిని గల్గెన్.

3. సమస్య : వావిలిలోఁ ద్రోయఁ గ్రోతివలెనే యుండెన్.

పద్యము : ఓ విద్వన్మణి నను సు
గ్రీవుని యన్నకును బేరెఱింగింపుము రూ
పేవిత మనియెదు మధ్యము
వావిలిలోఁ ద్రోయఁ గ్రోతివలెనే యుండెన్.

మధ్యము వావిలిలోఁ ద్రోయ - అనగా వావిలో నున్న మాధ్యమాక్షరమును త్రోసివేయగా నని యర్థము అప్పుడు"వాలి" యగును.

దక్షిణాంధ్ర వాఙ్మయము రోజులు గతించిన తరువాతచి న్నచిన్న సంస్థాన ముల యందును కవి పండిత పోషణము కొనసాగినచోట్ల ఆశు కవితా ప్రదర్శ నములును సమస్యా పూరణములును మంచి గిరాకీతోనే చెల్లుబడియైనవి.

4. ఆధునికాశుకవులు

1. ఆశుకవితా సరస్వతులు :

ఆశుధారా కవిత్వాడంబరంబన్న
"నల్లేరుపై బండినడక మాకు
.....
ఆశుధారా కవిత్వమ్ము నందుకొంటి
మేని యభిసారికయు దండమిచ్చితీఱు. 17

మరియు తిరుపతి వేంకట కవుల యాశు కవిత యందలి విశేషమేమనగా చెరి యొక పాదముగా పద్యము నిరువురును అందుకొని చెప్పుకొనిపోవుట. ఒకరు మొదలుపెట్టిన భావములోని ఉద్దేశ్యము నింకొకరు గ్రహించి రెండవ పాదమును వెంటనే అందుకొనుటయు మొత్తము మీద పద్యమొక తాత్పర్యమునంది రమణీయముగా నుండుటయు ఆశ్చర్యకరమైన విషయములు. ఆ విషయమును వారే యొకసారి గద్యాలలో ప్రకటించిరి.

ఒక చరణంబతండు మఱియొక్కటి నేను మఱొక్కటాతడున్
సకల కవీంద్ర సంతతులు సమ్మతిచే తలలూచి మెచ్చగా
ప్రకట తరాశుధీర దనరన్ రచియింపగ నేర్తుమయ్య "నూ
టికి" నెలవయ్య నిక్కమిది డెబ్బది మాటలు నెప్పనేటికిఁ.

మా కవిత్వ పరీక్ష సమ్యగ్గతిని రచింపుము-
ఏ కథ నేనియు జెప్పుసపుడు
చేయి యాపిన సది తెగవేయు మాధిప
ఆత్యాశువున నొక కథను కల్పించుకొనుచు కావ్యమును ప్రాసికొనిపోవుట "ఆగకుండ ప్రాసికొనిపోవుచున్నాడా" "ఆలోచించుకొనుట కాగుచున్నాడా" అన్నది పరీక్ష. ప్రాసెడు చేయి ఆగినదో దాని నక్కడ తెగవేయుమని వనపర్తి సంస్థానమున ప్రభువులను తిరుపతి వేంకట కవులు సవాలుచేసి నెగ్గుకొని వచ్చినారు.

---

17. నానారాజ సందర్శనము. పూర్వార్ధము. 16-17

ఆశుకవులందరును పరీక్షలకు నిలబడి అవధానాదికములను చేయలేరు. ఆ విషయమును తిరుపతికవులే ఇట్లు చెప్పినారు.[18]

నూటికొక్కడు చక్కని ధాటిగల్గి
సరస కవనమ్ము చెప్పెడి చతురుడుండు
అటివారలలో వేయి కమరు నొకడు
శతవధానాదికమ్మును సల్పు జాణ.

ఆ కాలమున ఆశువు నెందరు చెప్పగలిగిన కవులుండెడివారో లెక్కబెట్టలేము. అవన్నియును తాత్కాలికములైన మెఱుపులు గనుక శూన్యమున కలసిపోయినవి. అప్పుడు చాలమంది అవధానులు గూడ బయలుదేరిరి. వారిలో ఉద్దండులైన విద్వాంసులయొక్క అవధానాదికములయిన ఆశుకవితలే కొన్నికొన్ని మాత్రమే ఇప్పు డుపలభ్యమానముగా నున్నవి. చిల్లర మల్లర యవధానులందరును ఆ మరునాటి నుండియే మరుగున పడిపోయిరి.

తిరుపతి వేంకట కవుల ఆశుకవితా ప్రదర్శనములో ప్రధానముగా పేర్కొనదగినది ఆకాశపురాణము. వారి అష్టావధానములు అంతర్గతముగట్టుటకు వారి పౌరాణోక్తి కవిత్వాశువే ప్రధాన కారణము. ఆకాశపురాణమనగా అప్పటి కప్పుడొకరు చెప్పిన కథావిషయము నాధారము చేసికొని, పురాణ గ్రంథములోని పద్యములను చూచి చదివినంత వేగముగా పద్యములను గద్యములను చెప్పుచు మరల పురాణధోరణిలో ఆ గద్యపద్యముల కర్థము చెప్పుట. మరల ఆశువుగా పద్యములనందుకొనుట. తామిద్దరగుటచేత నొకరు గ్రంథమును చదువుచున్నట్లు ఆశువున పద్యములు చెప్పుటగా, మరొకరా పద్యముల కర్థము చెప్పినట్లు పురాణము చెప్పుటగా తిరుపతి కవు లాకాశపురాణమును నిర్వహించెడివారు. వేంకటగిరి యవధానములో చేసిన రాజావారి రామేశ్వరయాత్రా కథాత్మకమైన ఆకాశపురాణ కాలక్షేపము చాల ప్రసిద్ధమైనది. ఆ సందర్భమున చెప్పిన మొత్తము నలుబదియారు గద్య పద్యములలో పదునారు సీసపద్యములున్నవి.

ఆశుకవితా విశేషముగా పూర్వులు భావించిన వ్యస్తాక్షరిని నిర్వహించుట యందును తిరుపతికవు లందెవేసిన చేతులు. ఈ విషయమున తాను ధురీణుడనని

---

18. నానారాజ సందర్శనము. ఉత్తరార్ధము 128, 126

ప్రకటించిన పూర్వాంధ్రకవి భట్టుమూర్తిగానే కనుపించుచున్నాడు. ఆ ప్రదర్శన స్వరూపము మనకు తెలియకుండనే పోయినది.

సంఖ్యా క్రమము ననుసరించి ఆయా అక్షరములను తిన్నగా నొప్పగించుటయే గనుక వ్యస్తాక్షరికి ఏ భాషాపదములనైనను వాడవచ్చును. అర్థముతో నవధానికి నిమిత్తములేదు. ఈ కీలకము మీద తిరుపతికవు లన్యభాషాపదముల నాహ్వానించెడివారు. అది సదస్యులను మరియు నాశ్చర్య చకితులను చేసెడిది. నానా భాషా పదములను గూడ వారామోదించి చేసెడువారు.

యూయం తంత్రసిడౌర్ తధాపి వెరివెల్
తస్మా న్మమాయం శశీ
నోగాసార్ మదరాసు కాయకరితం
హింగేందు బాయెందునం
నింగత్వారయ నింగకూద విడుదల్
నీవాడ నంటింగదా
కిస్వాస్తే మయి బో ల్తహుం అజి సునో
తక్సీర్ న మేరే ఉపర్.

అట్టావదానిగళ్ శెయ్యవల్లే మెన్ద్రవై పుహుందు
తట్టామలేశిలర్ తత్తళిప్పార్ విల్లితన్ శరంబోల్
ఎట్టేపుహుంద్రు పిన్నెట్టె ట్టెట్టె ట్టింగవరై యొప్ప
ముట్టాదు శెయ్యవల్లారిల్లె యెయిుంద మొయిణింలత్తె.[19]

నానా భాషా పదసంకులమైన మొదటి శార్దూల విక్రీడితమును, రెండవదైన ఈ తమిళభాషా పద్యమును వ్యస్తాక్షరి కుపయోగింపగా తిరుపతికవులు తిరిగి ఒప్పచెప్పి నారనగా ఆ బుద్ధిబలము నెవడెరుగవలయును? డెబ్బది యారక్షరముల తోడి పదములను చెల్లా చెదరుచేసి అప్పుడొకటి అప్పుడొకటి చూపింపగా చివరకు క్రమము తప్పక చెప్పినది సంస్కృతాంధ్ర భాషలు కానప్పుడు పరమాశ్చర్యకరముకదా: రెండవదైన తమిళ పద్యము తిరుపతి కవుల ఆశు కవితాశక్తిని అర్జునుని బాణవర్షముతో పోల్చి ప్రశంసించు నదియట:

---

19. ఉపాధ్యాయోపయోగినీ పత్రిక. శతావధాన సారము - అనుబంధము 152.

తిరుపతి కవులు నిషిద్ధాక్షరిని నిర్వహించినారుకాని ఉదాహరించుటకు వీలులేదు. శతావధాన సారమున (121) నిషిద్ధాక్షరి యని ఒక శ్లోకమున్నది. ఏ యే అక్షరములు నిషిద్ధములైనవో తెలియదు. నిషేధించిన అక్షరములు రాకుండ చెప్పిన శ్లోకమే యది.

ఇట్లాశుకవితా విశేషములన్నియును తిరుపతికవులయందు మూర్తీభవించినవి.

2. కొప్పరపు సోదర కవులు :

ఆలోచించుటలేదు కల్పనకు పద్యారంభయత్నంబు ము
న్నెలే, దించుక ప్రాసకేనియతికేనిన్ గొంకు కన్పట్టదే
యాలస్యంబును కల్గబోదు భళిరా: అయ్యారె: యివ్వారికిన్
సాలె యౌజుమి యాశుధార కవితా ప్రారంభ నిర్వాహముల్

కొప్పరపు సోదరకవుల ఆశు కవితా పాటవమును చూచి శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఆశ్చర్య చకితులై ప్రశంసించుచు చెప్పిన పద్యమది. వారిదే మరొక పద్యము.[20]

నాల్క తుదిన్నిరంతరము నాట్యము సల్పుటకీ సహోదరుల్
పల్క వెలందినెట్లు తొలివామున గొల్చిరొ: తేటతేనియల్
చిల్కిన యట్లు విందొసగు చెప్పిన పద్యములెల్ల వహ్వారే
పల్కిన పల్కులన్నియును పద్యములయ్యెడు నేమి చెప్పుదున్.

ఘటికాశత గ్రంథ కల్పనమన్నదానిని సార్థకము చేసిన ఆశుకవి సింహము లీ సోదరకవులు. "ఒక మారు పన్నిదమునకై మార్టేరు సభలో గంటకు 100 పద్యముల చొప్పున అరగంట కాలములో మను చరిత్ర ఆశువుగ రచించి తమ యనుపమాన ఆశుకవితా ప్రతిభ వెల్లడి చేసియున్నారు.[21]"

ఈ సోదరకవుల ఆశుకవితా ప్రదర్శన విశేషములను శ్రీ నిడుదవోలు వెంకటరావు పంతులుగారిట్లు తెలియజేయుచున్నారు.[22]

---

20. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 27-119.
21. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 93.
22. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 74.

1. పద్యములు కోరినవృత్తములలో చెప్పుట: సోదరకవులు సాధారణ వృత్తములేగాక అసాధారణ వృత్తములను ఆశుకవితలో చెప్పుదురు. 2. వర్ణనలు కోరినవి చేయుట. 3. కథాసందర్భమున కల్పనలు 4. ఏదేని కథాఘట్టమును తీసికొని కవితా రచన చేయుట. 5. కేవలమొక కథనే కావ్యరూపమున చెప్పుట.

ఒకే కథ నాశుకవితలో చెప్పకవులను "కథాశుకపు" లందురు. క్రీ. శ. 1730 ప్రాంతముల మధురలో కుందుర్తి వెంకటాచలకవి చును కథాశుకవి యుండెను. నేటికి మన కొప్పరపు కవులు కథాశు కవిచక్రవర్తులు. సీతాకల్యాణము - భీష్మజననము - అభిమన్యువధ - కంసవధ - హైమవతీ పరిణయము మొదలయినవి సోదరకవుల కథాశుకావ్యములు.

ఆశుకవిత్వంబు నల్ల బూనెదరేని
అద్దాని మించి చేయంగలేమొ ?
అష్టావధానంబు నాచరించెదరేని
అద్దానిమించి చేయంగలేమొ ?
శతఘంట కవనంబు సల్పబూనెదరేని
అద్దానిమించి చేయంగలేమొ ?
నేత్రావధానంబు నేర్పుచూపెదరేని
అద్దానిమించి చేయంగ లేమొ ?
ఆంధ్రమున నిన్నియన్ని పద్యములటన్న
నింతకాలంబులో నన్న నిందఅన్న
నిట్టి వర్ణోత్కరంబన్న నేమి వెఱపు ?
తెలుగు మీసంబు నిలుపంగ దివురుడింక.[23]

తిరుపతి వేంకట కవులతో వచ్చిన వివాద సందర్భమున సోదర కవులు సవాలు చేసి పిలిచిన పద్యమది.

తిరుపతి కవుల తరువాత పేర్కొన వలసిన ఆశుకవులు శ్రీ కొప్పరపు సోదర కవులు. వారు శతావధానులు కాగా వీరు ఆశుకవిత్వావధానులు.[24]

---

23. కొప్పరపు సోదర కవుల చరిత్ర. 41.
24. నవ్యాంధ్ర సాహిత్య వీధులు. ద్వితీయ భాగము 323.

3. పిఠాపాటి చిదంబర శాస్త్రి :

శ్రీ పిఠాపాటి చిదంబర శాస్త్రి గారు సంస్కృతాంధ్రములయందు రెంటను ఆశుకవిత ననాయాసముగా చెప్పనేర్చి ఆశుకవికేసరి బిరుదమునందిన వారు. శ్రీ శాస్త్రిగారు తెలుగుదేశమును దాటి కర్ణాటక, ద్రావిడ, మళయాళ,కాశీ,దర్భాం గాది మండలములకు కూడ పోయి తమ సంస్కృతాంధ కవితా ప్రదర్శనము చేత జయించుకొని వచ్చిరి. తెనుగునాట ఆగిరిపల్లి - గుడివాడ - యాదగిరి-కారుమంచి - జగ్గయ్యపేట - కాకినాడ - వరంగల్లు - పెద్దాపురము - దొంతి-గణపురము - ఏలూరు - మైలవరము - భువనగిరి - గద్వాల - ముక్త్యాల - నెల్లూరు - తిరుపతి - పిఠాపురము - విజయవాడ - సికింద్రాబాదు - విజయ నగరము మొదలుగా గలిగిన మహానగరములందష్టావధానములు శతావధానములు చేసిరి. ఆశుకవిత యందు వీరందె వేసిన చేయి.

ఆశుకవిత్వంబు నల్ల బూనితినేని
హరిదశ్వవాహంబు లడలవలయు
అష్టావధానంబు నాచరించితి నేని
అష్టమూర్తులు శివాలాడవలయు
శతవధానమును సలుప బూనితినేని
శతధృతి ధైర్యంబు సడలపలయు
నేత్రావధానంబు నెఱవేటిచితినేని
చక్షుశ్రవుండైన జంకవలయు
సంస్కృతాంధ్ర ప్రబంధ ప్రచారమునకు
దంటతన మేర్పడగ పూనుకొంటినేని
అంబనాగ్రామాల తాండవంబాడవలయు
భూరిగుణజాల ! పీఠికాపుర నృపాల.

ఇది పిఠాపురము రాజావారిని దర్శించినప్పుడు చెప్పినది.

శ్రీ శాస్త్రి గారు గద్వాల సంస్థానమునకు పోయినపు డక్కడ భుజంగా రెడ్డి యనునొక ఆశుకవి శాస్త్రి గారి నెదుర్కొనెను. వాగ్వివాద మాశువుగా సాగుచున్నది. భుజంగా రెడ్డి వెనుకబడుచున్నాడు. ఆశువు ఆశువుగా సాగుట లేదు. అప్పుడు చిదంబరశాస్త్రిగారందుకొని విజృంభించినాడు.

తడ బడెద వేల ? అశువు
నుడువుటకై పూసుకొని ఘనుల్ గల సభలో
కుడి యెడమ లేదె ? సింహము
కడనా హరిణముల కుప్పిగంతుల యాటల్.

శతపధాన విధాన చాకచక్యము జూప
గలరేని రండు వాక్కులహా మేల !
అష్టావధాన విద్యాపాటవము జూప
గల రేనిరండు వాక్కులహామేల ?
ఆశుధారా కవిత్వాటోపమును జూప
గలరేని రండు వాక్కులహామేల ?
సంస్కృతాంధ్ర గ్రంథ సంధానమును జూప
గలరేని రండు వాక్కులహామేల ?
చతురమతి యగు గద్వాల జనవిభుండు
సాక్షియై యుండ నేతత్సభాంగణమున
తారతమ్యం బెఱుంగక తప్పుదారి
బడిన మీ గర్వమెల్లను బాపువాడ.
కవులమను గర్వమున కన్నుగానకుండ
నిన్న మొన్నటి దాక ననేక గతుల
సంతరించితి రికమీద సాగబోవు
వచ్చి యున్నాడు శ్రీ చిదంబరుడు నేడు.

భుజంగారెడ్డి తన యోటమి నొప్పుకొని "నీదగు నఖండ కవిత్వ మహా ప్రభావ సాగరమున కోడి తిచ్చవడి గౌరవబుద్ధి చెలంగు చుండ నీ చరణములంటి ప్రొక్కితిని సైపుము నేను భుజంగ రాయుడన్" అని పసపురాతి భుజంగారెడ్డిప్రాలు అని నంతకముతో ప్రాసి సమర్పించినాడు.[25]

మరియు శ్రీ శాస్త్రి గారు గద్వాల ప్రభువుల యెదుట తమ సామర్థ్యము నిట్లు స్పష్టముగా ప్రకటించిరి.

---

25. శ్రీమదాంధ్ర పద్మ పురాణము. ప్రథమ సంపుటము, కవి జీవితము 16.

ఖాండవమున్ ధనంజయ ముఖంబున వేల్వగ నీ సమస్త భూ
మండలమున్ జయింపగ సమర్థత పార్థుడు దాల్చినట్టు లొ
క్కండన నేన తాల్తు నధికారము నాశుకవిత్వమల్ల ను
ద్దండ శతావధానము ప్రధాన విధిన్ బొనరింప భూధవా!
గంటకు నిన్నియన్నియని గట్టిగనొక్కి వచింపనేల? ని
ష్కంటకరీతి నోరుక్షణకాలము గూడను నాగకుండ నొ
క్కంటను దప్పకుండ నొడికంబుగ నేరచియింతు భూప! మీ
వంటి రసజ్ఞులెల్ల "వహవా" "వహవా" యన నాశుపద్యముల్
ప్రాసము దప్పకుండ యతిభంగము వాటిలకుండ నర్థ వి
న్యాసము మాఱకుండ గమనమ్ము గణమ్ము తొలంగకుండ ను
ల్లాసముతోడ నాశుకృతులన్ గురియించుచు నుండుపట్టునన్
ప్రాసెదనంచు బూనుకొను వానికి జేసెద శృంగభంగమున్.

ఆనాటి ఆశుకవులైన అవధానులందరి యందును ఈ రకమైన ఆత్మ విశ్వాసముతోడి విజృంభణమే ప్రధానలక్షణముగా కనిపించును. కర్నూలు జిల్లా దైవమునిన్నె రామారెడ్డిగారి సంస్థానమున తాము చెప్పుచున్న ఆశువు నందు కొని వ్రాయలేక వ్రాయుదుమన్నవారు తడబడుచుండగా అప్పుడు శ్రీ గాడేపల్లి వీరరాఘవ శాస్త్రిగారు చెప్పిన పద్యములును వారి శక్తియుక్తులను స్పష్టముగా ప్రకటించుచున్నవి.

4. గాడేపల్లి వీరరాఘవశాస్త్రి :

జలదారంభ విజృంభమాణ ఘనవర్ష ప్రౌఢ్భవాసార ధా
రలధిక్కారమొనర్చు మత్కవనధారా ధోరణీ ధాటికిన్
నిలువన్ జాలి లిఖింపబూని కలముంజేపట్టి నాచెప్పి న
ట్టుల వ్రాయంగల ధీరుడైన మొనగాడున్ గల్గనే యెవ్వడేన్.
ఆగునె వీరరాఘవుని యాశువు? పార్థశర ప్రయోగమే
యాగిన నాగుగాక ప్రమథాధిపశీర్ష పతన్నదీ జలం
బాగిన నాగుగాక సముదగ్ర తపోధన శాపవాక్కులే
యాగిన నాగుగాక వశమా? బిసనిల్ప బిసప్రసూతికేన్.
కమ్మలమీద రైలు వడిగాజనునట్లు కవిత్వమందు లో
పమ్మన నెందునేనియు లవ మ్మగుపట్టగనీక యింత శీ

ప్రమ్మగ వర్ణ్యమున్ నుడువ రాఘవశాస్త్రికె గాక యింక సా
ధ్యమ్మగునే మఱొక్కరికి ? తజ్జుల కియ్యది క్రొత్తవింతయే ? [26]

శ్రీ వీరరాఘవశాస్త్రి గారు 1913-27 సంవత్సరముల మధ్యకాలములో ఆంధ్ర ప్రదేశము మొత్తము మీద ఆరువది నాలుగు అష్టావధానములును ఇరువదియైదు శతావధానములును చేసినట్లు తెలియుచున్నది.[27] మరియు నీయన ప్రాసిన అహోబలమాహాత్మ్యము ఆశుప్రబంధమని చెప్పుచురు. అయిదాశ్వాసముల యాగ్రంథము నెన్నాళ్లలో పూర్తిచేసిరో అది తెలియదు. సమయలేఖినీ విద్య యందును శ్రీ శాస్త్రిగారందెవేసిన చేయిగనుక రామభూపతి శతకము (1914)-దీనకల్పద్రుమ శతకము (1916) - విశ్వేశ్వర శతకము (1917) - సోమేశ్వర శతకము (1919) - చెన్నకేశవ శతకము (?) ఇవన్నియు నొక్కొక్కటి గంట గంటలో చెప్పినారు.

తిరుపతి వేంకట కవులకువలెనే - శ్రీ రాఘవశాస్త్రి గారును కొంత కాలము శ్రీ గోపాలుని సుబ్బరామ కవి అనువానితో కలిసి జంటకవులుగా కవితా ప్రదర్శనము లిచ్చెడివారు. అప్పుడు వారిపేరు వీరరాఘవ సుబ్బరామ కవులు.

1916 లో దొనకొండలో శ్రీ శాస్త్రిగారు శతావధానము చేసిరి. దాని కధ్యక్షత వహించిన శ్రీ మేడవరము సుబ్రహ్మణ్యశాస్త్రి గారు చివర కిట్లాశువు చెప్పిరి.[28]

తిరుపతి వేంకటేశ్వర సుధీవరులొక్క విధాన క్రైతక
త్యురుతర నూత్నదోహద మహోత్సవముల్ జరిపించి మించి యి
త్తరుణమునందు పెల్లుగ వధానములెల్లెడ జేయుచుండ సం
బరపడి యెంతవారలును ప్రస్తుత కాలమునందు నెల్లెడన్
పురముల పల్లెలందు కడుపూనికతోడ శతావధానమ
త్యురుతరశక్తి జేయుదు మహోయన జేయుదుమంచు చాటి య
బ్బురపడ జేయుచుండ - నిట పోలినవాడు స్వదేశమందు నొ
క్కరుడును లేకపోయెనని కుందుచు నుండగ నేడు పండితా

---

26. చమత్కార కవిత్వము. 37. మరియు భారతి మే. 1972.
27. చమత్కార కవిత్వము. 146 - 149.
28. చమత్కార కవిత్వము. 155.

దరమును గాంచువాడు నయతత్పరుడున్ మఱి మాదు శిష్యుడై
పరగినవాడు గాంగఝర పద్ధతి నాశువుజెప్పువాడు ని
ర్భరమతిశాలి గాడెపలి రాఘవు డొక్కడు గానుపించె మే
ల్తరగతిగాగ నీ శతవధానము నేడొనరించి చూపె బా
పురె! కొఱతల్ దొరంగె కడు మోదము గల్గెను కీర్తిదక్కెనున్.

ఈ పద్యములు శ్రీ రాఘవశాస్త్రి గారిని ప్రశంసించుటతో పాటు తిరుపతి కవుల కవితాప్రభావ మా కాలమున ఆంధ్రభాషాభాషీయుల నెట్లు శక్తిమంతులుగా చేసి ముందు కురికించినదో కూడ చెప్పుచున్నవి. అవధానములు చేయకపోయినను అశువునందందరు పండితులును అనాయాసముగానే ప్రవర్తించెడి వారనుటకు ఆ పద్యములు చెప్పిన శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి గారే నిదర్శనము. శ్రీ రాఘవశాస్త్రి గారి శతావధానాశుకవిత తిరుపతి వేంకట కవులమెప్పునకును పాత్రమైనది.[29]

5. విశ్వనాథ సత్యనారాయణ :

తిరుపతి వేంకటకవుల శిష్యులలో ఆశుధారా కవిత్వమలవడని వారు లేరనియే చెప్పవచ్చును. విశ్వనాథ సత్యనారాయణ గారును కొడాలి ఆంజనేయులుగారును మొదట మొదట జంటకవులుగా కవితా సాధన చేసినారు. సత్యాంజనేయ కవులు రచించినట్లుగా కొన్ని రచనలును వెలువడినవి. ఆ పిమ్మట ఆ జంట విడిపోక తప్పని పరిస్థితులు వచ్చినవి. జంట కవులుగా నున్నప్పు డాశుకవిత నెంత చెప్పిరో అది తెలియరాకుండానే పోయినది. సత్యనారాయణ గారి ఆశు రచనలలో మిగిలి నిలిచినది 'వేణీ భంగము'. ఇందు దాదాపు ఏబది సీసపద్యములున్నవి. 1928 సంవత్సరమున మొదటిసారిగా ముద్రింప బడినది. ఆ పిమ్మట విశ్వనాథ ఆశురచనమును మానివేసెను. కావ్యరచన-ఆశుకవితా ప్రదర్శనము మానినను అప్పుడప్పుడు సభలలోను, అక్కడక్కడ గోష్ఠులలోను విశ్వనాథ ఆశువుగా పద్యములు చెప్పుటగలదు. కాని వాటిని గురించి ఆయన యేమియు శ్రద్ధ తీసికొనడు గనుక అవి చాలపరకట్లే పోయినవి.

---

29. చమత్కార కవిత్వము. 157.

3. అవధాన కవితలు

1. స్వరూప నిరూపణము

అవధానమనగా నదియొక మనోయోగ విశేషము. విషయాంతర సంచారము నిరోధింపబడిన మనస్సునకు అభీష్ట విషయమునందు యోగమే అవధానము. ఈదృశమైన మనోయోగ విశేషము నభ్యసించి ప్రదర్శించెడు వారికి అవధానులని పేరు.

స్వరహీనతను మాత్రాహీనతను సహింపని వేదము నధ్యయనము చేసెడి వారికి అవధానము యొక్క అభ్యాస మనివార్యమైనది. అందుచేత మొదట మొదట వేదవిద్వాంసులే అవధానులు.

మనసున కేకాగ్రతయే కదా అవధానమన్న. ఆది యేపని సక్రమముగా చేయవలయునన్నను అవసరమే. మనస్సున కేకాగ్రత బాహ్యావిషయముల తాకిడిని బట్టియుండును. మనస్సునకు దేశకాలములు బాహ్యావిషయములు. పూర్వజన్మ సంస్కార రూపమైన ప్రతిభానము లోపలివిషయము. కావ్య బీజము ప్రతిభానము. దేశకాలముల అనుకూల్య రూపమున మనసుకు కలిగెడు అవధానము క్షేత్రము. కావ్య ముత్పన్నమగుట కివి యోగ్యముగా నుండవలయును. వామనాచార్యుడు చిత్తైకాగ్ర్యము నవధానముగా చెప్పిన దానికర్థమది.[1] ఇక్కడ ఇదొక వాఙ్మయ విలాసప్రక్రియ కాదు. ఒక మంచి మనోలక్షణము. క్రమముగా అవధానముతో చేసెడి ప్రదర్శనము లన్నింటి కిని అవధానములనియే పేరు వచ్చినది. ఆశుకవిత్వమునందు సమస్యా పూరణ మును, వ్యస్తాక్షరిని, నిషేధాక్షరిని విడివిడిగా చెప్పుటకు హేతువులు అవి దేని కదిగా నవధానముతో చేయవలసినపనులగుటయే. మునుముందా విధముగా నవి దేనికదిగా నొకఅవధానమై అట్టి యెనిమిదింటియొక్క ఏకకాల నిర్వహణమునకు అష్టావధానమని, నూరింటియొక్కఏకకాల నిర్వహణమునకు శతావధాన మనియు పేర్లు వచ్చినవి. నిజముచెప్పవలసివచ్చినచో అష్టావధాన శతావధానములు అవధానములుకావు- అవధానవిశేషములు అని చెప్పవలయును.

---

1. విజ్ఞాన సర్వస్వము. ఆరవసంపుటము. 522.

నేత్రావధానమని[2] నాట్యావధానమని కూడ కలవు. నేత్రావధానము స్వరూపము తెలియదు. నాట్యావధానమునకు వాఙ్మయముతో సంబంధమున్నది కాని కావ్యసామ్రగితో సంబంధములేదు.

ఆశుధారాకవిత్వముల వారే మొదటినుండియు నవధానములు చేయుచుం డుటచేత అవధానమనగా పద్యవిద్యాప్రదర్శన రూపమైన అష్టావధానమో, శతావ ధానమో అన్నట్లు రూఢమైనది.[3]

అవధానములు చూచెడు వారికి వినోదప్రాయములుగానే యుండును కాని చేసెడు వారికి ప్రాణము మీదకు వచ్చినంత పనిగానుండును. అది తమ కొక విలాస క్రీడయన్నట్లుగా నవధానులు కొందరు ప్రవర్తించుట అది వారి ప్రతిభా విశేషమునకు మాత్రమే నిదర్శనము. అవధానులకు ఉభయభాషా పాండితి, శాస్త్రప్రవేశము, ప్రతిభ, అనర్గళానుధార, సమయస్ఫూర్తి, అసాధారణ ధారణ ఉన్నప్పుడే వారి అవధానములు సభారంజకములై రాణించును.[4]

సహస్రావధానమని కూడ ఇటీవలికాలమున వినిపించుచున్నది. వినిపించిన దని చెప్పుటలోనే సామంజస్యమున్నది.

2. ప్రారంభదశా కాలము

అష్టావధానము, శతావధానము, అన్న పేర్లు మొదట మొదట వినిపింపక పోయినను శ్రీనాథుని కాలమునుండి ఈద్యశమైన కవితా ప్రదర్శనములు మొద లయినట్లు కనిపించుచున్నది. ఆశుకవిత్వమునకు వలెనే అవధానకవిత్వమును శ్రీనాథ యుగముననే ప్రసిద్ధికి వచ్చినది. శ్రీనాథుడవధాన శబ్దము నుపయో గించినను[5] అది దాని స్వార్థమునందే యున్నది కాని వాఙ్మయ విలాసక్రీడయైన

---

2. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 41.
3. గుంటూరు కాలేజీ శతావధానము. అవధానములు. xxxv.
4. విజ్ఞానసర్వస్వము. ఆరవ సంపుటము. 522. మరియు తిరుపతి కవుల సాహిత్యసమీక్ష. 30.
5. కాశీఖండము. 2-68.

అవధానమును చెప్పుటలేదు. ఆ లెక్కను పాల్కురికి సోమనాథుడు కూడ ఆ శబ్దము నుపయోగించినాడు.[6] అక్కడను అది స్వార్థమునే చెప్పుచున్నది.

జక్కన కవి తన తాతగారయిన పెద్దయామాత్య సుకవి మహిమ నొక సీసమాలిక యందు వర్ణించుచు "ఎవ్వడే యవధానమెఱుగు నయ్యవధానమున వానికించుకముల్లసూప" గలడని విస్పష్టముగా వ్రాసినాడు.[7] ఈ పెద్దయా మాత్యుడు పది సంవత్సరములటునిటుగా తిక్కన సోమయాజి కాలము వాడయినచో అవధానవిద్య అప్పటి నుండియే యున్నదని చెప్పవలసివచ్చును. చెప్పినను ఏమని చెప్పవలయును ? అష్టావధానమనియా ? శతావధానమనియా ? రెండునూ కావచ్చును. మరియించకను అవధాన విశేషములున్నచో అవియును కావచ్చును.

ఆంధ్రభాష యందు అవధాన కవిత్వమును ఆయన తాతగారేగాక జక్కనయు చేసెడివాడని కొందఱి అభిప్రాయము.[8] తన తాత అవధానకవిత్వ నిపుణుడని చెప్పెనే కాని స్వవిషయమున అట్లెక్కడను జక్కన చెప్పలేదు.[9]

ఆ తరువాత కాలమున చరికొండ ధర్మన్న రామరాజ భూషణుడు మొదలయిన వారు తాము శతలేఖినీ పద్యసంధాన ధౌరేయులమని చెప్పుకొనిరి. కనుక వారు చెప్పినది శతావధానము విషయమే కావచ్చును. అగుచో తెలుగు భాషా కవులకు మొట్టమొదట శతావధాన విద్యయే వశమైనదనవలయును.

రామరాజ భూషణుడే భట్టుమూర్తియును గనుక ఆయనను అవధాన శారదామూర్తి[10] యని చెప్పవలయును. మరియు నాయన తనను గురించి చెప్పుకొన్న విషయములును గమనింప దగినవి.

శత లేఖినీ పద్య సంధాన ధౌరేయు
ఘటికా శతగ్రంథకరణ ధుర్యు
ఆశు ప్రబంధబంధాభిజ్ఞు నోష్ఠ్య ని
రోష్ఠ్యజ్ఞు నచల జిహ్వోక్తి నిపుణు

---

6. బసవ పురాణము. 1. పంక్తి. 143.
7. విక్రమార్క చరిత్ర. 1-20.
8. గుంటూరు కాలేజీ శతావధానము. అవధానములు. xxxiv.
9. విక్రమార్క చరిత్రము. (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ) పీఠిక 3.
10. కావ్యాలంకార సంగ్రహము. గద్య.

తత్సమ భాషా వితానజ్ఞు బహు పద్య
సాధిత వ్యస్తాక్షరీ ధురీణు
నేక సంధోదిత శ్లోక భాషాకృత్య
చతురు నోష్ఠ్య నిరోష్ఠ్య సంకరజ్ఞు
నమితయమకాశునిధి ప్రబంధాంక సింగ
రాజసుత తిమ్మరాజ పుత్ర ప్రసిద్ధ
సరస వేంకటరాయ భూషణ సుపుత్రు
ననుబుధ విధేయు శుభ మూర్తి నాయధేయు[11]

ఆశు ప్రబంధ బంధాజిజ్ఞుడనని, అమిత యమ కాశునిధినని తన యాశుధారా రచనమునందలి పారగత్వమును ఒకటికి రెండు సార్లు చెప్పుచున్నాడు. శతలేఖినీ సమయలేఖినీ విద్యాప్రచర్యనముల కది మొదటి యవసరము గనుక కవియందట్లే యుండవలయును. బహుపద్యసాధిత వ్యస్తాక్షరీ ధురీణుడనను చున్నాడు- అనగా ఆ కాలమున నది వ్యస్తముగా నొక కవితా విలాస ప్రక్రి యగా నున్నదని యర్థము. అంతేగాని అష్టావధానము నందొక యంగమును మాత్రమే భట్టుమూర్తి చేసినాడు గాని, సంపూర్ణముగా నష్టావధానమును చేసి యుండడని[12] చెప్ప కూడదు. అష్టావధాన ప్రక్రియ అప్పుడున్నదో లేదో కూడా మనకు నిట్టిగా తెలియదు. శతలేఖిన్యవధానము చెప్పబడినట్లుగా అష్టావధానము చెప్పబడలేదు. స్వీయములయిన ప్రతిభా పాండిత్యముల నంత విశదముగా పేరు పేరున పేర్కొన్న వారు అష్టావధానమన్న ఒక ప్రక్రియా విశేషమును తాము ప్రదర్శించి యున్నచో, మన లెక్క ప్రకారమందలి యొక యంశమునే పెద్దగా చెప్పుకొన్నప్పుడు, దానిని పేర్కొనక విడిచి పుచ్చరు కదా! అందువల్ల అప్పుడు తెలిసినది శతావధానమే. ఆశుకవితయే శతావధానమునకు ప్రాణము గనుక ఆశుకవితను సాధించిన ఆంధ్రకవులట్లు చెప్పుకొనియుందురు. అయినను లాక్షణికుడాశుకవిత్వమునందు శతావధానమును గాక అష్టావధానము నెందుకు చెప్పినాడో ఇంకను విచారింపవలసి యున్నది.

---

11. కావ్యాలంకార సంగ్రహము. 1-13.
12. తిరుపతి కవుల సాహిత్య సమీక్ష. 25.

మరియు పదునైదవ శతాబ్దముత్తరార్ధమునందున్న హరిభట్టు తాను "అష్ట ఘంటావధాన పరమేశ్వరు" డనని గద్యలో వ్రాసికొనినాడు.[13] పదునారవశతాబ్ద ముత్తరార్ధము నందలి కంకంటి పాపరాజు కూడా "చతుర్విధానవద్య కవిత్వ విద్యావధానాధునాతనభోజరాజు"నని వ్రాసికొన్నాడు.[14]అష్టఘంటావధానమనగా నేమి? ఇంకను విచారింపవలయును. పాపరాజుగారి అవధానము స్వరూప మును తెలియవలెను. విశేషణములు విలక్షణములుగా నున్నవి కదా!

పదునేడవశతాబ్ద ముత్తరార్ధమునధిగమించి తంజావూరును పాలించిన శహాజీ మహారాజు ఆస్థానమునందున్న ఆంధ్ర భాషా కవులలో పేరు తెలియని "అష్టావధాని కవి" ఒకాయన కలడు.[15] ఆయన బిరుదు నామమునుబట్టి ఆయన అష్టావధానములు చేసెడివాడని నిస్సందేహముగా చెప్పవచ్చును. అప్పటి అష్టావధాన ప్రక్రియావిధాన మెట్లుండెడిదో ప్రత్యక్షముగా మనకు తెలియదు.

ఈ విధముగా అవధానవిద్య శ్రీనాథుని కాలమునుండియు తానున్నానని పించుచు రాయల యుగానంతరము- శతావధానముగా - శతకోట్యవధానముగా ప్రసిద్ధమై దక్షిణాంధ్ర దేశమున అష్టావధాన రూపమును కూడ పొంది ఈ ఇరు వదియవ శతాబ్దారంభమునకే శ్రీ తిరుపతి వేంకట కవుల నాశ్రయించి ఆపై శిష్య ముఖముగా కొంతకాలముపాటు ఆంధ్రభాషా సరస్వతిని చకచ్చకితము చేసినది. ఆశుకవిత - అవధానకవిత - తిరుపతి వేంకట కవులు - శతావధానములు - ఇవి తుల్యారకములు.

చరిగొండ ధర్మన్న సత్కవి చంద్రుండు
సవకంపు మొక్కను నాటినాడు
భట్టుమూర్తియనెడు పండిత మాన్యుండు
పొలుపొందగా నీరు పోసినాడు
అట మాడభూషి వేంకట సత్కవీంద్రుండు
పెంపొందగా నల్లు పెట్టినాడు
తిరుపతి వేంకటేశ్వరు లనశ్వరముగా
సదమల కృపతోడ సాకినారు

---

13. నారసింహ పురాణము ఉత్తరభాగము.
14. శ్రీముదుత్తర రామాయణము.
15. దక్షిణ దేశీయాంధ్రవాఙ్మయము. 254.

అట్టిదగు నీ శతావధాన మనెడి లతిక
సరసఁ గొప్పరపుం గవీశ్వరుల చేత
పుషితమై విరుల దగె తత్ఫల్ల సుమము
లఖిల వేదులు దాల్చెద రొడలలను. 16

ఈ పద్యమును చెప్పి శ్రీ శేషాద్రి రమణ కవులు శతావధానము యొక్క పుట్టు పూర్వోత్తములను సమీక్షించిరి. మొదటి ముగ్గురును తిరుపతి వేంకటేశ్వరుల శతావధానాశుకవితా సౌధమునకు పునాదిక్రింద పడిపోయినారు. తిరుపతి వేంకట కవుల కాలము - అనగా - ఇరువదియవ శతాబ్దము ప్రథమ పాదము - ఆంధ్ర దేశ భాషలను ఆశుకవితా ప్రవాహమున ముంచి తేల్చినది. అవధానాత్మకము లయిన వాఙ్మయ విలాసములు వెల్లివిరిసినవి.

3. అవధాన విద్యా ప్రభువులు

అత్యద్భుత ప్రాభావాష్టావధాన శ
తావధానములు స్వాభావికములు.

నూఱు మందికి కవనంబపార ధార
వఱల జెప్పెడి మాకిది బహుమతియని. 17

శతలేఖినీ పద్య సందర్భ నిర్భరుల్
తిరుపతి వేంకటేశ్వరుల కెఱఁగి. 18

ఇలపయి నాంధ్రదేశమున నిర్వురు తిర్పతి వేంకటాఖ్యులై
కలరుకదా యశోధను లఖండుల మోఘ కవిత్వ చాతురీ
కవిత శతావధానులని కంకణముల్ ధరియించినట్టివారు. 19

---

16. కొప్పరపు సోదర కవుల చరిత్ర. 61.
17. నానారాజ సందర్శనము. 15, 125.
18. వేలూరి శివరామశాస్త్రి.
19. వేమూరి వేంకటసుబ్బయ్య.

శతలేఖిన్యవధానముల్ సలుపుచున్ సత్కీర్తి నార్జించి యు
న్నతులే శ్రీపతి వేంకటేశకవులే ధన్యాత్ము లూహింపగన్.[20]

తిరుపతి వేంకటేశ కవిధీర కృషీవలులాంధ్ర సంస్కృతో
ర్వరగొని బుద్ధియుగ్యముల బాగుగదున్ని శతావధాన దు
స్తరకవితాది బీజముల చల్లగమొల్చె సుబోధనాసుధా
ఝురుల పెరుంగుచున్.....[21]

తిరుపతి వేంకట కవులవతరించినప్పటి నుండి దేశభాషలను గ్రుచ్చి యెత్తెడు వాఙ్మయ విలాస ప్రక్రియగా శతావధానమునకు పెద్ద ప్రచారము వచ్చినది. అంత ప్రచారము వచ్చుటకానాటి విద్వత్కవుల యందున్న ఈర్ష్యా సూయలతోడి జిగీషా మనీషయు ప్రబల హేతువు. ఈ కావ్య విద్యా వీరాహంకారమునను గురుస్థానీయులైన ఆంధ్రభాషా మహాకవులు వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు. భీమకవి సంగతికంటె తరువాతి వారిని గురించిన సమాచారము మనకెక్కువగా తెలియును.

దీనార టంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకు తోడైతాంధ్రభాషా మహాకావ్య
నైషధ గ్రంథ సందర్భమునకు
పగుల గొట్టించి తుద్భట వివాదప్రౌఢి
గౌడ డిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూష క్రియాశక్తి రాయలయొద్ద
పాదుకొల్పితి సార్వభౌమ బిరుదు
ఎటులు మెప్పించెదో నన్ను నింకమీద
రావు సింగ మహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొని యుండి సీవు
సరస సద్గుణ నికురంబ : శారదాంబ : [22]

---

20. మైలవరపు కృష్ణమూర్తిశాస్త్రి.
21. గుంటుపల్లి సుబ్రహ్మణ్యం. గుంటూరు కాలేజీ శతావధానము చూచునది.
22. చాటుపద్య మణిమంజరి. ప్రథమ భాగము. 115.

ఒకని కవిత్వ మందెనయు నొప్పులు తప్పులు. నాకవిత్వ మం
దొకనికి తప్ప పట్టుపని యుండదు కాదని తప్పుపట్టినన్
మొకమటు క్రిందుగా దివిచి మొక్కలు వోవ నినుపకత్తితో
సికమొదలంట గోయుదును చెప్పనగొట్టుదు మోముదన్నుదున్.23

ఆవిధముగా శ్రీనాథుడు ఈవిధముగా తెనాలి రామకృష్ణుడు తిరుపతి వేంకట కవుల నావేశించి తెలుగు దేశమును తెలుగు కవితను ఆకాలమున గ్రుచ్చియెత్తింపించిరి. తదావేశమది యెట్లో ఈ క్రింది పద్యముల వలన కొంత యూహింపవచ్చును.

ఆనంద గజపతిక్ష్మానాథు సభలోన
కవనమ్ముచే మెప్పు గాంచినాము
రావు జగ్గారాయ రాజన్య సభలోన
శతఘంటకవనమ్ము సలిపినాము
కాకినాడాది సద్గ్రామమ్ముల శతావ
ధానమ్ముచే కీర్తి బూనినాము
కాశీసహస్రాది కావ్యమ్ములు రచించి
కాశీకృపం జెంద జాలినాము
ధాతురత్నా కరోద్ధామి చంపువు వ్రాసి
పాణినీయస్తుతుల్ వడసినాము.

నిరుడు గద్వాల రాజసన్నిధిని శత్రు
మధ్యమందు జయంబంది మహిపువలన
బంగరు బిరుదులును జయపత్రికయును
బడసి యీయేడు నిను జూడవచ్చినార
మాత్మకూరుపురీరాజ: అతులతేజ: 24

---

23. చాటు పద్యమణి మంజరి. ప్రథమభాగము 145.
24. నానారాజ సందర్శనము. పూర్వార్ధము. 53.

అభినవ రామలింగ బిరుదాంకుడ నా కవనమ్మునందు నీ
యభణపుగాండ్లు తప్పులిడ నర్హులెఁ కాదని తప్పుదిద్ద మా
యుభయులలోన నొక్కఁడు మరొక్కనికిం దగుగాక ఈర్ష్యచే
అభసు శుభమ్మునుం దెలియ కార్చెడి దేబెలు మాకు లెక్కయే!25

దేశసంచారమునకు మూలమైన విద్వద్ద్వేషము గూర్చి తిరుపతి వేంకటకవు లాత్మ సంబోధనముగా చెప్పుకొన్న పద్యము.

ఎట్టో విద్యలనభ్యసించు కొని యా యీ దూరదేశమ్ములం
బట్టంబంచును పల్లెయంచనక విద్వద్ద్వేషముంబూని బల్
తిట్టుల్ తిట్టుచు తిట్టులంబడుచు నిన్ద్రిప్పన్ ఫలంబేమియో
పొట్టా : సీదురదృష్ట మిట్లయినచో భూపాలకుల్ నిందుయలే?26

ప్రభువులుగా ప్రవర్తించి అవధాన విద్యావైభవమునకు మారుపేరుగా నిలువ్రొక్కొనినారు గనుక తిరుపతికవుల నింతగా అనుకొను చున్నాము గాని ఇంతకంటె ముందుగా ననుకొనవలసినది శ్రీమదభినవ పండితరాయ విద్వన్మాడభూషి వేంకటాచార్యులవారిని. అసలీ అవధాన సామ్రాజ్యము వారిది. 27 వారిసుండియే తపుకిది సంక్రమించినదని తిరుపతికవులు సగర్వముగా చెప్పుకొనినారుకూడ.28 విజయలక్ష్మి వీరికి మిక్కిలి చేదోడు వాదోడుగానై దోహదము చేయుటచేత సామ్రాజ్యము మహాసామ్రాజ్యమై తిరుపతి కవులు దానికి తాము ప్రభువులయినారు.

ఆ ప్రభుత్వకాలములో జంటకవులుగా నుండి అవధానాశువులను నిర్వహించుట "ఒక ఫాషనై పోయినది." ఇంతేగాక ఈ కాలములో శతావధానాలు చేయుట "ఒకజాడ్యముగా పాకిపోయినది."29 మరియు వీరు ఆంధ్ర దేశము అన్నిమూలలను శిష్యగణము ద్వారా స్థావరమేర్పరచుకొన్నారు. పేరు పడిన ఆధునికాంధ్రకవులు వారి శిష్యులు కానివారు లేరనవచ్చునేమో కూడా!

---

25. నానారాజ సందర్శనము. ఉత్తరార్ధము. 121.
26. నానారాజ సందర్శనము. పూర్వార్ధము. 53.
27. శ్రీ మాడభూషి వేంకటాచార్యులు. వ్యాసము. భారతి. సెప్టెంబరు. 1964
28. తిరుపతి కవుల సాహిత్య సమీక్ష. 25.
29. నవ్యాంధ్ర సాహిత్యవీథులు. ప్రథమభాగము. 35.

4. అష్టావధానము

ఆశు కవిత్వములో నిదియు నొకవిధమే అయినప్పటికిని తనలోనే ఆశు కవిత్వము నొక విధమనునట్లుగా ఈ అష్టావధానము ప్రశస్తికి వచ్చినది. అసలు విచిత్రమేమనగా ఆశుకవసమీ అవధానములోని యెనిమిది క్రియలలో నొకటికాదు. అది వట్టి యుపరి. తిరుపతి వేంకట కవుల యష్టావధానములందును ఆశు కవిత్వ ముపోద్ఘాత ప్రాయముగాను మరియు తుపక్రపసంహార రూపమునను నుండెడిది.

అరయగ మేమొనర్పగల మష్టవధానము దానిరీతి నే
ర్పఱచి వచింతు; మెట్లనిన-పండిత సమ్మతిగా కవిత్వ మెం
దఱడిగిరేని యందరకు తప్పులు చొప్పడకుండ నాంధ్ర మం
దు రహిని దేవభాషను సుదుష్కర కల్పనలొప్పఁజెప్పి-యెం
పఱయినగాని కష్టపు విధమ్మున నెన్నిటినైనగాని య
క్కరలులొసంగిరేని యవిగైకొని తప్పక చెప్పి-యంతటో
కరయము మీఱి లౌకిక ప్రకారముగా వచియించువారి కు
త్తరము లొసంగి- మీదను ముదంబలరన్ బదరంగమాడి-కొం
దఱకు గురుత్వమూని పఠనమ్ములఁజెప్పి-పురాణగాథలన్
దురమొసరన్ ఖరింపగ నెదురొక్కని యర్థముచెప్పి-పుష్పముల్
గరమును వీపుపై విడువగా సరిగా గణియించి-ఘంటికల్
నెఱయగఁగొట్టువానిని గణించి-నిషేధమొనర్చునట్టి య
క్కరములుమాని పద్యములు కల్పనచేసి-మనోహరమ్ముగా
విరచన సేయనేర్తుమిది వేడుకమీఱగ చిత్తగింపుడీ! [30]

(వ్యస్తాక్షరి) దత్తపది - లోకాభి రామాయణము - చదరంగము - కావ్యపాఠము- (ఆకాశ) పురాణము - పుష్పగణనము - ఘంటా గణనము - నిషేధాక్షరి - ఇవి అష్టావధానమునందలి క్రియా విశేషములు, సంస్కృతాంధ్రములయం దడిగిన వారికడిగినట్లు ఆశుకవిత్వము చెప్పుట యది యదనము.

---

30. నానారాజ సందర్శనము. పూర్వార్ధము. 48.

అష్టావధాన స్వరూపమును నిష్కర్షించెడి పద్యము వారిదే మరొకటి కలదు.

పౌరాణోక్తి కవిత్వ పుష్ప గణనా వ్యస్తాక్షరుల్ లౌక్య గం
భీరోక్త్యంచిత కావ్యపాఠన కళా విద్భాషణంబుల్ ముదం
బారంగా చతురంగ ఖేలనము, ఈ యిష్టప్రకారంబు లొ
ప్పారున్ శంకర! యేక కాలమునసే యష్టావధానమ్మునన్. 31

ఇందుదత్తపదిలేదు. ఘంటా గణనములేదు. నిషేధాక్షరి లేదు. ఇందుకు బదులుగా కవిత్వమాశువుగా చెప్పుట - శాస్త్రవాదము చేయుట - వ్యస్తాక్షరములను కలిపి చెప్పుట - ఉన్నవి.

తిరుపతి వేంకటకవులు తాము చేసెడు అష్టావధానముల స్వరూపమును గద్వాల సంస్థానమున విశదీకరించి చేసిరిగదా! అష్టావధానములోని యెనిమిది విషయములును అవి యేవి అన్నప్పుడు అభిప్రాయ వైవిధ్యమున్నది.32 ఆశు కవిత - వ్యస్తాక్షరి - అప్రస్తుత ప్రశంస - చదరంగము - కావ్యపాఠము - పురా ణము పుష్పగణనము - ఘంటా గణనము - నిషేధాక్షరి — దత్తపది - సమస్యా పూరణము - ఈయబడిన ఇంగ్లీషు తేదీకి సరియైన వారమును చెప్పుట - యాంత్రిక చిత్రము లేక గణిత చాతుర్యమును ప్రదర్శించుట - ఈ మొదలయిన బహ్వాం శములలో అవధాని తనశక్తికనువైన యెనిమిదింటి నెన్నుకొనును. ఆశుకవిత-వ్యస్తాక్షరి - నిషిద్ధాక్షరి - దత్తపది - సమస్యా పూరణము - ఈ అయిదే కవి యొక్క పద్యరచనా ప్రతిభకు సంబంధించినవి;మిగిలినవికవిత్వాంశములు కావు. అవి సగము ఇవి సగముగా అష్టావధానములు జరుగుచుండును. సామాన్యులయిన సామాజికులకు ఆశుకవిత రుచించినట్లుగా వ్యస్తాక్షరి - నిషిద్ధాక్షరి - దత్త పది ఇత్యాదులు రుచింపవు. అవి వారి బుద్ధికి విషయములు కావు. కవిత్వాంశ ములు కానివన్నియును వారికొరకు.

అవధానమును సమస్యతో మొదలుపెట్టినచో చమత్కారముగా నుండును. సాధారణముగా సమస్య ఒకానొక పద్యము యొక్క పాదముగా నుండును. అది విపరీతార్థ ప్రాతిపదికముగా గూడ నుండును. అవధాని తన ధీశక్తిచేత

---

31. శతావధాన సారము. ఉపోద్ఘాతము. ix.

32. గుంటూరు కాలేజీ శతావధానము. అవధానములు. xxx.

తచర్థ వైపరిత్యమును తొలగించుచు సార్థకముగా పద్యమును పూరింపవలెను. అవధానములో సమస్యనిచ్చుటయే మొదటి ప్రశ్న.

1. సమస్య : గరుఁడుడు గణపతికిఁ దండ్రి గావలెజుమ్మి. గరుత్మంతునకు గణపతికిని తండ్రి కొడుకుల సంబంధమును చెప్పుట విపరీతముగా నున్నదికదా ! ఇంత విరుద్ధార్థమును సార్థకముగా చేసిచేయుటయే సమస్యను పూరించుట. మొదటి ప్రశ్నమును విని అవధాని రెండవ పృచ్ఛకునినుండి రెండవప్రశ్నమును వినగోరును.

2. నిషిద్ధాక్షరి : ఫలానా విషయమును ఫలానా పద్యమున వర్ణింపుమని పృచ్ఛకుడు కోరును. ఆ విషయమును మనస్సున పెట్టుకొని అవధాని తరువాతి ప్రశ్న కొరకు మూడవవాని నడుగును.

3. వ్యస్తాక్షరి : ఒక పద్యములోని అక్షరములను చిన్న చిన్న కాగితపు ముక్కలమీద ఒక్కొక్కటిగా వ్రాసి ఆది యెన్నవ యక్షరమో ఆ సంఖ్యను కూడ దాని క్రింద వ్రాసి మొత్తము కలగా పులగము చేసి పెట్టుకొన్న పృచ్ఛకుడు తనకు చేతికి వచ్చిన కాగితపు ముక్క నొక దానిని అవధాని కందించును. ఆ అక్షరమును దాని సంఖ్యను చూచుకొని అవధాని ఆ కాగితపు ముక్కను తిరిగి పృచ్ఛకున కిచ్చివేయును. ఆ పిమ్మట నాల్గవ ప్రశ్నకొరకు తరువాతివానిని పలుకరించును.

4. దత్తపది : ఏవో నాలుగైదు పదముల నెన్నిక చేసికొని వచ్చిన పృచ్ఛకుడు వాని నవధానికి చెప్పి ఆ పదములు వచ్చునట్లుగా ఫలానా విషయమును గురించి పద్యమును చెప్పగోరును. ఫలానా పద్యమును చెప్పమని కూడ అడుగవచ్చును.

దత్త పదిప్రశ్న : గోలకొండ, పూలదండ, కొత్తకుండ, మూలముండ - ఈ పదముల నుపయోగించుచు రామాయణ కథా విషయముగా పద్యమును చెప్పవలెను.

ఈ నాలుగు ప్రశ్నముల నడుగు లోపలనే మధ్య మధ్య అప్రస్తుత ప్రసంగము - ఆశుకవిత - తేదీకి వారము - పుష్ప గణనము ఇత్యాదు లేవో ఆ మిగిలిన నాలుగు క్రియలును కొనసాగుచుండును. ఇందులో కూడ ఆశుకవిత తేదీకి వారము సాధారణముగా ఒకసారితో సమాప్తమై పోవును. అప్రస్తుత

ప్రసంగమొకటి కొనదాక మధ్య మధ్య అవధానిని అన్య విషయముల వైపు ప్రతిప్పటకు ప్రయత్నించుచుండును. అష్టావధానమున కవి దృష్టి ఆంతయును ఆ నాలుగు ప్రశ్నల మీదనే యుండును. వరుసగా ఆ ప్రశ్నములకు సమాధాన పద్యములను ప్రారంభించిన అవధాని ముందన్నింటికిని మొదటి పాదములను చెప్పును. మధ్య మధ్య పృచ్ఛకుల లోకాభిరామాయణములో పాల్గొని చమత్కారమును కల్పించుచు - పురాణాదికములను చెప్పుచు క్రమము దప్పకుండ ద్వితీయాది పాదములను కూడ చెప్పి పద్యమునను పూర్తి చేసి చివర కన్ని పద్యములను యథాపూర్వకముగా నప్పజెప్పవలయును. అప్పటికి గాని అవధానము పూర్తి కాదు.

1. హరుఁడు గణపతికిఁబోలెన్
సరసీజాక్షుండు నాభిజన్మునకుబలెన్
గురుకీర్తి గన్న యా సా
గరుఁడుడుగణపతికిఁ దండ్రి గావలె జుమ్మీ.[33]

ఇది సమస్యాపూరణము. గరుడుడుగణపతికిఅన్నదానికి ముందు "సా" అను వర్ణమును కలిపి సాగరుడు + ఉడుగణపతి అని విడదీయుటచేత నక్షత్ర గణమున కధిపతి యైనవాడు చంద్రుడనియు వానికి సాగరుడు తండ్రి యనియు అర్థము పొసగిపోయినది. సమస్యాపూరణ మనగా అర్థవైపరీత్యములను తొలగబెట్టుచు ఆశ్చర్యకరమైన మలుపును తెచ్చి సార్థకముగా పద్యమును కల్పింపవలెను.

2. నిషిద్ధాక్షరి పద్యమును అవధాని ఒక అక్షరముతో మొదలు పెట్టును. దాని తరువాత ఏ అక్షరము వచ్చుటకు వీలున్నదో గ్రహించి దానిని పృచ్ఛకుడు నిషేధించును. అప్పుడు అవధాని తాను మొదట చెప్పిన వర్ణముతో కలసి అర్థము చెప్పగలిగిన మరొక వర్ణమును చెప్పును. ఆ రెండు వర్ణముల తరువాత వచ్చుటకు వీలున్నదని తాను గ్రహించిన అక్షరమును మరల పృచ్ఛకుడు నిషేధించును. ఈ విధముగా పద్యము నంతటిని ఒక్కొక్క అక్షరముగా పృచ్ఛకుడు నిషేధించిన అక్షరము లను విడిచి పుచ్చుచు నెమ్మదిగా నెట్టుకొని పోవలయును.

---

33. కొప్పరపు సోదర కవుల చరిత్ర. పుట. 26.

3. వ్యస్తాక్షరి పదాక్షరములను సంఖ్యాక్రమమునను సరించి జ్ఞాపకము పెట్టు కొని అవన్నియు నా వరుసలో ఏ పద్యమున కిముదునో చూచుకొని ఆ వరుసను పద్యమును అప్పగింపవలెను.

4. దత్త పదములుంచి కోరిన విషయముతో పద్యము చెప్పుట :

నీ నాథుండస గోలకొండ పయి నెంతేనుండు నవ్వారితో
నీనాఁడంబుధి దాటివచ్చు టెఱుఁగండేమందునా రాఘ వో
ర్వీ నుండి పైద పూలదండ పయి పైరేకొ త్తకుండంగ గె
ట్టూనస్ రా మనమాలముండదసుటెట్లో తెల్పు మండోదరీ.34

గోలకొండను రెండు పదములుగా విడదీసినారు. గోలయనగా మూర్ఖు డని యర్థము. కొండపయినున్న వారు కిష్కింధాపురము వారు. ఎద పూలదండ - ఎదమీఁదలి పూల దండ పై పై రేకు కూడ ఒత్తకుండ సలగకుండగా నని యర్థము. రేకు + ఒత్తకుండ రేకొ త్తకుండ మనము + ఆలము + ఉండవనుట - మనము యుద్ధముండవనుకొనుట యెట్లన్న యర్థము. ఇచ్చిన పదము లిచ్చినట్లే యున్నట్లు కనిపింపజేయుట వాటి సంధులూహగొట్టి అవధానులు పద్యమును చెప్పినారు.

తిరుపతి వేంకట కవులు నిర్వహించెడు అష్టావధానముల విధానము తెలి యుట కానాటిదే యైన ఒక వర్ణనాత్మకమైన పత్రికా ప్రకటన మిక్కడి యథా తథముగా చూపపడుచున్నది.35

౧. తొమ్మిది మందికి వారు వారు కోరుకొనిన వర్ణనలు వారు వారు కోరు కొనిన శ్లోక పద్యములలో వారు ఏర్పఱచిన నియమములతోడను తెలు గున సంస్కృతంబున వారు నిషేధించిన యక్షరములు రాకుండ నవ లీలగ నొక్కొక్క యక్షరమే చెప్పుమనిన వారికి నొక్కొక్క యక్ష రము వంతునను మూడేసి యక్షరములు గోరినవారికి నటేయును నొక్కొక్క చరణము చొప్పున గోరిన వారికి నట్లేయును మొదటి చరణము చెప్పుచుండ నంతట నిలిపి రెండవ మూడవ చరణములలో నొక్కొక్క పదము నడిగిన నట్లే చెప్పుచును నందులో నడిగిన వారి

---

34. కొప్పరపు సోదర కవుల చరిత్ర. 61.
35. శతావధానసారము. అనుబంధము. 155.

చ్చిన నేదియో మూడక్షరముల పదమును గూడ గల్పి చెప్పుడనిన నట్లే యును నొనర్చుచు కవిత్వము చెప్పబడినది.

౨. సభికులలో నొకరు ఏదియో ఒక జర్మనీ దేశ చారిత్రములోని యొక్క యితిహాసమును జదివి వినిపించిన నద్దానిని మనమందిడికొని తిరుపతి శాస్త్రుల వారు సంస్కృతమున శ్లోకరూపముగ నొక్క పురాణముగా విరచించి రాగయుక్తముగ వినిపించుచుండ వేంకటేశ్వర శాస్త్రుల వారిచే నతిశ్రావ్యమ్ముగ దానికంతయు రాగయుక్తంబుగనే యర్థమ్ము వక్కాణించుచు నాకాశ పురాణము చెప్పబడెను.

౩. తెలుగు, అరవము, ఇంగ్లీషు మొదలగు నానా భాషలలోని పదములు ఇరువది క్రమము తప్పించి, యొకొక్క పదమును దానికి వరుసలో నివ్వబడిన సంఖ్య సహితముగ నొక్క కాగితపు ముక్క మీద వ్రాసి మధ్య మధ్య నిచ్చుచుండ నవి యన్నియు వరుసగా మనస్సున నమర్చి కొని యవధానాంతమునందు తప్పకుండ ప్రతి పదమును వినిపించుట యనెడు వ్యస్తాక్షరియును చేయబడెను.

౪. అనేక మారులుగ వేఱువేఱు సంఖ్యలుగ కనుచాటుగ కొట్టబడిన గంటల మొత్తము తప్పకుండ నెనుబది యొక్కటి యని చెప్పబడియె.

౫. వ్యాకరణ శాస్త్రములో నొక పండితునితో శాస్త్ర సమ్మతముగ పండిత జనాసుమోదమ్ముగ ప్రసంగంబు చేయబడెను.

౬. రఘువంశమ్ములో నొక విద్యార్థికి నొక్క శ్లోకము క్రమముగా పాఠము చెప్పబడినది.

౭. లోక విషయములు చమత్కారముగ సయుక్తికముగ మధ్య మధ్య సభానురంజకముగ నడిగిన వారితోడ నెల్ల నుచ్చటింపబడినవి.

౮. చతురంగములో బాగుగ నాడగలము అని పేరు వడసిన యొక యిద్దరు గొప్పవారొక ప్రక్కనుండి యాడగ వారితో నాడి గొప్ప గొప్ప మొహరాలను గూడ నోడించి యెత్తుల నడిగిన నిచ్చుచు నాడబడినది.

ఈ యవధానములన్నియు నే లోపము లేక సమాప్తి నొందిన పిదప సభనాదరించి వచ్చిన విద్వజ్జనులు (కొందరు) సంస్కృతాంధ్రములలో తమ తమ సంతోషముల దెలుపు నుపన్యాసములిచ్చిరి.[36]

---

36. ఈ పత్రికా ప్రకటనమును వ్రాసినది శ్రీ కుప్పచ్చి లక్ష్మయ్య. పెన్షండ్ ఓవర్ సీయరు.

తిరుపతి వేంకట కవుల యష్టావధానమునకు పృచ్ఛకులు తొమ్మిది మంది, వర్ణన వస్తువు, చెప్పవలసిన ఛందము, ఉపయోగించవలసిన భాష ఇవన్నియు పృచ్ఛకులు కోరినట్లే. మరియు వారా పద్యములందు వారి యిష్టము వచ్చిన అక్షరములను నిషేధింప వచ్చును. వాటిని విడిచియే పద్యమును చెప్పవల యును. వారిచ్చిన పదములను కూడ ఆ పద్యములలో నుపయోగింపవలెను. అనగా తొమ్మిది మందికి వర్ణనలు, నిషేధాక్షరులు, దత్తపదులు నిర్వహింప వలెను. ఈ విధముగా నివి ఇరువది యేడు పద్యాలగును. ఇవిగాక ఆకాశపురాణ మత్యాశుకధాకవిత. మిగిలినవి నాలుగు అంశములును కవితాశక్తికి సంబంధిం చినవి కావు. అవి పాండిత్యమునకు సభారంజకత్వమునకు సంబంధించినవి. కవితా విషయములు నాలుగింటిలో మూడింటిని తొమ్మిది మంది నెదుర్కొని చెప్పవలసి యుండుటయే గొప్ప. తిరుపతి కవులు దానినే కీర్తిపతాకగా తమ యష్టావధానములందు నిలుపుకొనిరి.

మిగిలిన యష్టావధానులు వర్ణన కొకనిని, నిషిద్ధాక్షరి కొకనిని, దత్తపది కొకరిని, సమస్య కొకనిని పెట్టుకొని ఆశుకవిత్వమును తప్పించుకొని, అప్ర స్తుత ప్రసంగము వారిని, వ్యస్తాక్షరి వారిని, లెక్కల వారిని, ఘంటా గణ నము వారిని అందరను పృచ్ఛకులుగా పరిగణించి నెట్టుకొని పోవుదురు.

తిరుపతి కవులు కొన్నిచోట్ల ద్విగుణితాష్టావధానమని[37] చతుర్గుణితా ష్టావధానమని[38] కూడ చేసి యున్నారు. నలుబది పద్యములతోను, నలుబది మూడు పద్యములతోను అయిన అవధానములను శతావధానములన్నప్పుడు[39] నలుబది మూడు పద్యముల దాని నింకొకచో చతుర్గుణితాష్టావధాన మనుటలో విశేష మేదియైన నుండవలయును గదా!

---

37. శతావధాన సారము. పూర్వార్ధము. 24.
38. ,, ,, ,, 26.
39. ,, ,, ఉత్తరార్ధము. 69, 139.

౬. శతావధానము

శతావధానమునకు పృచ్ఛకులు నూర్గురు. వారి ప్రశ్నముల కన్నింటికిని వారు కోరిన ఛందస్సులలో అవధాని పద్యములు చెప్పవలయును. ఏ ప్రశ్న మునకా ప్రశ్నగా సమాధానము చెప్పి ముగించుకొనుట కాదిక్కడ పద్ధతి. నూరు ప్రశ్నలకును ఒక్కొక్క పాదముగా సమాధాన పద్యములను మొదలు పెట్టవలెను. అనగా అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానములో నొక పాద మును మాత్రమే అవధాని చెప్పును. ఆ విధముగా వరుస క్రమమున నూరు ప్రశ్నలకును చెప్పును. తిరిగి మొదటికి వచ్చి క్రమముగా రెండవ పాదమును చెప్పుకొనుచు పోవును. మూడు నాలుగు పాదములను గూడ ఆ విధముగానే పూర్తి చేయవలయును. చిట్టచివరకు ఆ నూరు ప్రశ్నముల పద్యములను సరిగా అప్పజెప్పవలయును. తమ తమ ప్రశ్నలకు చెప్పబడిన ఆయా పాదములను పృచ్ఛకులు వ్రాసి పెట్టుకొని అవధాని ధారణా కౌశలములను పరీక్షించెదరు.

(1) పృచ్ఛకుల ప్రశ్నలన్నియును వారిచ్చిన వరుసలోనే అవధానికి జ్ఞాపకముండవలెను.

(2) ఏ పృచ్ఛకుడే ప్రశ్నము నిచ్చినదియు కూడ గుర్తుండవలెను. వారు స్థలములు మార్చి కూర్చున్నప్పుడు అవధాని ఇబ్బంది పడరాదు.

(3) అడిగిన ప్రశ్నకు వెంటనే స్ఫురించెడునట్టి సమాధానమును తుది దాక జ్ఞాపకముంచు కొనవలెను. లేనిచో తరువాతి పాదములు చెప్పుటకు తిరిగి వచ్చినప్పుడు మొదటి పాదములతో నన్వయించునట్లు పద్యమును కొనసాగించు టకు వీలుండదు. అందువలన మొదటి పాదము వద్దనే అవధాని తాను చెప్ప దలచుకొన్న యర్థమును నిశ్చయము చేసికొనవలయును. ఇట్లు నూరు ప్రశ్న ములకును సమాధాన స్వరూపమును నిశ్చయము చేసికొన్న తరువాత అనగా ప్రథమ పాదములను చెప్పిన తరువాత శతావధానికి సగము బరువుతీరును. ఇక మిగిలినది పద్యములను కొనసాగించుట. అవధానికున్న ఆశుధారయే ఆ పనిని చూచుకొనును. అప్పటి నుండియు అవధాని శక్తినంతయును ధారణకే ఉపయోగించును.

సందర్భ శుద్ధియైన ప్రజ్ఞ- అమోఘమైన ఆశుధార-అనాహతమైన ధారణ- ఈ త్రిపుటి ఎవనియందెంత పటువుగా నున్నదన్నదానిని బట్టి వాని శతావ

ధాన కౌశలముండును. "శతావధాన విధాన సమయమ్మునందున కవిహృదయము కుశాగ్రమునకన్న నిశితమై" యుండవలయునని శతావధాని శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారి యభిప్రాయము. తాదృశమైన జాగ్రత్తయే అవధానము.

శతావధానమును గురించి స్వానుభవము మీద తిరుపతి వేంకటకవులు చెప్పిన మాటలు మరియు గమనింపదగినవి.

తెలియ దదేమొకాని కడుతేలిక యౌనట; వందమంది కో
ర్కెలు మదినూని వారలు వరించిన వృత్తములన్ గ్రహించి వా
రలకొక పాదమున్నొడివి వ్రాసిన పిమ్మట తక్కుపాదముల్
కలయుగ జెప్పి పిమ్మట నఖండముగాగను సూఁపుపద్యముల్
బలువడి నప్పగించుపని; పల్కగవచ్చును గాని చేయుటల్
చులకనగాదు[40];.....

నిజముగా సంపూర్ణ శతావధానమును చేయుట చెప్పినంత సులభముకాదు. తిరుపతి వేంకట కవులతో పోటి చేసిన ఆనాటి అష్టకవులు చాలామంది తామును శతావధానులమనియే చెప్పుకొందురు. వారిలో సంపూర్ణ శతావధానములు చేసిన వారి సంఖ్య చాలతక్కువనియే చెప్పవలయును.

అష్టావధానముకాక ఆయాప్రశ్నలకు సమాధానపద్యములు ధాటిగా చెప్పి అందుకొన్నియైనను అప్పగించగలిగిన వారందరును శతావధానుల క్రిందనే లెక్క గట్టుకొనుట యైనది.

శతావధానులుగా ప్రసిద్ధులయిన కొప్పరపు సోదరకవులు, రామకృష్ణ కవులు, దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి, తమ్మన్నశాస్త్రి, శ్రీపాదకృష్ణమూర్తి, కాశీ కృష్ణాచార్యులు, పళ్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులు, పిశుపాటి చిదంబరశాస్త్రి, గాడేపల్లి వీరరాఘవశాస్త్రి, దోమా వెంకటస్వామి గుప్త, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలయిన వారందరునుకూడ చేసిన శతావధానములలో సంపూర్ణ శతావధానము లల్పసంఖ్యాకములే. రెండు మూడట్లు చేసి ఇకమిగిలిన చోట్ల ఏబదిమందికని, అరువదిమందికని చేసెడివారు. ఒకసారి శతావధానము చేసినచో నతడు శతావధానియే. అష్టావధానికూడ అంతే. శతావధానికి అష్టావధానము సులభము. సాధారణముగా ఎనిమిదంకెను దాటించి ఆశువు చేత చెప్పుకొని పోగలడు.

---

40. నానారాజ సందర్శనము. పూర్వార్ధము. 33.

ధారణ మరింత సులభము. కొప్పరపు కవులంతటివారు చేసిన శతావధానములే పదునొకండు[41]. అందులో సంపూర్ణ శతావధాననులు రెండు మూడు. గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు చేసిన శతావధానములిరువదియైదు[42]. ఇందు సంపూర్ణ శతావధానము లెన్నియున్నవో తెలియదు. వేలూరి శివరామశాస్త్రి గారు చేసిన శతావధానములు నాలుగు[43]. గుంటూరు కాలేజీ శతావధానము సంపూర్ణ శతావధానమే. మిగిలినవాటి విషయము తెలియదు. రెండు వందలకు మించిన అవధానములు చేసిన తిరుపతి కవులు సంపూర్ణ శతావధానము లెన్ని చేసినారనగా లెక్కపెట్టవలసినదే గదా[44].

1. శతావధాన ప్రశ్నలు :—

1. కాశీమాతను విద్యున్మాలా వృత్తమున స్తుతించునది. [అవధాని ఉభయ భాషాకవియైనప్పుడు పృచ్ఛకుడు భాషనుకూడ నిర్దేశింప వచ్చును.]
2. మీ గురువులను చంపక మాలావృత్తమున స్తుతించునది.
3. గురువుల యెదుట అవధానము చేయుటను గూర్చి మీకెట్లున్నది.
4. ఈ సభను ఉత్పలమాలలో వర్ణింపుడు.
5. ఈ సమస్యను పూరింపుడు. సమస్య.....
6. పిల్లలు నోట ప్రవేలు వేసికొని చీకుటను సీసమున వర్ణింపుడు.
7. నిర్యాతి ప్రాసకవిత్వమును గురించిన మీ యభిప్రాయమును మత్తేభ వృత్తమున చెప్పగలరు.
8. ఈ సమస్యను పూరింపుడు. సమస్య.....
9. ఈ సమస్యను పూరింపుడు. సమస్య.....
10. ఈ శ్లోకమును మత్తేభమున తెనుగుచేయుడు. శ్లోకము...
11. శోకచుక్కను సీసపద్యమున వర్ణింపుడు.
12. సత్కవిత్వమనగానేమో శార్దూల వృత్తమున చెప్పుడు.

---

41. కొప్పరపు సోదరకవుల చరిత్ర. 73.
42. చమత్కార కవిత్వము. 146-149.
43. గుంటూరు కాలేజీ శతావధానము. చివరిపేజీ.
44. తిరుపతి కవుల సాహిత్య సమీక్ష. 30.

13. కృష్ణరాయభారములో కర్ణ కృష్ణ సంభాషణమును ఉత్పలమాలా వృత్తమున చెప్పునది.
14. శ్రీ కృష్ణుని లయవిభాతి పద్యమున స్తుతించునది.
15. అలుకు గుడ్డను సీసపద్యమున వర్ణించునది.
16. విజయవిలాసము నందలి ఈ పద్యమునకు ప్రతిపద్యమును చంపక మాలగా చెప్పునది. పద్యము.....(1-112)
17. కవిరాజ విరాజిత వృత్తమున గండుజీమను వర్ణింపుడు.
18. నిజమైన కవుల కవితలను శార్దూలమున ప్రశంసించునది.
19. అచ్చతెనుగున ఉత్పలమాలలో లక్ష్మిని వర్ణించునది.
20. ఆంగ్ల విద్యార్థుల చిత్త ప్రవృత్తులను వర్ణింపుడు.
21. ఉత్పలమాలలో కుకవిత్వమును గూర్చి చెప్పుడు.
22. ఈ విషయమును మత్తేభమున కల్పన చేసి చెప్పుడు. విషయము...
23. ఈ తిరుపతి వేంకటేశ్వరులే ఆ తిరుపతి వేంకటేశ్వరులని శ్లేషాత్మక ముగా సీసపద్యమున వర్ణింపుడు.
24. ఈవిషయమును శార్దూలమున కల్పనచేసి చెప్పునది. విషయము...
25. గానము-కవిత్వము-వీటి ప్రయోజనమును కందమున వర్ణింపుడు.
26. ఈ పదములనుపయోగించి ఒక చంపక మాల చెప్పునది. పదములు.
27. మంచి సొగసుక త్తెనొకదానిని సీసమున వర్ణింపుడు.
28. మత్తకోకిలావృత్తమున శరదృతువును వర్ణింపుడు.
29. ఈ యవధానమున కవకాశము కల్పించిన వారిని గురించి ఉత్పల మాలావృత్తమున చెప్పునది.
30. ఈ సమస్యను పూరించునది. సమస్య.....
31. పంచచామరమున వేపకాయను వరించునది.
32. ఈ సమస్యను పూరించునది. సమస్య.....
33. రామరావణ సంవాదమును మహాప్రస్థర యందు చెప్పునది.
34. శార్దూల వృత్తమున వసంత ఋతువును వర్ణించునది.
35. శివవిష్ణు శ్లేషాత్మకముగా అనుష్టుప్పును చెప్పునది.
36. కవిత్వ ప్రయోజనమును చంపకమాలయందు చెప్పునది.
37. తెనాలిరామలింగని గూర్చి ఒక ఉత్పలమాల చెప్పునది.

38. జ్ఞప్తిహీనుని గురించి శిఖరిణీ వృత్తమున చెప్పుడు.
39. పటమునందున్న ఈ బాలుని వర్ణింపుము. పటము.....
40. లయగ్రాహి పద్యమున సూర్యోదయ పద్మములను వర్ణించునది.
41. ఈ సమస్యను పూరించునది. సమస్య.....
42. ఈ లోకోక్తినుపయోగించి గీతము చెప్పుడు. లోకోక్తి.....
43. చంపకమాలావృత్తమున కప్పను వర్ణించునది.
44. కైస్తవులను చూచి హిందువులు నేర్చుకొనవలసినది సీసమున చెప్పుడు.
45. ఆ యెదురుగానున్న గుడ్లగూబను గురించి సీసపద్యము చెప్పుడు.
46. శార్దూల వృత్తమున ఉచ్ఛిష్ట గణపతిని స్తుతింపుడు.
47. ఆకాశమును ఉత్పలమాలయందు వర్ణించునది.
48. చంద్రోదయమును మందాక్రాంతమున వర్ణించునది.
49. పరశురామ విజృంభణమును శిఖరిణీ వృత్తమున వర్ణించునది.
50. సీసపద్యమున గడ్డిపోచను వర్ణించునది.
51. కుగ్గరు దొరసానిగారి కీర్తిని సీసపద్యమున వర్ణింపుడు.
52. బెస్తవానిని సూర్యునితో పోల్చుచు కందపద్యము చెప్పుడు.
53. ప్రభాత కాలమున మానవుల చర్యలను సీసమున వర్ణింపుడు.
54. దోమను దోపుతెరను గురించి చంపకమాలలో చెప్పుడు.
55. శార్దూలవృత్తమున కలము పాశీని కీర్తించునది.
56. విరహిణీ హృదయమును అమావాస్యనాటి చంద్రునితో పోల్చుచు మందాక్రాంత వృత్తమును చెప్పునది.
57. ఈ లోకోక్తి వచ్చునట్లుగా చంపకమాల చెప్పుడు. లోకోక్తి...
58. రెల్లు పూవులోని నూగును స్రగ్ధరావృత్తమున వర్ణించునది.
59. తొమ్మిదేండ్లవాడు గజముండునా గజమున్నరయుండునా? ఇందుకు సమాధానము మత్తకోకిల యందు చెప్పుడు.
60. అవధానములలో అప్రస్తుత ప్రశంసకులనుగూర్చి కందము చెప్పుడు.
61. తాటిచెట్టునకును విష్ణునకును శ్లేషకల్పించి అచ్చ తెనుగున సీస పద్యమును చెప్పుడు.
62. శార్దూలము మనుష్యుని మీదపడవచ్చుటను శార్దూలమున వర్ణింపుడు.
63. ఈసమస్యను గీతమున పూరింపుడు. సమస్య ... ...

64. లయగ్రాహివృత్తమున చిఱుచాపను వర్ణింపుడు.
65. కందమున కందపద్యలక్షణమును చెప్పుడు.
66. ఈ సభాధ్యక్షులను సీసపద్యమున వర్ణింపుడు.
67. అచ్చతెనుగున సీసపద్యమున జన్మభూమిని గూర్చి చెప్పుడు.
68. హాలికుడైన గృహస్థుని శార్దూలమున వర్ణించునది.
69. బిందుపూర్వక తకారముతో వృత్త్యనుప్రాసమును కల్పించుచు ఉత్పలమాలావృత్తమున వసంతమును వర్ణించునది.
70. ఈ పద్యమును సంస్కృతమునకు ననువదింపుడు. పద్యము...
71. బిడాలోపాఖ్యానపుగాథను శార్దూలమున చెప్పుడు.
72. ఈ లోకోక్తి నుపయోగించుచు శార్దూల వృత్తమున దొంగను వర్ణించునది. లోకోక్తి... ...
73. ఈ సమస్యను గీతమున పూరింపుడు. సమస్య ... ...
74. చిల్ల పెంకును గురించి ఉత్పలమాల యందు వర్ణింపుడు.
75. అచ్చతెనుగున ఉత్పలమాలయందు గులాబిని వర్ణించునది.
76. స్కూలు ఫైనలు పరీక్షలనుద్దేశించి ఉత్పలమాలను చెప్పునది.
77. వితంతుల మహాసభను గీతపద్యమున వర్ణింపుడు.
78. గీతమున పెనిసిలును కీర్తింపుడు.
79. సంభావనలప్పుడు బ్రాహ్మణుల అధూయిత్యమును శార్దూల వృత్తమున వర్ణింపుడు.
80. భూమధ్యరేఖ దండెయని సూర్యచంద్రులు తక్కెడ బిళ్లలని శార్దూల పద్యమున వర్ణింపుడు.
81. ఊరికి నిప్పంటుకున్నప్పటి దృశ్యమును శార్దూలమున వర్ణింపుడు.
82. ఈ శ్లోకమును ఆంధ్రీకరింపుడు. శ్లోకము.....
83. సరస్సును సౌధముతో పోల్చుచు ఉత్పలమాలను చెప్పుడు.
84. పెండ్లిలో కావడిబద్దవిరిగిన నీళ్ళ బ్రాహ్మణుని పరిస్థితిని ఉత్పలమాలయందు వర్ణింపుడు.
85. దీపమును జ్ఞానముతో పోల్చుచు చంపకిమాలను చెప్పుడు.
86. వేటకు బోయెడు కిరాతులను గ్రామ్యభాషా పదములతో మత్తకోకిల యందు వర్ణించునది.
87. సూదిమొనమీద నొక సీసమును చెప్పుడు.

88. కాలిలో తుమ్ములు విరుగుటను కందమున చెప్పుడు.
89. పతివ్రతల పేర్లు పెట్టుకొనుచున్న వేశ్యలను గీతపద్యమున వర్ణించునది.
90. ఈ శ్లోకమును చంపకమాలగా నాంధ్రీకరింపుడు. శ్లోకము...
91. కోటు గుండీలను గురించి మత్తేభమును చెప్పుడు.
92. ద్విభార్యా యుక్తుని కష్టసుఖములను మత్తేభ వృత్తమున వర్ణింపుడు.
93. వర్షమును యుద్ధమును పోల్చుచు ఉత్పలమాలను చెప్పుడు.
94. శార్దూల విక్రీడితమున జ్ఞాన ప్రసూనాంబాదేవిని దేవభాషయందు స్తుతించునది.
95. పూర్వయుగ ధర్మములను ఉత్పలమాలయందు చెప్పుడు.
96. ఇప్పుడు మీగురించి మీగురువు లేమనుకొనుచుందురో ఉత్పలమాలా వృత్తమున చెప్పుడు.
97. ఈ పదములనుపయోగించి గీతపద్యమున సూర్యుని వర్ణింపుడు పదములు ... ...
98. సజ్జకంకి తిను కాకి వడిశల తాకి చచ్చుటను చంపకమాల యందు వర్ణించునది.
99. ఈసమస్యను ఇంద్రవజ్రా వృత్తమున పూరింపుడు. సమస్య...
100. మీ పరమ గురువులను సీసపద్యమున స్తుతించునది.

2. శతావధాన విధానము

ఈ శతావధాన ప్రశ్నలను చూచినచో శతావధాన విధాన లక్షణము కొంతవరకు తెలియ గలదు. ప్రత్యక్షముగా చూడవలసిన దానిని పరోక్షముగా తెలిసికొనుట కిది యొక మార్గము.

పృచ్ఛకులు అవధానిని అనేక విధములుగా నియమబద్ధుని గావించు చున్నారు. అడిగిన దాని కందముగా సమాధానము చెప్పునంతవరకే ఆయనకు స్వేచ్ఛ. మరే విషయమునను లేదు. వస్తువును, ఛందస్సును, భాషను, అలం కారమును - నాలుగింటిని పృచ్ఛకుడు స్వాధీనము చేసికొని మాటాడుచున్నాడు. కవితా సామ్రగి యంతయును పృచ్ఛకుని చేతిలో నున్నది. పృచ్ఛకులు కవులు కారు. ఒకవేళ అంతకు ముందైనను అప్పుడు కాకుండ పోవుదురు. కవి గాని

వాని చేతిలో కవితా సామగ్రిని పెట్టి వాని యిష్ట ప్రకారము చెప్పవలసి వచ్చుటచే అవధాన కవిత్వము మూడు వంతులు కవిత్వము కాకుండ పోవలసి వచ్చుచున్నది. చెప్పెడు వాడెప్పుడును లోకువయే కదా యని యడిగెడు వాని యుద్దేశ్యము. పృచ్ఛకులవధానినట్లే యడుగుదురు.

ముందు వారి చూపు ఛందస్సుమీద పడుచున్నది. విద్యున్మాల-శిఖరిణి-లయవిభాతి - కవిరాజ విరాజితము - పంచచామరము - మత్తకోకిల - మహాస్రగ్ధర - లయగ్రాహి - మందాక్రాంత - స్రగ్ధర - ఇంద్రవజ్ర - ఈ పదిపదునొకండు ఛందస్సులను సాధారణముగా తెలుగు భాషాకవులు వ్రాయరు. అందుకే వీటికి విశేష వృత్తములని కూడ పేరు. విశేష వృత్తములను నిదానముగా వ్రాయవచ్చును గాని ఆశువున కొదిగించుట అసాధ్యము కాదు కాని కష్టసాధ్యమనవలయును. ధారణకుకూడ అభ్యాసమైన ఛందస్సులొదిగినట్లుగా కానివి యొదగవు. అందువలన నీ విశేష వృత్తములు చెప్పుటకును, జ్ఞాపకము పెట్టు కొనుటకును కూడ అంతగా ననువైనవి కావు. కావు గనుకనే పృచ్ఛకులడుగుదురు. అవుననన్నట్లుగా అవధాని నెగ్గుకొని రావలయును.

విశేషమైన క్రొత్త ఛందస్సు కాకపోయినను సీసపద్యము కూడ ఇబ్బంది కలిగించునదియే. వృత్తమునకువలె గణ క్రమనియతి లేనందున పద్యమును చెప్పునప్పుడు కవి జాగ్రత్త పడనిచో అది ధారణకు నిలువదు. ఇక్కడ జాగ్రత్త యంతయును రచనా శిల్పము మీద నుండవలయును. గణములకు పదములను కూర్చుకొనుటగా - పాదాంతముల నొక సమతను సంపాదించుటగా - పాదమున నొక కొంతభాగమును తరువాతి పాదముల యందు పునరావృత్తము చేయుటగా - పదమధ్య యతిని పాటింపక పోవుటగా - ఇట్లనేక పద్ధతుల నవలంబించి పద్యమును ధారణ కనుకూలముగా అవధాని చెప్పుకొనవలయును.

అందరు పృచ్ఛకులును సమస్యలను సమకూర్చలేరు. సమస్యా పూరణమే కాదు - సమస్యా కల్పనము కూడ సమస్యయే. అందువలన అంతకు పూర్వము ప్రసిద్ధముగా నున్న సమస్యలనే యిచ్చి క్రొత్తగా పూరింపుమందురు. అవి యంతకు మునుపు మరెవరి చేతనో పూరింపబడి యుండును. ఆ పూరణమున కంటే ఈ యవధాని గారి పూరణము నందలి విశేషమేమని చూచెదరు. అవధాని యొక్క సద్యస్స్ఫూర్తికి ఈ సమస్యా పూరణ మొక నికషము. విరుద్ధ లక్షణ లక్షితములు - ఆర్థాంతర న్యాస వాక్యములు - దుష్కర

ప్రాస పాదములుగా సమస్యలు కల్పింపబడును. క్రమమును పాటించి, అన్వయమును మార్పు కూర్పులను లోనుజేసి, ముందు వెనుకలుగా అక్షరములను కూర్చి సమస్యలోని పద బంధములను విడిచి విషయమును సందర్భ పఱచి అవధాని వాటిని పూరింపవలయును. ఇందు మరొక చిత్రమేమనగా ఒక పద్య పాదము నిచ్చి దాని నాపద్యమును గాక మరొక పద్యముగా పూరింపవలయునను. ఏ పద్యపాద మే పద్యమునం దిముడునో అవధానికి తెలియ వలయును. అది గర్భ కవిత్వ తత్వము తెలియుట. ఈ విధముగా నున్న సమస్యాపూరణ మొక సమస్యయే కదా !

పృచ్ఛకులు భాషను కూడ నియమించెదరు. సంస్కృతములో చెప్పుము-అచ్చ తెనుగులో చెప్పుము - అని. ఆంధ్ర భాషా కవి యొక్క ఆశుధారకు సంస్కృత మొదిగి పోగలదు గాని అచ్చతెనుగొదుగదు. ఇక్కడ ధార కుంటు వడక తప్పదన్నంత గండమున్నది. దీనితోపాటు అలంకారమును, ఛందస్సును కూడ నియమించినచో అవధాని అటో ఇటో తేలిపోవలయును.

అలుకుగుడ్డ-వేపకాయ - పాళీ - చిటిదాప - చిల్లపెంకు - సూది మొన-తుమ్మముల్లు - గడ్డిపోచ - గండుచీమ - కోటుగుండి - ఈ మొదలయిన అల్ప విషయముల మీద పెద్ద పెద్ద పద్యములను చెప్పుమనుట - విశేష వృత్తములనుకోరుట - అవధాని యొక్క కల్పనాశక్తికి పెద్ద పరీక్ష.

తాటిచెట్టు - విష్ణువు; సరస్సు - సౌధము; యుద్ధము - వర్షము; పెన్న వాడు - సూర్యుడు; తిరుపతి వేంకటేశ్వరస్వామి - తిరుపతి వేంకట కవులు - ఈ మొదలయిన విరుద్ధ విషయములను సుసంబద్ధములుగాచేసి చెప్పుమనుట అవధాని ప్రజ్ఞాపాటవమును పరీక్షించుట.

ఫలానా కావ్యమునందలి ఫలానా పద్యమునకు ప్రతిగా పద్యమును చెప్పుమన్నప్పుడు, బిందుపూర్వకతకారముతో వృత్త్యనుప్రాసమును కల్పించుచు పద్యమును చెప్పుమన్నప్పుడు అవధాని యొక్క ప్రతిభా వ్యుత్పత్తులు రెండును "నీవా నేనా" అని మేల్కొనుటకు పరీక్ష.

సంస్కృత సమస్యలను పూరించుమనుట, సంస్కృత శ్లోకములను తెనుగు చేయుమనుట, తెలుగు పద్యములను సంస్కృతీకరింపుమనుట అవధాని

యొక్క సంస్కృత భాషా పాండిత్యమునకును అందలి కవితా శక్తికిని పరీక్షాస్థానము.

ఇక మిగిలిన వర్ణనాదికములన్నియును అవధానియొక్క ఆశు కల్పనలకు - చమత్కారములకు-పద్యరచనా పాటవమునకు లక్ష్యములుగా నుండును.

ఈ విధముగా పృచ్ఛకులు కవులైనను ముఖ్యముగా పండితులయిన పెక్కు భంగుల నవధానిని తప్పులతోవల బట్టించుటకు యత్నించెదరు. అవధాని కదియొక పరీక్ష కాగా నితరులకు వినోద ప్రాయముగా నుండును. విజయము అవధానికి ధన గౌరవములను సమకూర్చును. అపజయము అవమానాపహాస్యములకు కారణమగును.[45] ఈ విధానమున విజయ గౌరవములను పొందినది శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు.

6. సహస్రావధానము

ఈ ప్రక్రియను తిరుపతి వేంకట కవులు ప్రత్యేకము ప్రదర్శింపక పోయినను తామాపని చేయగలమని మాత్రము స్పష్టముగా ప్రకటించినారు.

ఒక నూఱేయన నేమి లెక్క వినుడోహో పండిత శ్రేష్ఠులా
ర ! కడున్ వేగమె వేయిమంది కయినన్ రమ్యస్థితుల్ మీఱ నా
శుకవిత్వంబొనరింప నేరుతుము శ్రీ శూలి ప్రియా మాననీ
య కటాక్షమ్మున తగ్గ కాలమును మాకర్పించి కూర్చున్నచోన్.[46]

వేయి మందికి వారి వారి ప్రశ్నలను పాటించి ఆశువుగా పద్యములు చెప్పుకొనిపోవుట మాత్రమే సహస్రావధానమునకు లక్షణమా ? ధారణ పని లేదా? ప్రక్రియ వేరైనందుల కిందిదే విశేషమా? కావచ్చును.

శ్రీ సత్యవోలు సోమసుందర కవి గారి ఈ క్రింది పద్యము తిరుపతి కవుల సహస్రావధాన సామర్థ్యము సుపలక్షించుచున్నట్లే యున్నది.

---

45. గుంటూరు కాలేజీ శతావధానము. అవధానములు. xxxiii.
46. తిరుపతి కవుల సాహిత్య సమీక్ష. 34.

వితతప్రజ్ఞ శతావధానతయు నేవేళన్ సహస్రావధా
నతయున్ గల్గిన వీరిచిత్తమునకే నాళీకనామంబు లౌ
శతపత్రంబు సహస్రపత్ర మనుటల్ సందర్భ మౌగాక స
మ్మతమా ! యెల్లెడమానసాబ్జమసు సామాన్యోక్తి చర్చింపగన్. 47

శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు పంచ సహస్రావధానులుగా ప్రసిద్ధి నొందినారు గదా: మరి దానిమాట యేమి: శతమునకే తల ప్రాణము తోకకు వచ్చుచున్నప్పుడు సహస్రములు పంచ, సహస్రములు అనుటయే గాని అడిగెడు వాడెవడు: అందువలన ధారణ పట్టుటతో నిమిత్తము లేని ఆశుపద్య రచన వందను దాటి నప్పటి నుండియు సహస్రావధానము క్రిందనే చలామణి యగుచున్నదని యర్థము. అర్థము నిజమేకావచ్చును గాని సహస్రావధానులన్న బిరుదు మోసిన వారింకొకరు కనిపించుట లేదు. ఆ ఫక్కీని కని పెట్టిన దీయనయే అనియు నందురు.48

అవసరము పడి అన్నియు కలిసివచ్చి అయినదని యనిపించవలసి వచ్చి నచో సహస్రావధానము కూడ ఒక అవధాన ప్రక్రియా విశేషమే యగును.

శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు అయిదు వేల కార్డుల మీద ఏవో రక రకముల బొమ్మ లంటించి దగ్గరనుంచుకొనెడివారు. పృచ్ఛకులంత మంది యుండరు గనుక ఉన్న వారికి వారా కార్డుల నిచ్చి అందు మీ యిష్టము వచ్చిన కార్డును దీసి - దాని క్రమ సంఖ్యను చెప్పుడని యడిగి - ఆ సంఖ్యను విని, ఆ సంఖ్య :గల కార్డు మీది బొమ్మను గాని వ్రాసిపెట్టియున్న విషయమును గాని గుర్తుకు తెచ్చుకొని దానిమీద పద్యము చెప్పుదురు. అయిదువేల విషయములను గుర్తుపెట్టుకొనుటయే అందలి విశేషము. అదే పంచసహస్రావధానము. తీసిన కార్డులు అడిగిన ప్రశ్నలు ఎన్ని యున్నను అవి అయిదువేలలో నుండి తీయబడినవే కనుక దానికి పంచసహస్రావధానమనియే పేరు. ఉన్న మనుష్యులను బట్టి తీయబడిన కార్డుల సంఖ్యయుండును. ఒకచోట యేబది మరొక చోట వంద- ఇంకొక చోట నూటయేబది - ఈ విధముగా నుండును. శ్రీసుబ్రహ్మణ్య శాస్త్రి గారు మంచి సరసమైన ఆశుధారా రచనా శక్తి కలవారు. అందు

---

47. శతావధాన సారము. అనుబంధము 161.

48. నవ్యాంధ్ర సాహిత్య వీధులు. ప్రథమభాగము 33.

వలన వారి యవధానములు సదస్యులను మిక్కిలిగా నలరించు లక్షణములు కలిగియున్నవి.

అర్వాచీనులు - అవధానములు

నవ్యకవితా రచనమొక ఉద్యమముగా ప్రారంభ మైనప్పటి నుండియే అవధానములు ఆశుకవితా ప్రదర్శనములు కొంత వెనుక బట్టినవి. ఆశుకవితా సన్యాసమును స్వీకరించియేకదో రాయప్రోలువారు నవ్యకవితా పీఠాధిపతు లయినది! జాతీయోద్యమ తీవ్రప్రభావము వలన కూడ గారడీరచనలు వెనుక బడినవి. ప్రాచీన పద్ధ్యనుసరించి కావ్యములు ప్రాసెడు వారుకూడ ఆశుకవితా వధానములనాదరింపలేదు. భావకవులు-అభ్యుదయకవులు మొదలయిన అత్యం తాధునికులకు ప్రాచీన విషయములెట్లును రుచింపలేదు గనుక వారును ఆశుకవి తావధానములను పట్టించు కొనలేదు.

మరియు భారతదేశమునకు స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కవిపండి తులను వార్షికములిచ్చి పోషించుటను గౌరవముగా భావించుకొనెడు చరిత్ర గలిగిన సంస్థానములయునికి బాగదెబ్బతిన్నది గనుకను కవిత్వమును పాండిత్య మును నమ్ముకొని సంసారములు గడుపుకొన వచ్చునన్న నమ్మకము పోయి విద్వాంసులకును వాటియందంతకుమునుపుండెడి ఆదరము నశించినది. మరియు నీకాలమున కవిపండితులలో వెనుకటి జిగీషామనీష క్రమముగా క్షీణించి పోయినది. దానిస్థానమున అన్యోన్య స్నేహదృష్టి-పరస్పర సహకారదృష్టి-మొదలయిన సల్లక్షణము లెక్కువైనవి. కవితాశక్తి ఈకాలమున రాజసముకాక-సాత్వికమైనది. అందువలనను ఆశుకవితావధానముల ప్రదర్శనము లల్పాల్పములు గానే యున్నవి.

ఇప్పుడు జరిగెడు ఆశుకవితలు-అవధానములు కర్తలకును కారయితలకును తాత్కాలిక ప్రయోజనామోదముద్రాముద్రితములుగా నున్నవి. ఇప్పటి అవధానములన్నియు అష్టావధానములే. శతావధానములకు శక్తిలేదు. ఓపికయును లేదు. ప్పచ్చకులు లభించుటయు కష్టముగానేయున్నది. అయినను కొందరు సలక్షణముగా అవధానములను చేయుచున్నారు. బ్రహ్మశ్రీ దివాకర్ల వేంకటావ ధాని-సుబ్బన్న శతావధాని-ప్రసాదరాయకులపతి-పేరాల భరతశర్మ - కోట

వీరాంజనేయ శర్మ మొదలయిన వారినింకను పేర్కొనవచ్చును. ఈ అవధాన ప్రదర్శనములకు భవిష్యత్తింకను కలదనుటకు వచనకవితలు వ్రాయువారు వెనుకకు తిరిగి వచ్చి చక్కని అవధానకవిత్వము నలవాటు చేసికొనుచున్నారను టయే నిదర్శనము. ఇక్కడ శ్రీమాన్ కోవెల సుప్రసన్నాచార్యులవారి పేరు చెప్పవలయును.

ఈ పైన పేర్కొన బడినవారి అవధాన ప్రదర్శనములు తద్విద్యా వైదుష్యము కలిగి పండిత పామర సహృదయ జనమనోరంజకములై బహు కార్య సాధకములుగా నున్నవి. ఇదొకమంచి శుభసూచన.

4. చాటు కవితలు

1. స్వరూప నిరూపణము

ఆశు కవిత్వమ:లోనే చాటుపద్యము లొకరకముకావచ్చును. ఇవన్నియు కాకపోయినను కొన్నియైనను ముక్తకలక్షణ లక్షితములు. ముక్తకమనగా ఏపద్యమున కాపద్యమే. దానికి మరొకదానితో సంబంధముండదు. అందువలన ప్రతిముక్తక పద్యమునకును ముందువెనుకలను మనమే సమకూర్చు కొనవల యును. చాటుపద్యములన్నింటినీదృశముగా కథలు సమకూర్చ బడియుండును. ఆయావిషయములు తెలిసినప్పుడే చాటువులర్థములై అందలి చమత్కారము లా స్వాదయోగ్యములగును.

చాటువులనగానేమి? ఆవిషయము తరువాత. చాటుపద్యములు ముఖ్యముగా "కవుల వివాదములు-రాజుల చరిత్రములు-మంత్రుల తంత్రములు-వీరగాథలు-శృంగారఘట్టములు-హాస్య ప్రసంగములు-దాతృ ప్రశంసలు-లోభి నిరసనములు మున్నగు విషయములకు సంబంధించి" యున్నవి. మరియు "చాటువులు ఆనాటి ప్రభువులకు ప్రజలకును గల కవితా రసజ్ఞతను, రసిక తతోడి త్యాగమును, అప్పటికవుల ఆశుకవితా ప్రాగల్భ్యమును వెల్లడించుచు, ఆ కాలపు దేశపరిస్థితులకును, సాంఘికాచార వ్యవహారములకును తార్కాణ ములుగానున్నవి." ఈ విధముగా చూచినచో గతకాలము విశేషములను గర్భముల యందిముడ్చుకొని మనకు ప్రదర్శించి మన విజ్ఞాన వైభవమునింకను పెంపొందింప నిలిచిన పెన్నిధులని చాటువులను చెప్పవలయును.

వినువారి హృదయములకు చమత్కారము నొదవించి ఉల్లాసమును కలిగించు మాటలను చాటువులందురనియు, అవి గద్య పద్యములుగా నుండు ననియు కొందరు భావించు చున్నారు. సంస్కృతాంధ్ర భాషల యందు రెండింటను చాటువులన్నవి ఛందో బద్ధములుగానే ఉన్నవి[1] గాని గద్యములుగా లేవు. "చాటుపద్యమణి మంజరి" ద్వితీయ భాగమున రాజప్రశంసా స్తుబకము

---

1. విజ్ఞాన సర్వస్వము. అరవసంపుటము. 667.

నందు బిరుదావళులు అనుశీర్షికను కొన్ని గద్యరచనలున్నవి. అవి ఆయా రాజుల విజయ ప్రశస్తులు. ఆ ప్రశస్తులను వినుపించుటకు ఆస్థానమున నుద్యోగులుండెడి వారు. అవి చాటు రచనలుకావు. బిరుదు గద్యలను ఆస్థాన విద్వాంసులు జాగ్రత్తగా కూర్చెదరు. ఒక విధముగానవి సుప్రభాత ముల వంటివి.

చాటువులనగా నిట్లున్నవిగనుక మనమిట్లను కొనుచున్నాముగాని మన ప్రాచీనుల దృష్టి మరొక విధముగానున్నట్లు కనిపించుచున్నది. "చాటు కవిత్వ తత్త్వరస సాగర పారగులయ్యు సత్కవుల్ పాటిగఁబట్టి విందు రొకపాటివి కావన కన్యకావ్యముల్[2]" ఈ రామకృష్ణని పద్యమునందలి చాటుకవిత్వమున. కింపైన కవిత్వమని యర్థము వ్రాయబడియున్నది. మరియు పింగళి సూరన్న తననిగురించి "చాటుప్రబంధ రచనా పాటవ కవితుడ"[3] ననిచెప్పుకొన్న దానికి సంఖ్యాకాసంఖ్యాకాది భేద ప్రశస్తకృతుల యొక్కరచనా నైపుణ్యము కలవాడని యర్థము వ్రాయబడియున్నది. మరియును తంజావూరు రఘునాథ నాయకుడు రచించిన జానకీకల్యాణము చాటుకావ్యమని ఆయన కొడుకు చెప్పినాడు. చాటుకావ్యమనగా నదియెట్లుండునో తెలియదు. యక్షగానమే[4] అయియుండునని మాత్రమనుకొనుట యెట్లు.

కావ్య ప్రక్రియా భేదములయిన ముక్తకాదులను చాటు ప్రబంధములుగా లాక్షణికులు భావించుచున్నారు.[5] ముక్తకము - ద్వికము - త్రికము - పంచ రత్నములు - గజమాల - నవరత్నమాలిక - నలినమిత్రమాలిక - ఇందు కళ - నక్షత్రమాల - త్రిశంతి - పంచశతి - శతకము — అష్టోత్తర శతకము — ఇవ న్నియు వరుసగా ఒకటి-రెండు-మూడు-ఐదు-ఎనిమిది-తొమ్మిది-పన్నెండు-పదునారు — ఇరువదియేడు - ముప్పది-ఏబది-నూరు - నూట యెనిమిది పద్యములుగా నిబద్ధములయిన ముక్తకాదులు. ఈదృశమైన పద్యసంఖ్యానియమము కవియొక్క ఇష్టమును బట్టి యెంతయైన కావచ్చును. పెద్దనకువలెనే అనంతు

---

2. పాండురంగ మాహాత్మ్యము. 1-13.
3. రాఘవపాండవీయము. 1-12
4. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము. పుట. 35.
5. కావ్యాలంకార చూడామణి. 4-8, 9, 10

డును చెప్పెను.[6] అంతర్నిహితములయిన గుణములనేవో ఉన్నవానిని పట్టుకొని భేదమును నిరూపింపవలయును గాని, పద్యసంఖ్యను బట్టి కావ్య భేదములను పేర్కొనుటలో సామంజస్యము కనిపించుటలేదు. అదియును గాక ఈ యన్నింటిని కలిపి చాటు ప్రబంధములన్న పేరు పెట్టుటలో ఏమి సార్థక్యమున్నదియు సమస్యగానే యున్నది. వీటితోపాటు ఉదాహరణాది భేదములు పెక్కు విధములుగా చాటు కృతులుగా నున్నవి. వీటికొకవిధమైన పరిష్కారము అప్పకవీయమునందు చేయబడినది. అదియు కొసదాక నిలువదు.

అప్పకవి కావ్య భేదములను ప్రబంధ, చాటుప్రబంధములని రెండుగా మాత్రమే చెప్పినాడు. ఇరువది రెండు వర్ణనములతో నున్నది ప్రబంధమన్న తరువాత చాటు ప్రబంధమును గూర్చి ఈ విధముగా వ్రాసిపెట్టినాడు.[7]

కినుగొన సంఖ్యాబద్ధం
బు నసంఖ్యాకంబు నాగ భువి నిరుదెఱగై
తనరారు పూర్వకవి మత
మున నా చాటు ప్రబంధములు జలజాక్షా.
నాల్గు దెగల యుదాహరణములు ముక్త
కాది పంచదశమును సంఖ్యాన్వితములు
గద్య రగడ ద్విపద దండకములు మంజ
రులును సంఖ్యారహిత చాటువులు నృసింహా.

ఈ పద్ధతిని విచారించినచో గద్యాలు - ద్విపద గ్రంథములు - మంజరీ ద్విపదలు - శతకాలు - ఉదాహరణములు మొదలయిన వన్నియును చాటువులనియే చెప్పవలయును.

ప్రాచీనుల నట్లుంచినను ఆధునిక ప్రయోగములందును చాటు శబ్దము విలక్షణముగానే యున్నది. సీతాదేవి మనస్సును తన కనుకూలము గాను, అభిముఖము గాను త్రిప్పుకొను ప్రయత్నమున విలాసముగా నిలుచుండి లాలనయంతయు తన యుచ్చారణ యందును ముఖాంచలములందు దీపింప మధుర వాక్యములుగా రావణుడు పలికిన పలుకు లన్నియు వాని భార్యలకు "వట్టిచాటు

---

6. ఛందో దర్పణము. 3-62.
7. అప్ప కవీయము. ప్రథమాశ్వాసము 27-30.

వులుగా భాసించుచున్న" వని చెప్పబడినది.[8] ఇక్కడ చాటువులనగా నేమన వలయును: నాలుక కొసతీపి మాటలనవలయును.వట్టి ఇచ్చకాలనవలయును.[9]

మరొక ప్రయోగము. "సరసకవిత్వ సంపదకు చాటువు చేరిచి మించి యెవ్వడా, గురువులు మువ్వురం దనిపె కోవిదుడా శివరాము నెన్నెదన్."[10]

మరొకటి ఘటికాశతాధిక పద్యహృద్యచోద్య రచనా విశారదుడు. కవన చతుష్క ప్రవీణుడు అయిన పోకూరి కాశీపతి గారి ప్రయోగము-"కమ నీయంబుగఁ జాటువుల్ శతకముల్ గాన ప్రబంధములీ వమలంబైన నిరోష్ఠ్య నిర్వచన శుద్ధాంధ్ర[11] ..." చాటువులు శతకములు గాన ప్రబంధములు - అను నవి భిన్న భిన్నములయిన సాహిత్య ప్రక్రియలని ఇక్కడ చెప్పుకొననే వల యును.

మరియు చాటుపద్యములనగా stray verses-a current epigram -a stanza-a song or ballad-small poetry-fugitive versesa-couplets-a quatrain, a fancy-a short composition. అని బ్రౌణ్య తెలుగు నిఘంటువునందు నాలుగైదు కోణములనుండి అర్థము వ్రాయబడియున్నది.

ఇట్లు చాటు శబ్దార్థములు భిన్న భిన్నములుగా నున్నవి. అందువలన చాటుకవిత యనగా ఫలానా అని నిశ్చయముగా ననుటకు వీలుకనుపించుటలేదు.

మనము చాటువు లనుకొనుచున్న వానికి బ్రౌను పండితుని లక్షణము కొంత సమీపముగా నున్నదనవచ్చును. లాక్షణికదృష్టిని విడిచి చాటుశబ్దమును దాని రూఢ్యర్థమున గ్రహించుకొని అర్థము చెప్పు కొనవలయును. అప్పుడు

---

8. శ్రీమద్రామాయణ కల్ప వృక్షము సుందర కాండము. 103.
9. Pleasing or graceful words. *Monier Williams.* Agreeable, Sweet or coaxing speech. Flattery (Especially of a lover to his sweet heart) V. S. Apte: Witty, Pleasant, Jocular. Rambling task. C. P. *BROWN.*
10. శ్రీ కంభంపాటి విశ్వనాధము. గుంటూరు కాలేజీ శతావధానము. 47. కవిత్వ సంపదకు చాటువును చేర్చుట యనగా నేమనవలయును?
11. సారంగధరీయము. అవతారిక. 20.

చాటు పద్యములీక్రింది లక్షణములన్నింటితో గాక పోయినను కొన్నింటితో నైన నుండును. 1. ఆశు రచనలై యుండుట. 2. దూషణ భూషణ రూప మున నుండుట. 3. సమస్యా పూరణరూపమున నుండుట. 4. ముక్తక లక్షణ లక్షితములై యుండుట. 5. చమత్కార ప్రయోజనము కలిగియుండుట. 6. పొడుపు కథలుగా నుండుట. 7. వర్ణనగా నుండుట. 8. ప్రైనందిన కష్ట సుఖములతోడి దినచర్యా రచనలట్లుండుట. 9. పేరడీ రచనలుగా నుండుట. 10. గాథలుగానుండుట. మరియు నిట్లు పైన చూపబడిన వివిధములుగానున్న అర్ధచ్ఛాయలను గూడ అవసరమును బట్టి సంగ్రహించుకొనవచ్చును.

చాటువుల యందు సాధారణముగా కావ్య వస్తులక్షణములేని కవుల యొక్క రాగద్వేష విషయములే విషయములుగా నుండును. కొందరయందివి శాపానుగ్రహ రూపమునను ప్రత్యక్ష మగుచుండును. మిక్కిలిగా శృంగారాత్మకముగాను, రాజ పురుష స్తోత్రాత్మకముగాను, హాస్యచమత్కారాత్మకముగాను చాటువుండును. అందు విషయ మిదేయుండవలయునని యేమున్నది? ఏదైన నుండవచ్చును. ఎట్లైనను నుండవచ్చును.

సాంఘిక రాజకీయ చారిత్రకములును వ్యక్తిగతములును అయిన బహ్వంశములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకు నీ చాటువులెంత గానో తోడ్పడునన్న యభిప్రాయమున్నది.[13] అది నిజమే కావచ్చునుగాని ఆ సమస్యలను ఈ చాటువులు మరియు జటిలములుగా కూడ చేయుచున్నవి. కందుకూరి రుద్రకవి రాయల వారి ఆస్థానమున అష్టదిగ్గజకవులలో నొకడవునా కాదా యనుప్రశ్నమును చాటువులు పరిష్కరింప లేదు. వేములవాడ భీమకవి కాలమును నిశ్చయించుటకాయన చాటువులే ఆధారతగులుచున్నవి. అనగా చారిత్రక సత్యములు చాటువులు కలిసిపోనప్పుడు సమస్య మరింత క్లిష్టమగును. చాటువులు చారిత్రక దృష్టితో చెప్పబడవలయునని లేదుగదా. అందువలన చాటు వులను అన్య ప్రయోజనములను సిద్ధింప జేయదలచుకొని ఉపయోగింప బోవు నప్పుడు మరింత జాగ్రత్తగా నుండవలయును.

---

13. ఒక చాటు సీసమాలిక. శ్రీ పుల్లంపల్లి సోమశేఖర శర్మగారి వ్యాసము. భారతి. సెప్టెంబరు-1951. గోగులపాటి కూర్మనాథకవి సింహాద్రినారసింహ శతకము వంటిదే ఈ సీసమాలిక. "వేయుపొజుల సంహారి! వేల్పునూరి, శ్రీ మహాకాళి! శాత్రవచ్ఛేద కేళి" ఇది మకుటముకావచ్చును.

2. చాటువులన్నియు ఆశువులు కావు

చాటుపద్య మణిమంజరి చాటుపద్య రత్నాకరము మొదలయిన సంకలన గ్రంథములను నిదానముగా పరిశీలించినచో చాటుపద్యములన్నియు ఆశు పద్యము లని చెప్పుటకు వీలులేదు. ఒకవేళ నిజముగానవి ఆశువుగానే చెప్పబడినను దేశకాలములు మారిపోయినందున అందుకు బుజువు లిప్పుడు మనకు చిక్కవు. ఇందువలన చాటువులలో ఆశుకవితలు లేవని చెప్పుటకాదు. ఉన్నవనిచెప్పుటకు అంతఃకరణమును చూచుకొనవలయునేకాని బాహ్య ప్రమాణముల కొరకు చూచి ప్రయోజనములేదు.

సత్యవోలు భగవత్కవి దశావతార స్తవముగా రచించిన గునుగు సీసములు - జిగిబిగియును రుచియును గల 'షట్చక్రవర్తుల' పద్యములు- సాళువగుండ నరసింహరాయుల వారిపేర రచింపబడిన నవరత్న పద్యములు సప్తాంగ పద్ధతి పద్యము - మైసూరి చిక్క దేవరాయల వారి మీది పద్యములు - కందుకూరి జనార్దనాష్టకము - భృంగ పంచకము ఇత్యాదులు[14] ఆశు కవిత లగుట కవకాశము లేదు. తెలుగు పద్యములై యుండి కురవి రామకవిచేత సంస్కృతమున వ్యాఖ్యానము వ్రాయించుకొన్న ఉపదశావతారస్తుతి ఆశురచన కవకాశమిచ్చెడిదేనా? మరియును చూడవచ్చును.

"వటమూల మంచిరా" యను మకుటముతో నారు పద్యములున్నవి. "రామా! ఆర్త రక్షామణీ!" యను మకుటముతో నాలుగు పద్యములున్నవి. "అంబికా!" యను మకుటముతో నేడు పద్యములున్నవి. "దాక్షా రామ భీమేశ్వరా" - "గౌరీ మనోవల్లభా" - "శివదేవ ధీమణీ"- అను మకుటముతో నొక్కొక్క పద్యమును, "కార్తవీర్యార్జునా" యను మకుటముతో పదమూడు పద్యములును, "ఆర్తజన రక్షణోపాయ ఆంజనేయ" అను మకుటముతో నేడు పద్యములును, "నీలకంఠేశ్వరా" యను మకుటముతో పద్యములును కలవు. ఇవన్నియు చాటువులుగా గ్రంథముల కెక్కి యున్నవి.[15] కాని పరమార్థ మాలోచించినచో ఇవన్నియు నష్టములై పోయిన శతకములనియే తోచుచున్నవి. ఆ కృతులందలి అక్కడక్కడి పద్యము లానోట ఆనోట బడి కాలము మీద నెట్టు

---

14. చాటుపద్య రత్నాకరము.
15. చాటుపద్య మణిమంజరి . ద్వితీయ భాగము.

కొని వచ్చినవి. కర్తల పేర్లు కాలగర్భములో కలిసి పోయినవి. ఈ పద్యముల వల్లనే కొందరు కవుల పేర్లు నిలబడినవి కూడ. శతకములు నిదానముగా వ్రాయబడునవియే కాని ఆశువులు కావు. శతకములన్నియు ఆశువులుగానే వ్రాయబడునన్న నియమ లక్షణము లేదు.

చాటువులుగా చలామణి యగుచున్న వానిలో దూరాన్వయాదులతోడి శ్లేషార్థములు, రహస్యార్థములు, క్లిష్టార్థములు గల పద్యములు కూడ ఉన్నవి. అందు కొన్నింటికి పూర్వులెవరో వ్రాసిన వ్యాఖ్యానములు గూడ చాటు గ్రంథములలోని కెక్కి యున్నవి. ఇటువంటివి ఆశురచనలని చెప్పుటకు వీలులేదు. యుక్తి లెక్కలను చెప్పు పద్యముల నాశువులని భావించుట కూడదు.

వండిన దెండిన దొక్కటి
ఖండించిన పచ్చిదొకటి కాలిన దొకటై
తిండికి రుచియై యుండును
ఖండితముగ దీని దెల్పు కవియుం గలడే?[16]

వక్కను - తమలపాకును - సున్నమును మనస్సున పెట్టుకొన్న కవి విషయ గోపనముచేసి చెప్పదలచినవాడు నిదానముగా నాలోచించి ఆ పద్యమును వ్రాసియుండును గాని ఆశువుగా చెప్పియుండడు. అనగా చాటువులలో ఆశువులు కానివి కూడ చేరి యున్నవని యర్థము.

గ్రంథములుగా లభించుటలేదు గనుకను, కవులెవరో కూడ తెలియవచ్చుట లేదు గనుకను, లభించినపద్యముల యందొక ఆనుపూర్వి లక్షణము లేదుగనుకను, స్తుతులుగానో నిందలుగానో ఉన్నవిగనుకను-ఆయా పద్యములు చాటువులుగా చెలామణి యగుచున్నవి. అంతేగాని అవి ఆశురచన లయిసందున చాటువులని చెప్పుటకు వీలులేదు.

అట్లయినచో చాటువు లసలు ఆశువులు కాదనియే చెప్పవచ్చును కదా? చెప్పవచ్చునుగాని చెప్పకూడదు. వేములవాడ భీమకవి-శ్రీనాథుడు తెనాలి రామకృష్ణకవి-రామభద్రాంబ-రంగాజమ్మ - కూచిమంచి తిమ్మకవి మొదలయిన ప్రసిద్ధాంధ్ర భాషాకవు లాయాసందర్భముల యందాశుధారా ప్రవాహముగా

---

16. చాటుపద్య రత్నాకరము. పుట 253.

నాయా పద్యములు చెప్పినట్లు స్పష్టముగా తెలియ వచ్చుచున్నప్పుడు-అవిచాటు పద్యములని మన మనుకొనుచున్నప్పుడు చాటువులనుండి ఆశులక్షణమును తొల గించుట యెట్లు? చాటుపద్య సంకలన గ్రంథములు కలగాపులగముగా నుండక తప్పదు. అది వేరు విషయము.

3. చాటువులకు కర్తృత్వ మొక సమస్య

కొన్ని చాటువులు అవి నిజముగా ఎవరు ఎవరిని గురించి చెప్పినవో తెలియవచ్చుట లేదు. మరియు ఈ విధముగా పద్యములు, సన్నివేశములు కొద్ది పాటి మార్పులుండియు లేకయు అనేక మందికి సంబంధించి ప్రచారములో నున్నవి.

ఉప దశావతార స్తుతి పద్యములన్న శీర్షికను తెనాలి రామకృష్ణ కవి కృతములుగా చాటుపద్య రత్నాకరమునందున్న (పుట 27) పదునొకండు పద్యములును ఎలకూచి బాల సరస్వతీ మహోపాధ్యాయుడు రచించినట్లుగా చాటుపద్య మణిమంజరి ప్రథమభాగమున (పుట 13) నున్నవి.

తేజము సాధు వృత్తమును తేకువ గల్గిన ధీరుడెప్పుడున్
ఆజికి నిట్లనున్ పరునియాలికి నిట్లను నర్థికిట్లనున్
తేజము సాధు వృత్తమును తేకువ లేని బికారి యెప్పుడున్
ఆజికి నిట్లనున్ పరుని యాలికి నిట్లను నర్థికిట్లనున్.

ఈ పద్యము తెనాలి రామకృష్ణుని దనియు – ఈ పద్యమునకు నర్థము చెప్పమని యడిగి ఎవరినో ఒక విద్వత్కవిని ఓడించుటకు దీనిని రామ కృష్ణుడు ప్రయోగించినాడనియు చాటుపద్య రత్నాకరము (పుట. 25) నండు న్నది. మహాదాతయైన రాయని భాస్కరుని గూర్చి చెప్పబడియున్న చాటువు లనేకములలో నొకటిగా కొద్దిపాటి మార్పులతో ఆ పద్య మీవిధముగా చాటుపద్య మణిమంజరి ప్రథమ భాగము (పుట 85) నందున్నది.

రాజిత కీర్తిశాలియగు రాయని భాస్కరు వేడబోవగా
నాజికినిట్లనున్ పరుని యాలికి నిట్లను నర్థికిట్లనున్
తేజము పెంపులేని యతిదీనుని హీనుని వేడబోవగా
నాజికి నిట్లనున్ పరుని యాలికి నిట్లను నర్థికిట్లనున్.

ఇక్కడ దీనికి కర్త ఫలానా అనిలేదు.

సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగ జనపాలునకే
యుర్వీం జెల్లును దక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే.

శ్రీనాథుడు సర్వజ్ఞసింగ భూపాలుని యాస్థానమునకు పోయి ఆ ప్రభువు నట్లు కీర్తించినట్లును తిరిగి రెడ్డిప్రభువుల యాస్థానమునకు కొండపీడురాగా వారు తమ శత్రువు నాతడట్లు స్తోత్రము చేసినందుకు కుపితులైనట్లుండ - అంతట శ్రీనాథు డాపద్యమునందు సర్వజ్ఞ సింగ భూపాలుని వెక్కిరించుటయే యున్నది కాని స్తుతి లేదని అన్వయము చెప్పి రెడ్డి ప్రభులను సంతోష పెట్టినట్లును ప్రసిద్ధముగా కలదు.[17] సరిగా ఇటువంటి కథయే సక్కలపాటి సంజీవరాయనిగురించి కూడ కలదు. "మల్లె అనంత భూపాలున కీయన ఆశ్రితుడు. మల్లె వెంకట రామరాజు గారికిని వేమల వేంకటరామరాజుగారికిని బద్ధ వైరము. సంజీవరాయ కవి వేమల వారికడకు పోయి

స్వామి ! వినుమల్లె వేంక
ట్రామక్ష్మాజాని నీదు రణజయభేరీ
ధ్వామ ధ్వని వెనుజరగడె ?
వేమల చిన బసవరాయ వేంకట నృపతీ.

అని పద్యమును చెప్పగా, అతడు తన విరోధిని తగ్గించి, అతని యాస్థాన కవి తన్నగ్గించినందుకు మిక్కిలి సంతోషించి కవిని గొప్పగా సత్కరించి పంపెను. ఆ కథ విని మల్లెవారు "ఏమయ్యా మా విరోధిని పొగడి వాని కడ మమ్ము నిరసించితివా" అని యడుగగా, కవి "లేదు ప్రభూ! నేనట్లు చేయుదునా? —" మల్లె వేంకట్రామక్ష్మాజాని! నీదు రణ జయభేరీ ధ్వామ ధ్వనిన్ (ధ్వనిచేత) వేమల... వేంకట నృపతి వెనుజరగడెా అని ఆ పద్యమునకర్థము. అతడీ యర్థమును గుర్తింపలేక తన్ను పొగడినట్లనుకొన్నాడు" అని చెప్పగా మల్లె వారు హర్షించి కవిని బహూకరించిరట.[18]

---

17. శృంగార శ్రీనాథము. పుట. 213.
18. చాటుపద్య రత్నాకరము. పుట. 54.

అడిదము సూరకవిని ప్రశంసించుచు కొట్ర బాలకవి చెప్పినట్లు చాటు పద్య రత్నాకరము నందున్న పద్యములు (పుట 85) చాటుపద్య మణిమంజరి ద్వితీయ భాగమునందు (పుట 183) ఎవరో భట్టుకవి చెప్పినవన్నట్లున్నవి.

విజయ రాఘవ నాయకుని యాస్థాన కవయిత్రియు మరియు నాయన కానందకారియునైన రంగాజమ్మ పట్ట మహిషికి ఆ వచ్చిన దూతిక ద్వారా చెప్పి పంపిన జవాబు.

ఏ వనితల్ మముం దలప నేమిపనో ? తమరాడువారు గా
రో ? వలపించు నేర్పెరుగరో? తమ కౌగిటిలోన నుండగా
రావది యేమిరా విజయ రాఘవ యంచిలుదూరి బల్మిచే
తీవరకత్తినై యిటుల తీసుక వచ్చితినా తలోదరీ!

మరియు తదితరములయిన పద్యములు ఆడిదము సూరకవి విజయ రామ రాజును గురించి వ్రాసినవని గురజాడ శ్రీరామమూర్తి పంతులు గారు వ్రాసి నారు.[19]

4. చాటుకవులు

1. వేములవాడ భీమకవి :

నిజముగా చాటు పద్యములన్నవి ఆశువుగా చెప్పబడినవి వేములవాడ భీమకవి నాటి నుండియు కలవు. చాల వరకు కాలగర్భమున కలిసి పోయినవి. చాటువుల వల్లనే భీమకవి అంతటి వాడని మనమిప్పు డనుకొనగలుగుచున్నాము. తన మహనీయ శక్తి యిట్టిదని ఆయనయే చెప్పుకొన్నాడు.

గడియలోపలఁ దాడి గడఁగి ముత్తునియగాఁ
దిట్టిన మేధావి భట్టుకంటె
రెండు గడెల బ్రహ్మదండి ముండ్లన్నియు
దుల్లఁదిట్టిన కవిమల్లుకంటె
మూఁడు గడెలకుఁ దామొనసి యత్తిన గండి
పగులఁ దిట్టిన కవిభాసు కంటె

---

19. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము. పుట. 159.

అఱజాము లోపలఁ జెఱువు నీళ్ళింకంగఁ
దిట్టిన బడబాగ్ని భట్టు కంచె
నుగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మరింప శ క్తి గలదు నాకు
వట్టి బ్రూనఁజిగురుఁ బుట్టింప గిట్టింప
బిరుదు వేములవాడ భీమకవిని.

ఈ వేములవాడ భీమ కవికి ఎందుకో తెలియదు గాని ఆ యూరి కోమటి శెట్టి గారి మీద గట్టిగా కోపము వచ్చినది. ఎన్ని పద్యములలో తిట్టినాడో ఏమో గాని రెండుపద్యములు మాత్రము లభించినవి.

గొనకొని మర్త్య లోకమునఁ గోమటి పుట్టఁగఁదోడఁ బుట్టె బొం
కును కపటంబు లాలనయు కుత్సితబుద్ధియు రిక్తభక్తియున్
చనవరి మాటలున్ పరధనంబును గ్రక్కున మెక్కఁ జూచుటల్
కొనుటయు నమ్ముటల్, మిగుల గొంటుతనంబును మూర్ఖవాదముల్.

కోమటి కొక్కటిచ్చి బదిగొన్నను దోసము లేద యింటికిన్
సేమమెఱింగి చిచ్చిడిన చెందదు పాపము వాని నెప్పుడేన్
ఏమఱుపాటునన్ మరియు నేమి యొనర్చిన లేదు దోస - మా
భీముని లింగమాన కవి భీముని పల్కులు నమ్మియుండుడీ ?

ఈ పద్యాలు ప్రచారము కాగా మరొక కవి విని ఆ కోమటి మీద తన కును కోప ముండియు ఏమియు అనలేక ఇంత కాలమును ఉన్నవాడు ధైర్య ము తెచ్చుకొని తన పక్షముగా భీమకవి మాటాడుచున్నాడు గదా యన్న ఉత్సాహముతో నొక పద్యమును చెప్పెను.

వేములవాడ భీమ! భళిరే! కవిసన్నుత ! పద్యమందు నీ
వేమని చెప్పినాడ వొక యించుక కోమటి పక్షపాతివై
కోమటి కొక్కటిచ్చి పదిగొన్నను దోసములేదటందురా?
కోమటి కొక్కటీక పదిగొన్నను దోసము లేదు లేశమున్,

వేములవాడ భీమకవికి శాపానుగ్రహ సమర్థమైన వశ్య వాక్కు కలదని ప్రసిద్ధి యున్నది. చాళుక్య చొక్క భూపాలుని కోరిక మేరకు మల్లెసాలనున్న స్తంభమును పుష్పఫలభరిత వృక్షముగా చేయుటకు భీమకవి చెప్పినపద్యము.[20]

"ఆసీతాభ్యుపదాన శృంఖల కరాభ్యాలంబిత స్తంభమా?
నేనే వేములవాడ భీమకవినేనిన్ చిత్రకూటంబులో
భూనవ్యాప్తత పల్లవోపలతికా పుష్పోప గుచ్ఛంబులన్
నానా పుష్ప ఫల ప్రదాయి వగుమా యాకల్పవృక్షాకృతిన్.

అట్లే యా స్తంభమప్పటికప్పుడు పుష్పఫల భరిత మగు వృక్షమువలె నయ్యెనట. అట్లు ప్రత్యక్షముగా తన వాక్సిద్ధి లక్షణమును ప్రదర్శించి ఆ వృక్షమును తిరిగి స్తంభముగా చేయుటకు భీమకవి ఈ క్రింది పద్యమును చెప్పెను.

"శంభు వరప్రసాది కవిజాలవరేణ్యుడనైన నావచో
గుంభన మాలకించి యనుకూలత నొంది తనూనభావనన్
గుంభిని చొక్క నామ నృపకుంజరు పందిటి మల్లెసాలకున్
స్తంభము రీతి నీ తనువు దాలిచి యెప్పటి యట్లు యుండుమా."

ఆ సందర్భమున యందీ రెండు పద్యములును ఆశురచనలుగా చెప్పబడినట్లు స్పష్టమగుచునే యున్నది.

కళింగ గంగును శపించి రాజ్యభ్రష్టు గావించినట్లును ఆ పిమ్మట అనుగ్రహమున ఆశీర్వదించి వానికి తిరిగి రాజ్య లాభమును కలిగించినట్లును ప్రసిద్ధముగా నున్న కథయే వేములవాడ భీమకవి నింతవాడుగా నిలబెట్టుకొనుచు వచ్చుచున్నది.

వేములవాడ భీమకవి వేగమె చూచి కళింగ గంగు తా
సామముమాని కోపమున సందడి దీటిన రమ్మొకొమ్మనెన్
మోమును జూడ దోషమిక ముప్పది రెండు దినంబులావలన్
జామున కర్ధమందతని సంపద శత్రుల పాలు గావుతన్.

ఇది శపించిన పద్యము. మొదటి రెండు పాదములలో శాపహేతువున్నది. భీమకవి నాతడు మన్నన చేయ లేదు. ఆ పిమ్మట శాపము ననుభవించుచు

---

20. చాటుపద్య మణి మంజరి. ప్రథమభాగము 113.

కళింగ గంగు భీముకవిని చూచి క్షమించి రక్షింపవేడుకొనగా ప్రసన్నుడై ఈ క్రింది పద్యమును చెప్పెను.

వేయిగజంబులుండ పదివేలు తురంగములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జ నగరంబున పట్టుగట్టుకోవడిన్
రాయ కళింగ గంగు ! కవిరాజ భయంకరమూర్తి జూడగా
బోయెను మీన మాసమున పున్నమ వోయిన షష్ఠినాటికిన్.

ఆ విధముగానే కళింగ గంగు తిరిగి రాజ్యమును పొందెను.

రాము నమోఘబాణమును, రాజశిఖామణి కంటిమంటయున్
భీముగదావిజృంభణ, ముపేంద్రుని వజ్రము, చక్రి చక్రమున్
తామరచూలి వ్రాతయును, తారకవిద్విషు ఘోరశక్తియున్
వేమువాడ భీమకవి వీరుని తిట్టును రిత్తవోవునే ?

ఇది భీమకవి స్వరూప జ్ఞానముతోడి ఆత్మ విశ్వాసము. ఏ మహాకావ్యములు వ్రాయకుండగనే ఆయన నాయన చాటువులే నిలబెట్టుట పరమాశ్చర్యకరమైన విషయము. వ్రాసినను అవి నిలబడలేదు కదా!

2. శ్రీనాథుడు :

సర్వాంధ్ర కవులలోను చాటు పద్యములెక్కువగా చెప్పినకవి శ్రీనాథుడనియే చెప్పవలెను. దేశ సంచారము చేయవలసి వచ్చుటయే అతని జీవితములో చాటు రచనలకు ప్రేరకమైనది. శ్రీనాథుడు కర్ణాట ప్రభునాస్థానమునకు పోయి డిండిమభట్టునోడించి కనకాభిషేకమును చేయించుకొన్న చారిత్రక సత్యమును వాని చాటువులే చాటుచున్నవి.[21] వెంటనే ప్రభువు దర్శనముకాలేదు. కొన్నాళ్లు శ్రీ నాథుడక్కడనే పడియున్నాడు. అప్పటి యాక్రోశమును చాటుచున్న పద్యము.

కుల్లాయుంచితి కోకజుట్టితి మహాకూర్పాసమున్ దొడితిన్
పెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లా: అంబలి త్రావితిన్ రుచులు దోసంబంచుబోనాడితిన్
తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మి! దయలేదా! నేను శ్రీనాథుడన్.

---

21. శృంగార శ్రీనాథము. పుట. 184.

శ్రీనాథుడు రాయల వారికి వ్రాసి పంపిన పద్యము

డంబుసూపి ధరాతలంబుపై తిరుగాడు
కవి మీదగాని నా కవచమేయ
దుష్పయోగంబుల దొరకొని చెప్పెడు
కవి శిరస్సునగాని కాలుచాప
సంగీత సాహిత్య సరస విద్యల నేర్చు
కవుల జొమ్ములు గాని కాల్చి విడువ
చదివి చెప్పగ నేర్చి సభయందు విలసిల్లు
కవినోరుగాని వ్రక్కలుగ దన్న
దంట కవులకు బలువైన యింటి మగడ
కవుల వాదంబు విను వేడ్కగల్గెనేని
నన్ను బిలిపింపు మాస్థాన సన్నిధికిని
లక్షణోపేంద్ర: ప్రౌఢరాయక్షితీంద్ర:

డిండిమభట్టునోడించిన తరువాత కనకాభిషేక సత్కారమును పొంది తననట్లు గౌరవించిన ప్రభువును ప్రశంసించుట కిట్లుపక్రమించి శ్రీ శారదాదేవిని తన యందు మేల్కొల్పుకొనినాడు.

జోటీ : భారతి : యార్భటిన్ మెఱయుమీ చోద్యంబుగా నేను క
ర్ణాటాధీశ్వరు దేవరాయన్నపతిన్ నాసీర ధాటీచమూ
కోటి మోటక ధట్టికా ఖురపుటీ కుట్టాక సంఘట్టన
స్ఫోటీ ధూతధరారజశ్ఛటికాతాంభోటిన్ ప్రశంసించెదన్.

మరియు శ్రీనాథుడు తాను తిరిగిన తావులయందు తనను కష్టసుఖముల రూపమున స్పందింప జేసిన సన్నివేశములనెల్లను చాటువుల యందు నిబద్ధము చేసెను. ఆయన కదియొక అలవాటు. శ్రీనాథుని పలనాటి సంచారము చాల ప్రసిద్ధమైనది[22].

---

22. చాటుపద్య మణిమంజరి. ప్రథమ భాగము పుట. 125.

చిన్న చిన్న రాళ్లు చిల్లరదేవుళ్లు
నాగులేటి నీళ్లు నాపరాళ్లు.
సజ్జజొన్న కూళ్లు సర్పంబులును తేళ్లు
పల్లనాటిసీమ పల్లెటూళ్లు.

అందు నెమలిపురిని గూర్చినది

నెమలిపురి యమపురముగా
యముడాయెను బసివి రెడ్డి యంతకు మిగులన్
యమదూతలైరి కాపులు
క్రమ మెఱుగని దుస్సలైరి కరణా లెల్లన్.

ఒయ్యారములు పోయెడు వయసుకత్తెను చూచి చెప్పినది.

సొగసు కీల్జడదాన సోగకన్నులదాన
వజ్రాలవంటి పల్వారుసదాన
బంగారు జిగిదాన పటువుగుబ్బలదాన
నయమైన యొయ్యారి నడల దాన
తోరంపుకటిదాన తొడల నిగ్గుల దాన
పిడికిట నడగు నెన్నడుము దాన
తళుకు చెక్కుల దాన బెళుకు ముక్కరదాన
సింగాణి కనుబొమ చెలువు దాన
మేలిమి పసిండి రవకడియాల దాన
మించిపోనేల రత్నాల మించుదాన
తిరిగి చూడవె ముత్యాల సరుల దాన
చేరి మాటాడు చెంగావిచీరదాన.

ఈ విధమైన బజారు శృంగారపు పద్యములు చాల శ్రీనాథునివిగా చెప్పబడుచు ప్రచారము సందున్నవి. స్వభావ రమణీయమైన దృశ్యమును వర్ణించెడు పద్యము-

పువ్వులు కొప్పునం దురిమి పొంయగ కైససియాడుచుండగా
చివ్వున పంగసాచి యొక చేతను రోకలి పూని యొయ్యనన్
నవ్వు ముఖంబుతోడ యదు నందను బాదుచు నాథుజూచుచున్
సువ్వియ సువ్వియంచు నొక సుందరి బియ్యము దంచె ముంగిటన్.

మరొక్కటి – రెండు.

తాటంకయుగ ధగ ద్ధగిత కాంతిచ్ఛటల్
చెక్కుటద్దములపై జీరువార
నిటలేందు హరినీల కుటిల కుంతలములు
చిన్నారి మోమున చిందు ద్రొక్క
బంధుర మౌక్తిక ప్రకటహారావళుల్
గుబ్బ చన్నుల మీద గునిసి యాడ
కరకంకణ క్వణ క్వణ నిక్వణంబులు
పరుమాఱు రాతిపై పరిధవిల్ల
ఓరచూపుల విటచి త్త మూగులాడ
బాహుకుశలత జక్కని మోహనాంగి
పాటపాడుచు కూర్చుండి రోటిమీద
పిండి రుబ్బంగ కన్నుల పండువయ్యె.

శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు మహా
భూర్యబ్దములు సితాంభోజనయన !
వరకాంతిరస్తు తావకముఖనఖముల
కాచంద్ర తారకం బబ్జవదన !
మహిమాస్తు నీకటి మధ్యంబులకు మన్ను
మిన్నుగలన్నాళ్ళు మించుబోడి
విజయోస్తు నీ గాన వీక్షల కానీల
కంఠహరిస్థాయిగా లతాంగి
కుశలమస్తు లసచ్ఛాత కుంభకుంభ
జంభభిత్కుంభి కుంభాభిజృంభమాణ
భూరి భవదీయ వక్షోజములకు మేరు
మందరము లుండు పర్యంత మిందువదన !

శ్రీనాథునివని చెప్పబడుచున్నవి యిన్ని చాటుపులు ప్రచారము నందున్నను అవి యన్నియు శ్రీనాథ విరచితములని విద్వాంసు లంగీకరించుటలేదు. ఎవరేపద్యము రచించినను నది శృంగార పరమైనచో శ్రీనాథునకును, హాస్య పరమైనచో తెనాలి రామకృష్ణునకును, వేదాంత పరమైనచో వేమనకును నంట

గట్టు చుండుట లోకములో పరిపాటియైనదనియు, శ్రీనాథునివని తలంచెడు పద్యములలో తురగా రామకవికి వలెనే ఇంకెందరో రచయితలు కలరనియు ఇంతకును నీ చాటుపద్యముల వలన నయ్యెడు ప్రయోజనము లేదనియు, వారభిప్రాయ పడుచున్నారు.[23]

3. అల్లసాని పెద్దన :

శ్రీ కృష్ణదేవరాయలవారి నిర్యాణానంతరం కొన్ని సంవత్సరములు పెద్ద నామాత్యుడు జీవించి యుండి తన ప్రభువును తలచుకొనుచు లోపల లోపల అనుభవించిన దుఃఖమునకు ప్రతీకగా ఈ క్రింది చాటు పద్యము నిలిచియున్నది.

ఎదురై సచో తన మదకరీంద్రము నిల్పి
కేలూత యొసగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళ పురమేగ
పల్లకి తనకేల బట్టియెత్తె
గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమలయందు నిచ్చె
బిరుదై స కవి గండపెండేరమున కీవ
తగుచని తానె పాదమునఁదొడిగె
ఆంధ్ర కవితా పితామహ: అల్లసాని
పెద్దన కవీంద్ర: యని సన్మ్ను బిల్చినట్టి
కృష్ణరాయలతో దివికేగలేక
బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబనగుచు.

రాయల వారి మరణానంతరము గజపతిరాజు కన్నడరాజ్యమును సులభముగా నాక్రమింప వచ్చునని దండెత్తి వచ్చుచున్నాడని తెలిసి-పెద్దనామాత్యుడు వాని కొక సీసపద్యమును వ్రాసి పంపెను.

రాయ రాహత మిండరాచయేనుగు వచ్చి
యారట్ల కోట గోరాడు నాడు
సంపెట నరపాల సార్వభౌముడు వచ్చి
సింహాద్రి జయశిల జేర్చునాడు

---

23. ఆంధ్ర కవి తరంగిణి. అయిదవ సంపుటము. 170, 71

సెలగోలు సింహంబు చేరి ధిక్కృతి కంచు
తల్పుల కరుల డీకొల్పునాడు
ఘనతర నిర్భర గండపెండెరమిచ్చి
కూతు రాయలకొనగూర్చునాడు

ఒడలెఱుంగవొ? చచ్చితొ? యుర్వీలేవొ?
చేరజాలక తలచెడి జీర్ణమైతొ
కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర
తెఱచినిలు కుక్క సొచ్చిన తెఱగు దోప.

ఈ పద్యమును చదువుకొని గజపతిరాజు తనను చూచుకొని తానే సిగ్గుపడి వెను దిరిగి పోయెనని చెప్పుదురు. చారిత్రక విషయాధారములయినపద్యము లివ్వి.[24]

4. తెనాలి రామకృష్ణుడు :

ఓయమ్మలార మందులు
వేయేల మకారకొమ్ము విషకవిగానిన్
వాయెత్త కుండ జేసిన
వాయెత్తదు రామరాయ వసుధేశునకున్.

ఈ పద్యము అళియ రామరాయలకు వాయురోగముగాగా ఆమందులా ఈమందులాయని అంతఃపురమున వారనుకొనగా రామకృష్ణుడు చెప్పినదని చెప్పుచున్నారు. మకారకొమ్ము విషకవియనగా మూర్తికవి. భట్టుమూర్తి కావలయును. వానినోరు మూయించుటయే రాయల వారి రోగమునకు మందని యనుట. చారిత్రక సమస్యలతో కూడుకొన్న పద్యమిది. ఇట్లు భట్టుమూర్తి నాక్షేపించుచునట్లున్నదే మరొక పద్యము.

కెంగేల రామకృష్ణుని
బంగరు కడియంబులుండ పండితుడగునా?
జంగలు జల్లులు గల్గిన
సింగారపుటూరకుక్క సింగంబగునా?

---

24. చాటుపద్య మణిమంజరి. ప్రథమ భాగము. 161.162

మరొక శృంగార కవిత. తప్పించుకొని పోవుచున్న వయసుకత్తి నొకర్తుక నుద్దేశించినదిగా నున్నది.

వరబింబాధరమున్ పయోధరములున్ వక్రాలకంబుల్ మనో
హరలోలాక్షులు జూపకవ్వలి మొగంబైనంతనేమాయెఁ నీ
గురు భాస్వజ్జఘనంబు క్రొమ్మడియు మాకుంజాలవే! గంగ క
ద్దరి మేలిద్దరి కీడునుంగలవె యుద్యద్రాజ బింబాననా !

రామకృష్ణుని వనబడు చాటువులలో పెద్దనామాత్యుని ఆక్షేపించుచున్న ఈ పద్య మును ప్రసిద్ధమైనదే—

ఎమితిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిదిని సెపితో
యుమెతకయతిని సెపితివో
యమవసనిసి యనెడిమాట యలసని పెదనా!

అమావాస్యా - నిశా యనుపదములను కుదిమట్టుచేసి అమవసనిసి అని పెద్దన చేసిన సమాసమును ఆక్షేపించుచు చెప్పిన పద్యముకదా - అందుకని రామ కృష్ణుడు తానును ఆయా పదరూపములను లఘుమయము చేసి చమత్కారము చేసినాడు.

5. కూచిమంచి తిమ్మకవి :

శృంగార ఘట్టమునుండలి యొకచాటువు పరమ రమణీయమైనది కూచిమంచి తిమ్మ కవికి సంబంధించినది కలదు. ఆయన "రసికజన మనోభిరామము" అను కావ్యమును రచించెను. దాని నొక చక్కని రసికురాలయిన వయస్సులో నున్న వేశ్య చదివి ఆ కావ్యమును రచించిన కవియొక్క మహారసికతను భావించుటయే పనిగా భావించినది. ఆమెయును కవయిత్రియే. [కూచిమంచి తిమ్మన్న గారంత అందగాడు కాకపోవుటయే కాక సల్లగా సాలగ్రామమువలె పొట్టిగా, లావుగా, మొరటుగా నుండెడి వాడు. ఆ వేశ్య మనసులో తిమ్మకవి చాల సొగసైనవాడు.] ఆ వీథిన బడి తిమ్మకవి యొకనాడు పోవుచుండగా అతడే తిమ్మ కవియని యెవరో ఆ వేశ్యకు చెప్పిరి. అది తన్మయత్వముచెంది పరుగు పరుగున బోయి ఆ వీథిలో వానిని కౌగిలించుకొనెను. ఆయన తాదృశమైన హఠా త్సంభవమునకు నివ్వెరపడి మొగము త్రిప్పుకొనెను. అప్పుడావేశ్య అన్నది.

"చతురులలోన నీవు కడు జాణ వటంచును నేను కౌగిలించితి నిటు మాఱుమో మిడగ జెల్లునే?"— అని.

ఆ పద్యమునట్లే కొనసాగించుచు సమాధానముగా తిమ్మ కవి యిటుల చెప్పెను.

"ఓ రసికాగ్రగణ్య! యద్భుత మగునట్టి బంగరపు బొంగరపుంగవ బోలు నీ కుచ ద్వితయము బొమ్మునాటి చని వీపున తోచెనొయంచు జూచితిన్."

6. అడిదము సూరకవి :

శాఖా భేదములతో బ్రాహ్మణులు పరస్పరము కలహించుకొనుట అడిదము సూరకవి కాలమునసే మొదలయినదను ఒకానొక సాంఘిక విషయమునకు నిదర్శనముగా చాటువులున్నవి. పదునెనిమిదవ శతాబ్దమున విజయనగర సంస్థానమును బట్టుకొని అడిదము సూరకవి యున్నాడు. రేకపల్లి సోమనాథకవి కూడ ఉన్నాడు. ఆయన నియోగి. ఈయన వైదికి. సత్యవరము కాకర్ల గోపాలరాచు పాయకరావుగారి కాశ్రితుడు. ఒకసారి సోమనాథకవి విజయనగర ప్రభువులను చర్మించి సన్మానమునుపొంది ఇంటికి పోవుచుండగా కోట వాకిట నొక భట్టుకవి సోమకవినిట్లు స్తుతించినాడు.

అప్పా! రేకపలీ సో
మప్పా! విబుధాళి పాళియమృతపులప్పా!
ఒప్పులు నీ కవితలు వె
న్నప్పాలకు సాటివచ్చునౌ బళి! రుచులన్.

ఈ స్తుతికా వైదికపు బ్రాహ్మణుడు పొంగిపోయి రాజుగారు తనకొనర్చిన సన్మానమునా భట్టునకిచ్చి బహూకరించినాడు. ఆ విషయము తెలిసి మహారాజు గారు సోమనాథకవిని పిలిపించి మిక్కిలిగా సన్మానించినాడు. ఇదంతయు ఆస్థానకవియైన అడిదము సూరకవిగారి కసహ్యమైనది. ప్రతివాడును నేనొక కవినని బయలు దేరుచున్నాడన్న యభిప్రాయము నాయన ఇట్లు వ్యక్తము చేసినాడు.

దేవునాన మున్ను దేశానికొక కవి
యిప్పు డూర నూర నింట నింట
నేగురార్గు రేడ్గు రెనమండ్రు తొమ్మండ్రు
పచగురేసి కపులు పద్మనాభ.

ఇంతటితో నాగక సోమనాథ కవిని తిరస్కరించుటకు సూరకవి వాని బ్రాహ్మణ శాఖను పట్టుకొనినాడు. వాని కవిత్వము కవిత్వము కాకపోవుట కదియే హేతువన్న నిశ్చయమునకు కూడ వచ్చినాడు.

చెన్నగు నియోగి కవనము
మిన్నక వైదికున కబ్బి మిగులునె చెపుడీ!
జున్ను రుచి వెన్న కబ్బునె
తన్నుక చచ్చిననుగాని ధరలో నరయన్.

ఈ మాటలు విని సోమనాథ కవి పాత్రమెటుల సహించి యూరకుండ గలడు?

త్యాగము విక్రమంబు సుకృతంబు నిగర్వము నీతి బంధు సం
యోగము పెత్తనంబు వినియోగ మెఱింగి చరింప నేర్చు ని
య్యోగులు రాజయోగులు సయుక్తుల మాయల విజ్ఞవీగు ని
య్యోగు లనాథయోగు లవయోగులు నోగులు జోగులెన్నగన్.

ఈ నియోగి వైదిక భేదంబులతోడి కలహములు కవులయందు తిరుపతి వేంకట కవుల కాలమువరకు సాగినవి. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి చాటు వొకటి ఈ సందర్భమునకు ఋజువుగానున్నది.

చందన శాఖికన్న విరసంబగు బూరుగు మేలటన్న తీ
విందగినట్లు వైదిక కవిత్వ సుధారసధారలెల్ల చె
ల్వొందగ భూతలంబున నియోగి కవిత్వము తోడ సాటిరా
వందురు బెట్టిదం బగునటందురు కొందరు మూఢమానవుల్.

అడిదము సూరకవి.కవిత్వము తనదానికంటె మేలుగా నున్నట్లు రేకపల్లి సోమనాథ కవికి లోపల తెలియును. అయన తనలోపలి యభిప్రాయము నొక చాటువునందు వ్యక్తము చేసినాడు.

ఇలలో వైదిక విద్వ
త్తిలకంబుల కేమిదిక్కు దెలిపితివమ్మా
జిలి బిలి పలుకుల వెలదీ
పలుగాకి నకారగుళ్ళ పాలైతిగదే!
నకారగుళ్ళనగా నియోగులు.

7. వేమూరి సీతారామ శాస్త్రి :

రాగము వీడుకొన్న యతిరాజుల మానసవృత్తికిన్ కడున్
రాగము గూర్చె నీదయిన రాగము వేరె స్తుతింప నేల ఆ
త్యాగయ నీవయై మరల ధ్రా జనింపగబోలు గీతికా
సాగరుడీవు నిన్ పొగడ శక్యమె శ్రీహరి నాగభూషణా!

సరిగమ సానిసారి పమసానిససా యను టుజ్జగించి ఆ
స్వరపచమందు తీర్థమును స్వార్థము గూరుచు రామనామమున్
తరుచుగ పాడి శ్లోకముల తత్పరతన్ పఠియించి గీతికిన్ .
కరమరుదైన క్రొత్త గతి కల్పన చేసి కరంచితేమమున్.[25]

ఈ రెండు పద్యములను శ్రీ వేమూరి సీతారామ శాస్త్రిగారు శ్రీహరి నాగభూషణం గారి గానకచ్చేరి అయిన సందర్భమున ముక్త్యాలలో ఆశువుగా చెప్పినవి. శ్రీ సచ్చిదానంద స్వాములవారు రాజావారి ఆతిథ్యములో చాతుర్మాస్య దీక్షను నిర్వహించినప్పుడు నాగభూషణంగారి కచ్చేరి కవిపండితుల సమక్షమున జరిగినది. శ్రీ సచ్చిదానందు లాగానమునకు లేచి నృత్యము చేసినారట. ఆసందర్భమున సీతారామ శాస్త్రిగారా పద్యములను చెప్పిరి. "రాగము వీడుకొన్న యతిరాజు" లన్నదాని కథయది. రెండవ పద్యమున మరొక రహస్యమున్నది. శ్రీహరి నాగభూషణంగారి గాన కచ్చేరిలో ప్రత్యేకత యేమనగా ఆచమన అందరివలె సరిగమ పదనిసలతో స్వరము వేయక రామ రామ రామ-అని రామ నామస్మరణముతో స్వరము వేసెడివారట. ఆ విషయమును సీతారామ శాస్త్రిగారు రెండవ పద్యమున నమోదు చేసినారు. ఈ విధముగా

---

25. ఆంధ్రప్రభ. 25, ఫిబ్రవరి.

చాటువులు ఆయా కాలములందలి కొన్ని కొన్ని విశేషములను రహస్యములను ఇముడ్చుకొని యుండును.

8. వనమా వేంకట రమణగుప్త :

ఈ యొక రెండు కావ్యముల నీ తెనుగుం బ్రజ ఇన్మజిన్మముల్
ధ్యేయమొనర్చియున్ ఋణము తీర్చగ శక్తముగాదు భారతా
మ్నాయము పూర్వ కావ్యముల నవ్యకవీంద్ర కృతమ్ములందు రా
మాయణ కల్పవృక్ష మధరాధరి తాంధ్రమహా మహీస్థలిన్.

ఇది శ్రీ మద్రామాయణ కిల్పవృక్షమును గూర్చిన చాటువు. దీనిని చెప్పినకవి కీర్తిశేషులు విద్వాన్ వనమా వేంకటరమణ గుప్తగారు. ఇప్పటికి దాదాపిరువది సంవత్సరాల క్రితము గుంటూరు జిల్లా సత్తెనపల్లి హైందవోన్నత పాఠశాల ఉపాధ్యాయుల మధ్యవచ్చిన సాహిత్య గోష్ఠి వివాదములో శ్రీ గుప్తగారువ్వెత్తు గాలేచి ఈ పద్యముతో విజయ దుందుభిని మ్రోగించి తోటివారిని దిగ్భ్రాంతులను గావించినారు. ఈ వ్యాసకర్తకూడ ఆగోష్ఠిలో నొకడుగా నున్నాడు.

ఎదకు పురాంధ్ర సంస్కృత కవీశ్వర భారతి దీప్తికల్గినన్
సదమల బుద్ధికిన్ బహుళశాస్త్ర రహస్య వివేకమబ్బినన్
మదికి ఉదాత్త కల్పనల మక్కువ కల్గిన విశ్వనాథ శా
రద సకలార్థ దాయిని సురద్రువు రాపుకథన్ భజింపుడీ.

ఇది మరొకరు చెప్పినది.

5. చాటు భేదములు

1. పేరడీ చాటువులు :

లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యే ప్రాణంబులున్
తావుల్ దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవేతప్ప నితఃపరం బెరుగ మన్నింపదగున్ దీనునిన్
రావేయీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

ఈ పోతన్నగారి పద్యమునకెవరో అజ్ఞాత కవిప్రాసిన పేరడీ చాటువు—

పూవిల్కాని సరోజబాణముల నంభోజారి మైచాయలన్
భావంబెంతయు దస్సె మేనుబడలెన్ తాపంబురెట్టించె నే
నీవాడన్ మధురాధరంబొసగవే! నిక్కంబుననేలవే!
రావే మానిని! కావవే తరుణి! సంరక్షింపు చంద్రాననా !

ఆధునిక కాలమున ఈ పేరడీ చాటు పద్య రచనా విధానమును చక్కగా సాధనచేసిన కవులు నలుగురైదుగురున్నారు. చాటు శబ్దమును తీసివేసి పేరడీ లనియే వ్యవహరించుటచేత నదియొక అతినవ్య కవితా ప్రక్రియగా చెలామణి యగుచున్నది.[26] జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారికి పేరడీ శాస్త్రిలనియే పేరన్నచో ఆరచనయందెంత సిద్ధహస్తుడో భావింపవచ్చును. మరియు శ్రీశ్రీ, మాచిరాజు దేవీప్రసాదుగారలును మంచి పేరడీలను రచించినారు.

అప్పిచ్చువాడు వైద్యుడు
నెప్పుడు నెడతెగక పారునేరును ద్విజుడున్
చొప్పడిన యూరసుండును
చొప్పడకున్నట్టి యూరు చొరకును సుమతీ!

దీనికి శ్రీశ్రీ ప్రాసిన పేరడీ చాటువు

ఎప్పుడు పడితే అప్పుడు
కప్పెడు కాఫీ నొసంగ గలిగిన సుజనుల్
చొప్పడిన యూరనుండును
చొప్పడకున్నట్టి యూరు చొరకును మువ్వా![27]

ఏదేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

---

26. ఆధునికాంధ్ర కవిత్వము. 669.
27. మూడు యాభయిలు. 7.

నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం
నరజాతి చరిత్ర సమస్తం
రణరక్త ప్రవాహ సిక్తం.[28]

ప్రసిద్ధమైన శ్రీ.శ్రీ. గారి కవితకు శ్రీ మాచిరాజు దేవీప్రసాద్‌గారు రచించిన పేరడీ చాటువు.

ఏరోడ్డు చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
రహదారీ చరిత్ర సమస్తం
ధూళిధూసర పరిన్యస్తం

రహదారీ చరిత్ర సమస్తం
యాతాయాత జనసంయుక్తం
రహదారీ చరిత్ర సమస్తం
పథిక వాహన ప్రయాణసిక్తం![29]

2. గాథా చాటువులు :

ఆధునిక కాలమున శాలివాహన సప్తశతినమూనాలో రచించిన కవితలున్నవి. అవన్నియు చాటు లక్షణ లక్షితములే.[30] విశ్వనాథ పంచశతి - దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి "విశ్వదాభిరామ వినురవేమ" పద్యాలు - శ్రీశ్రీ గారి "సిరిసిరిమువ్వ" పద్యాలు - కొమరవోలు వేంకట సుబ్బారావుగారి "చెరుముకిరవ్వా" పద్యాలు - "వాస్తవమ్ము నార్లవారి మాట" పద్యాలు - పైడి పాటి వారి శత పత్రము మొదలయినవన్నియు గాథా చాటు కావ్యములు. ఒక కవిచేత ఒక ప్రయోజనము నాశించి ఒక పద్ధతిలో ప్రయత్నపూర్వకముగా వ్రాయబడిన సమాజముచెక్కు వేయిముఖములను దేసికదిగా చిత్రించెడి పద్యములు కదా

---

28. మహా ప్రస్థానం. 70.
29. రహదార్లు. భారతి. ఫిబ్రవరి 1949
30. శతకాలూ - ముక్తకాలూ. వ్యాసము. భారతి. మే. 1963.

అవన్నియును: ఒకొక్కక అనుభవము మీద ఒకొక్కక పద్యముగసుక అవన్నియు గాథలే. గాథలన్నియును చాటువులే.

"అతనికేమొ కాపింగు లేదంచువంక
వీడు బియ్యే పరీక్ష తప్పెనని సబురు
పాయ బలికెడు నెగ్గొన్న సంబంధములసు
అంగజున కామె యేసు మేకయ్యె తుచకు.[31]

---

31. విశ్వనాథ పంచశతి.

అనుబంధము

ఇప్పటి మట్టుసకు తెలిసిన అవధానములు చేసి - ఆశువులు చెప్పి- చాటువులు రచించిన కవులు

అప్పల నరసింహ కవి, వక్కి	చా. మం. ద్వి. 170
అమరేశ్వర శాస్త్రి, చతుర్వేదుల	చ. క. 166
అష్టావధాని కవి	ద. వా. చ. 234
అహోబల పండితుడు, గాలి	చా. మం. ప్ర. 178
ఆంజనేయ శాస్త్రి, పుప్పా	చా. మం. ద్వి. 167
ఈరపరాజు	చా. ర. 229
ఓబన కవి, కొమ్మాలపాటి	చా. ర. 105
ఓబళాచార్యులు	చా. మం. ద్వి. 134
కవి చౌడప్ప	ద. వా. చ. 86
కాశీపతి, పోకూరి	— —
కాళహస్తి కవి, రేవూరి	ద. వా. చ. 367
కృష్ణకవి, మంచెళ్ళ	చా. ర. 202
కృష్ణమాచార్య, కోరుట్ల	— —
కృష్ణమూర్తి, శిష్టు	చా. ర. 55,63.
కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద	— —
కృష్ణయామాత్యుడు, వెల్లపూడి	ద. వా. చ. 389
కృష్ణశాస్త్రి, దేవులపల్లి	— —
కృష్ణాంబ	ద. వా. చ. 114
కృష్ణాచార్యులు, కాశీ	— —
కొప్పరపు కవులు	కొ. సో. చ.
కోనమరాజు, వద్దిపర్తి	ఆంధ్రప్రభ, 30-6-1963
కోలాహలుడు	చా. ర. 25
క్షేత్రయ్య	ద. వా. చ. 86

గిరిరాజ కవి	ద. వా. చ. 247
గోపన, పలకలూరి	అ. క. 3-231
గౌరరాజు	అ. క. 3-158
చంద్రమౌళి శాస్త్రి, విరాల (అ)	— —
చంద్రశేఖర కవి	చా. మం. ద్వి. 166
చిట్టప్ప, నాగళ్ళ	చా. మం. ద్వి. 116
చిదంబర శాస్త్రి, పిఠుపాటి	— —
తాతాచార్యులు, తిరుమల బుక్క-పట్టణం	చా. ర. 91
తిప్పన, దిట్టకవి	చా మం. ద్వి. 127
తిప్పరాజు, రావిపాటి	అ. క. 3-60
తిమ్మకవి	చా. ర. 17
తిమ్మకవి, కూచిమంచి	చా. ర. 89
తిమ్మకవి, పుష్పగిరి	చా. మం. ద్వి. 127
తిరుపతి వేంకట కవులు	— —
త్రిపురాంతకుడు, కొప్పోలు	చా. మం. ద్వి. 116
త్రిపురాంతకుడు, రావిపాటి	చా. మం. ప్ర. 75
దత్తప్ప, మోచర్ల	చా. ర. 111
దేవరాజ సుధీమణి, తంజనగరం	— —
దేవీప్రసాదు, మాచిరాజు	— —
ధూర్జటి కవి, కోట	చా. ర. 101
నరస కవి, చెళ్ళపిళ్ళ	చా. ర. 69
నరసకవి, పూరె	చా. ర. 90
నరసింహ కవి, ఉప్పల	చా. ర. 129
నరసింహ భారతీ స్వామి	చా. మం. ద్వి. 170
నరసింహారావు, కాకాని	— —
నారాయణకవి, వేంకటరావుపేట	— —
నారాయణకవి, గండభట్టు	చా. ర. 147
పట్టాభిరామరాజు, రాళ్ళభండి	చా. ర. 106
పరతన్న, ఎడవల్లి	అ. క. 3-33
పర్వతాలు	చా. మం. ద్వి. 131

పాపనకవి, అత్తలూరి	చా. ర. 101
పార్వతీశ్వరశాస్త్రి, మండపాక	— —
పిచ్చయ్య శాస్త్రి - ఉప్పల	చ. క. 160
పినవీరభద్రుడు, పిల్లలమఱ్ఱి	చా. మం. ప్ర. 35
పుల్లకవి	చా. ర. 110
పెదపాపరాజు, బొగ్గవరపు	చా. ర. 103
పెద్దన, అల్లసాని	చా. ర. 12
పెద్దనగారి కూతురు	చా. ర. 14
పెద్దదాసు	చ. వా. చ. 164
పెద్దిరాజు రామరాజు - ఈవని	అ. క. 3-232
పేరయ్యశాస్త్రి, భారతుల	చా. ర. 127
పోతరాజు, బమ్మెర	చా. ర. 8
ప్రసాదరాయకులపతి	— —
బక్కన్నప్ప కవి, ఉప్పల	చా. ర. 130
బాలకవి, కొట్రు	చా. ర. 84
బాల బ్రహ్మచారి, కోడూరి	— —
బాలభాస్కరకవి, ఆడిదము	చా. మం. ప్ర. 172
బాలసరస్వతి, ఎలకూచి	చా. మం. ప్ర. 13
బాల సరస్వతి, నక్కలపాటి	చా. మం. ప్ర. 174
బుచ్చన్న శాస్త్రి, వజ్ఝుల	చా. మం. ద్వి. 169
బుచ్చయ్యశాస్త్రి	చా. ర. 127
బుచ్చిరామకవి, కొప్పరపు	కొ. సో. చ. 136
బుచ్చి వెంకు	చా. ర. 227
బెణక కవి	చ. మం. ద్వి. 124
భాగవతకవి, సత్యవోలు	చా. మం. ప్ర. 7
భట్టుకవి, కుంకలగుంట	చా. ర. 158
భట్టుకవి	చా. ర. 17
భట్టుకవి	చా. మం. ప్ర. 109
భట్టుమూర్తి	చా. మం. ప్ర. 103
భద్రమంత్రి	చా. మం. ద్వి. 116

భరతశర్మ, పేరాల	— —
భానుమూర్తి, చెన్నాప్రెగడ	కా. సో. చ. 15
భాస్కరుడు, హుళక్కి	అ. క. 3-22
భీమకవి, వేములవాడ	చా ర. 5
మంగయ్యకవి, వద్దిపర్తి	చా. మం. ద్వి. 168
మధురవాణి	ద. వా. చ. 30
మన్నారయ్య	ద. వా. చ. 528
మన్నారు కవి	చా. ర. 195
మల్లన, ప్రౌఢకవి	చా. ర. 86
మల్లయ్యకవి, మిక్కిలి	చా. మం. ద్వి. 173
మల్లశాస్త్రి, బంకుమల్లి	శ. సా: 169
మల్లావధాని, గరికపాటి	న. సా. వీ. 4-657
రంగాజమ్మ	చా. మం. ప్ర. 64
రఘునాథనాయకుడు	ద. వా. చ. 34
రణతిక్కన తల్లి	చా. మం. ప్ర. 24
రణతిక్కన భార్య	చా. మం. ప్ర. 24
రమణప్ప, బండా	చా. ర. 151
రాజమన్నారు కవి, కార్యముపూడి	శ. సా. 182
రాజశేఖర శతావధాని	— —
రామకవి	చా. మం. ద్వి. 172
రామకవి, తురగా	చా. ర. 96
రామకవి, సోమరాజు	చా. ర. 98
రామకృష్ణకవి, తెనాలి	చా. ర. 14
రామకృష్ణకవి, వేంకటరావుపేట	— —
రామకృష్ణశాస్త్రి, గౌరావధుల	చ. క. 162
రామకృష్ణ సీతారామ సోదర కవులు	న. సా. వీ. 1-35
రామచంద్రయ్య, పంగులూరి	కా. సో. చ. 13
రామన, అయ్యనవోలి	చా. మం. ద్వి. 10
రామ భద్రాంబ	ద. వా. చ. 27
రామభద్రుడు, మొగతాటి	చా. ర. 146

రామస్వామి చౌదరి, త్రిపురనేని	న. సా. పీ. 135
రుక్మిణీనాధశాస్త్రి, జలసూత్రం	— —
రుద్రకవి, కందుకూరి	చా. ర. 51
లక్ష్మణకవి, ఏనుగు	చా. ర. 53
లక్ష్మణకవి, పిండిప్రోలు	చా. ర. 55
లక్ష్మీపతి కవి, కాశీ	చా. ర. 10
లక్ష్మీనరసింహశర్మ, గుమ్మన్నగారి	— —
లింగన్నశాస్త్రి, కాకర్ల	చా. ర. 291
లీలావతి	ద. వా. చ. 131
వాసుదేవకవి, పుంచెల్ల	చా. మం. ద్వి. 165
విజయనరసింహాచార్యుడు, ఉత్పల	చా. మం. ద్వి. 165
విరూపాక్షశాస్త్రి, వట్టిం	చా. మం. ప్ర. 68
వీరనాగకవి.	చా. ర. 101
వీరభద్రకవి, పూరె	చా. ర. 131
వీరభద్రకవి, వక్కలంక	చా. మం. ద్వి. 126
వీరభద్రయ్య	చా. ర. 190
వీరరాఘవశాస్త్రి, గాదేపల్లి	చ. క.
వీరాంజనేయశర్మ, కోట	— —
వెంకంరాజు, తురగా.	చా. ర 109
వెంకనకవి, చుదురుపాటి	ద. వా. చ. 411
వెంకన్న, మోచెర్ల	చా. ర. 111
వెంకటకృష్ణప్ప నాయకుడు, సముఖము	ద. వా. చ. 353
వెంకటకృష్ణశాస్త్రి, ములుకుట్ల	శ. సా. 184
వెంకటయ్య, రాచపూడి	అ. క. 3-236
వెంకటరంగశాస్త్రి, శతఘంటం	కా. సో. చ. 13
వెంకటరమణగుప్త, వనమా	— —
వెంకటరామరాజు - తురగా	చా. మం. ద్వి. 136
వెంకటశాస్త్రి, ఉప్పల	చ. క. 1615
వెంకట శేషశాస్త్రి, గడియారం	— —
వెంకట సుబ్బారావు, కొమరువోలు	— —

వెంకట సుబ్బకవి, కృష్ణిపాటి	చా. మం. ద్వి. 133
వెంకట సుబ్బశాస్త్రి, రాళ్ళబండి	గీర. 196
వెంకటస్వామి గుప్త, దోమా	చ. క. 167
వెంకటాచలకవి, కుందుర్తి	— —
వెంకటాచార్యుడు, మాడభూషి	చా. మం. ద్వి. 137
వెంకటావధాని, దివాకర్ల	— —
వెంకటేశ్వరరావు - నార్ల	— —
శంకరకవి, మోదుకూరి	చా. ర. 52
శరభకవి, మాగాపు	చా. ర. 62
శివరామశాస్త్రి, వేలూరి	— —
శేషయకవి.	ద. వా. చా. 528
శ్రీగిరి కవి, సోమరాజు	చా. ర. 98
శ్రీనాథ కవిసార్వభౌముడు	చా. ర. 9
శ్రీనివాస తాతాచార్యులు, శతక్రతు	ద. వా. చా. 161
శ్రీరాయ రఘునాథ తొండమాన్	ద. వా. చ. 419
శ్రీ.శ్రీ.	— —
సంజీవరాయ కవి, నక్కలపాటి	చా. ర. 53
సంపత్కుమారాచార్యులు, చూపాటి	— —-
సత్యనారాయణ, విశ్వనాథ	— —
సర్వశాస్త్రి, శిష్టు.	చా. మం. ద్వి. 134
సింగరాజు.	చా. ర. 150
సింహాద్రినరసింహకవి, ఉప్పల	చా. ర. 128
సీతారామప్రసాదరావు, కొప్పరపు	కొ. సో. చ. 137
సీతారామయ్య	చా. ర. 186
సీతారామచంద్రమూర్తి, నల్లపరాజు	చా. మం. ద్వి. 128
సీతారామయ్య, నుదురుపాటి	ద. వా. చ. 410
సుప్రసన్నాచార్యులు, కోవెల	— —
సుబ్బన్న శతావధాని	— —
సుబ్బరాజు - వేనుగుధాటి	చా. ర. 198
సుబ్బరామకవి, గోపాలుని	చ. క. 156

సుబ్బరామ శాస్త్రి, పైడిపాటి	— —
సుబ్బరాయడు, కుంచాల	చా. ర. 158
సుబ్బరావు, వాలివి కొలను	కా. సో. చ. 61
సుబ్రహ్మణ్యకవి, అల్లమరాజు	చా. మం. ద్వి. 61
సుబ్రహ్మణ్యశాస్త్రి, అనుముల	చ. క. 26
సుబ్రహ్మణ్యశాస్త్రి, జంధ్యాల	— —
సుబ్రహ్మణ్యశాస్త్రి, వారణాసి	చా. మం. ద్వి. 167
సూరకవి, అడిదము	చా. ర. 77
సూరపరాజు	చా. ర. 229
సూర్యశేఖర కవి	చా. ర. 193
సోమనాథకవి, రేకపల్లి	చా. ర. 70
హనుమచ్ఛాస్త్రి, జూపూడి	గీర. 179


సంకేత సూచిక

అ. క.	అప్పకవీయము.
కొ. సో.చ.	కొప్పరపు సోదరకవుల చరిత్ర.
గీర	గీరతము.
చ.క.	చమత్కార కవిత్వము
చా.మం.ప్ర.	చాటు పద్యమణిమంజరి, ప్రథమ భాగము
చా మం.ద్వి.	చాటు పద్యమణిమంజరి, ద్వితీయభాగము
ద.వా.చ.	దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయ చరిత్ర
న.సౌ.పీ.	నవ్యాంధ్ర సాహిత్యపీఠులు.
శ.సా.	శతావధాన సారము.

95

96 PMCO1B117.

"దేశభాషలందు తెలుగు లెస్స"



ప్రపంచ తెలుగు మహాసభలు

1975. ఏప్రిల్ 12 - 18

మనసు ఫౌండేషన్	పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PMC01B 117
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25-09-23
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	107
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	[illegible] 95
లేని పేజీలు	No
తయారు చేసినది	ch. manasa
పేజీలు విడదీసినది	manasa
స్కాన్ చేసినది	Mounika
పరీక్ష చేసినది	Hema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	